www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
శనివారం
19-10-2024
సంపుటి : 01 | సంచిక : 167 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్


డా॥ కాచం సత్యనారాయణ
CMD



## ప్రపంచ ఆర్థికవ్యవస్థలో భారత్‌ది మెరుగైన వృద్ధి రేటు

- మెజార్టీ పాత్ర దేశీయ మార్కెట్లదే
- ఆరోగ్యకరమైన వాతావరణానికి ఇది సూచిక
- ఆర్థికవృద్ధిలో మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంచాలి
- ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా

2



## ప్రభుత్వ వ్యతిరేక శక్తులపై తీవ్ర అణచివేత

- హసీనా హయాంలో ధిక్కరిస్తే చీకటి జైలుకే
- దాదాపు 700 మంది అదృశ్యం
- ది న్యూయార్క్ టైమ్స్ కథనం వెల్లడి

2



## యూఏఈ వెళ్లేందుకు వీసా ఇక సులువు

- వీసా-ఆన్-అరైవల్ ప్రారంభం
- 14 రోజుల వ్యవధితో కూడిన వీసాను ఎయిర్‌పోర్టులోనే పొందే అవకాశం
- భారత రాయబార కార్యాలయం వెల్లడి

2

## సుప్రీంకోర్టు చరిత్రలో మరో కొత్త అధ్యాయం

- ఇకపై అన్ని కేసుల విచారణ లైవ్ స్ట్రీమింగ్‌లో!
- ప్రత్యేక యాప్ ప్రయోగాత్మక పరీక్ష
- అమల్లోకి రానున్న రెండేళ్ల కిందటి నిర్ణయం



2



# స్కిల్‌కు అదానీ తోడ్పాటు

### యూనివర్సిటీకి రూ.100 కోట్ల విరాళం

సీఎం రేవంత్ రెడ్డిని కలిసి చెక్కు అందజేత

నైపుణ్యాభివృద్ధి, యువత సాధికారత కోసం చేపట్టే కార్యక్రమాలకు మద్దతు అందిస్తాం

గౌతమ్ అదానీ ప్రకటన

**విశ్వంభర, హైదరాబాద్:**

విద్యార్థులు, యువతలో నైపుణ్యాలను మెరుగుపరిచి, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు పారిశ్రామిక సంస్థల భాగస్వామ్యంతో నెలకొల్పిన యంగ్ ఇండియా తెలంగాణ స్కిల్స్ యూనివర్శిటీకి ప్రఖ్యాత అదానీ గ్రూప్ రూ. 100 కోట్ల విరాళం అందించింది. అదానీ గ్రూప్ చైర్‌పర్సన్ గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ ఫౌండేషన్ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి ఈ మేరకు విరాళం చెక్కును అందజేశారు. నైపుణ్యాభివృద్ధి, యువత సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు నిరంతర మద్దతు ఉంటుందని గౌతమ్ అదానీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి , ఇతర అధికారులు కూడా ఉన్నారు. యువతకు నైపుణ్యాలు నేర్పించేలా రంగారెడ్డి జిల్లాలో ముచ్చర్లలోని బేగరికంచెలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఈ వర్సిటీకి శంకుస్థాపన చేశారు. 17 రకాల కోర్సుల్లో యువతకు శిక్షణ ఇచ్చి ప్రైవేటు సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఏటా లక్షమందికి శిక్షణ ఇచ్చేలా రాబోయే కాలంలో ఈ వర్సిటీని విస్తరించనున్నారు. బేగరికంచెలో సొంత భవనం పూర్తయ్యే వరకు గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా భవనంలో వర్సిటీ కార్యకలాపాలు కొనసాగనున్నాయి. ఈ ఏడాది నుంచే ప్రవేశాలు కల్పించే ఉద్దేశంతో ఇప్పటికే మిగతా2లో...

### మూసీ పరీవాహకవాసులకు

# పునరావాసం

వారి ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత

పునరావాస మహిళా సంఘాలకు రూ.3.44 కోట్ల చెక్కులు

పంపిణీ చేసిన మంత్రి సీతక్క




**విశ్వంభర,హైదరాబాద్:** మూసీ పరీవాహక ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి పునరావాసం కల్పించి, వారి ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందని మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) పేర్కొన్నారు. శుక్రవారం ప్రజా భవన్ లో నిర్వహించిన కార్యక్రమంలో మూసీ పరీవాహక ప్రాంతాల స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ... ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వెళ్ళేటప్పుడు జరిగే బాధను గుర్తుచేస్తూ, ఇటీవల ఖమ్మం, మహబూబాబాద్ వంటి ప్రాంతాలు వరదల వల్ల నష్టపోయాయని, అలాగే మూసీ మురికి నీటి కారణంగా అనారోగ్య సమస్యలు వచ్చాయన్నారు. ముఖ్యమంత్రి ఆ నీటిని తాగదగిన స్థాయికి తీసుకు రావడానికి మిగతా2లో...

## చిక్కుల్లో మహారాష్ట్ర సీఎం

## షిండే కుమారుడు

- ఉజ్జయిని మహాకాళి ఆలయం గర్భగుడిలోకి అనుమతిపై విమర్శలు
- ఏడాదిగా గర్భగుడిలోకి ప్రవేశంపై నిషేధం
- ఎన్నికల వేళ వేడిగా మారిన మహారాష్ట్ర రాజకీయం

2



### గ్రూప్-1 అభ్యర్థులకు బీఆర్ఎస్

# అండగా ఉంటుంది

- అణచివేతలు మళ్లీ ప్రారంభమయ్యాయి
- లాఠీచార్జీని ఖండిస్తున్నాం: కేటీఆర్

**విశ్వంభర, హైదరాబాద్:** అశోక్‌నగర్‌లో గ్రూప్-1 అభ్యర్థులపై జరిగిన లాఠీఛార్జిని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఖండించారు.



2


## ప్రత్యేకమైన కేసులు సీఐడీకి బదిలీ

2

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి

## ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలబడాలి

- మోడీ నుంచి అందరూ నేర్చుకోవాలి
- పట్టుదల కృషివల్లే మూడోసారి ప్రధాని అయ్యారు
- సీట్ల కేటాయింపులో అన్ని వర్గాలకు ప్రాధాన్యం కల్పించాం
- రాజకీయ పార్టీ కుటుంబం లాంటిదే
- ప్రజలు మనను విశ్వంసించారు.. హామీలు నెరవేర్చాలి
- టీడీపీ ఎంపీ,ఎమ్మెల్యే,ఎమ్మెల్సీల సమావేశంలో ఏపీ సీఎం చంద్రబాబు



10

### గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు

# మార్గం సుగమం

షెడ్యూల్ ప్రకారమే ఈనెల 21 నుంచి పరీక్షలు

మెయిన్స్ పరీక్ష పిటిషన్లను కొట్టి వేసిన తెలంగాణ హైకోర్టు

సింగిల్ బెంచ్ తీర్పును సమర్థించిన డివిజన్ బెంచ్

అభ్యర్థులకు బయోమెట్రిక్ హాజరు

తప్పనిసరిగా చేయాలని కోర్టు ఆదేశం



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో ఈనెల 21 నుంచి నిర్వహించనున్న గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు మార్గం సుగమం అయింది. గ్రూప్-1 పరీక్షలపై దాఖలైన పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. సింగిల్ బెంచ్ తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ సమర్థించింది. షెడ్యూల్ ప్రకారమే ఈనెల 21 నుంచి గ్రూప్-1 ప్రధాన పరీక్షలు నిర్వహించాలని తీర్పు వెలువరించింది. అభ్యర్థులకు బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా చేయాలని కోర్టు ఆదేశించింది. రాష్ట్రంలో ఈ నెల 21 నుంచి 27 వరకు గ్రూప్-1 ప్రధాన పరీక్షల నిర్వహణకు టీజీపీఎస్సీ ఏర్పాట్లు పూర్తి చేసింది. గ్రూప్-1 ప్రధాన పరీక్షల నిర్వహణకు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 46 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటికి 31,383 మంది మిగతా2లో...

### తెలంగాణలో 9 యూనివర్సిటీలకు

# వీసీల నియామకం

**ఉత్తర్వులు జారీ చేసిన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ**

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో పలు వర్సిటీలకు వీసీలను నియమిస్తూ తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ప్రభుత్వం వీసీల నియామకానికి దరఖాస్తులు స్వీకరించింది. దాదాపు 1380కిపై దరఖాస్తులు మిగతా2లో...





## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 120 | ₹ 142 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 206 | ₹ 234 |

## పంచాంగం

**19-10-2024, శనివారం**

శ్రీ క్రోధినామ సంవత్సరం
ఆశ్వయుజ మాసం కృష్ణపక్షం
**తిథి:** విదియ ఉ.09.51వరకు తర్వాత తదియ (పూర్తి)
**నక్షత్రం:** భరణి ఉ.10.48వరకు
**సూర్యోదయం:** ఉ.6.13
**సూర్యాస్తమయం:** సా.5.48
**వర్జ్యం:** రా.09.39 నుంచి రా.11.06వరకు
**దుర్ముహూర్తం:** ఉ.07.46 నుంచి ఉ.08.32వరకు
**రాహుకాలం:** ఉ.09.07 నుంచి ఉ.10.34వరకు
**అమృత ఘడియలు:** ఉ.06.30 నుంచి ఉ.07.56 వరకు

# ప్రభుత్వ వ్యతిరేక శక్తులపై తీవ్ర అణిచివేత

**న్యూయార్క్:** భారత్‌లో ఆశ్రయం పొందుతున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు సంబంధించి సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. రాజకీయ ప్రత్యర్థులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పే వారిని 'హౌస్ ఆఫ్ మిర్రర్'గా పిలిచే చీకటి జైళ్లలో బంధించారనే ఆరోపణలు ఉన్నాయి. వారిలో కొందరు చనిపోగా.. వందలాది మంది కనిపించకుండా పోయారనే వాదన ఉంది. వీటికి సంబంధించిన సంచలన విషయాలతో ది న్యూయార్క్ టైమ్స్ తాజా కథనం ప్రచురించింది. బంగ్లాదేశ్ ప్రధానిగా 2009లో షేక్ హసీనా అధికారం చేపట్టిన తర్వాత.. ప్రభుత్వ వ్యతిరేక శక్తులపై అణచివేత మొదలుపెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ర్యాలీలు నిర్వహించినా, నిరసనలో భాగంగా రోడ్లను నిర్బంధించినా.. ఆందోళనకారులను భద్రతా దళాలు అదుపులోకి తీసుకునేవి. వీరిని ఎటువంటి విచారణ లేకుండా రహస్య జైళ్లలో ఉంచేవారు. 2009 నుంచి దాదాపు 700 మంది అదృశ్యమైనట్లు మానవ హక్కుల సంఘాల అంచనా. వాస్తవంగా ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉండొచ్చని వాదన.

**ఏమిటీ ఐనాఘర్?**

బంగ్లాదేశ్ సైన్యం భూగర్భంలో అనేక రహస్య నిర్బంధ కేంద్రాలను నిర్మించింది. వీటినే 'ఐనాఘర్'గా పిలుస్తారు. ఇందులో ఉండే ఖైదీలు తమను కాకుండా మరో వ్యక్తిని చూడలేరు. అందుకే వాటిని 'హౌస్ ఆఫ్ మిర్రర్'గా వ్యవహరిస్తారు. కిటికీలు కూడా ఉండవు. చేతికి ఎప్పుడూ సంకెళ్లు ఉంటాయి. వరుసగా గదులు ఉన్నప్పటికీ.. ఒకరినొకరు చూసుకునే వీలుండదు. ఓ మూలకు టాయిలెట్లు ఉంటాయి. ప్రతి సెల్‌లో ఎగ్జాస్ట్ ఫ్యాన్ మాత్రం ఉంటుంది. బయట ప్రపంచానికి సంబంధించి ఏ చిన్న వార్త కూడా జైలర్లు ఖైదీలకు చెప్పరు. వీటి నిర్వహణను సైన్యానికి చెందిన నిఘా విభాగం చూసుకుంటుంది. ఇక్కడ ఖైదీలు టార్చర్ అనుభవించాల్సిందే. తరచూ వైద్య పరీక్షలు, ఐదారు నెలలకొకసారి జుట్టు కత్తిరించడం చేసినప్పటికీ.. ఖైదీలను మానసికంగా హింసించడమే సైన్యం ఉద్దేశం అని ది న్యూయార్క్ టైమ్స్ తాజా కథనంలో పేర్కొంది. బంగ్లాదేశ్‌కు చెందిన అహ్మద్ బిన్ ఖాసిం ఓ న్యాయవాది. దాదాపు ఎనిమిదేళ్లు అందులో గడిపిన ఆయన.. ఇటీవల బయటకు వచ్చారు. కళ్లకు



గంతలు, చేతులకు బేడీలతో బయటకు తీసుకువచ్చారని.. తొలిసారి స్వచ్ఛమైన గాలి పీల్చుకున్నానంటూ ఓ అంతర్జాతీయ మీడియాతో చెప్పాడు. ఇలా ఈ రహస్య జైళ్లకు సంబంధించిన అనేక మంది ఖైదీలు బయటకు చెప్పినప్పటికీ.. అవి ఉన్న ప్రాంతం గురించి మాత్రం కచ్చితంగా చెప్పలేకపోవడం గమనార్హం.

## స్కిల్‌కు అదానీ తోడ్పాడు

(మొదటి పేజీ తరువాయి)
దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నవంబరు 4వ తేదీ నుంచి స్కిల్ యూనివర్సిటీలో కోర్సులు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతానికి ప్రాధాన్యం ఉన్న ఆరు కోర్సులతో మొదలు పెట్టి క్రమంగా కోర్సులను పెంచనున్నారు. ఈ వర్సిటీకి ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్‌మహీంద్రా ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.

## ప్రపంచ ఆర్థికవ్యవస్థలో భారత్‌ది మెరుగైన వృద్ధి రేటు

**వాషింగ్టన్:** ఆర్థికవ్యవస్థలో భారత్ పాత్ర గురించి ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ ఆర్థికవ్యవస్థలో భారత్ వృద్ధి రేటు మెరుగ్గా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈవిషయంలో ఏ సందేహం లేదన్నారు. భారత్ వృద్ధి రేటు పెరుగుదలలో మెజార్టీ పాత్ర దేశీయ మార్కెట్లదేనని.. ఆరోగ్యకరమైన వాతావరణానికి ఇది సూచిక అని తెలిపారు. త్వరలో నిర్వహించనున్న ప్రపంచ బ్యాంకు అంతర్జాతీయ వార్షిక సమావేశానికి సంబంధించిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే, దేశ ప్రజల జీవన నాణ్యత, పరిశుభ్రమైన గాలి, నీటి లభ్యత గురించి భారత్ చర్యలు చేపట్టాలని అజయ్ బంగా సూచించారు. భవిష్యత్తులో ఈ అంశాలపై భారత్ మరిన్ని ప్రాజెక్టులు రూపొందించాలని కోరుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆర్థికవృద్ధిలో మహిళల భాగస్వామ్యాన్ని భారత్ మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. దేశాల సుస్థిర అభివృద్ధికి ప్రపంచబ్యాంకు మద్దతిస్తుందన్నారు.

## సుప్రీంకోర్టు చరిత్రలో మరో కొత్త అధ్యాయం

**దిల్లీ:** సుప్రీంకోర్టు చరిత్రలో మరో కొత్త అధ్యాయం మొదలు కానుంది. ఇకపై సుప్రీంలో జరిగే అన్ని కేసుల విచారణను లైవ్ స్ట్రీమింగ్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందుకోసం రూపొందించిన యాప్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షించారు. ఈ క్రమంలో లోటుపాట్లను సవరించి త్వరలో అమలులోకి తీసుకురానున్నారు. సరిగ్గా రెండేళ్ల క్రితం రాజ్యాంగ ధర్మాసనం కేసుల విచారణ ప్రత్యక్ష ప్రసారం ప్రారంభమైంది. యూట్యూబ్ వేదికగా వాటిని ప్రసారం చేస్తున్నారు. ప్రత్యక్ష ప్రసారంలో తొలి విచారణ 'సేన వర్సెస్ సేన' కేసుపై జరిగింది. మహారాష్ట్ర శివసేన పార్టీలో శిందే వర్గం తిరుగుబాటు, ఠాక్రే నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం కూలిపోవడం వంటి పరిణామాలపై సుప్రీంకోర్టులో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. అసలైన శివసేన తమదేనంటూ ఠాక్రే, శిందే వర్గాల మధ్య పోరు నెలకొన్న నేపథ్యంలో ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపింది. కేసుల విచారణలను లైవ్ స్ట్రీమింగ్ చేయడానికి అనుకూలంగా సుప్రీంకోర్టు 2018లోనే నిర్ణయం తీసుకున్నప్పటికీ.. ఆచరణలోకి రాలేదు. అయితే, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎన్.వి.రమణ పదవీ విరమణ రోజు.. ఆయన నేతృత్వంలోని ధర్మాసనం కార్యకలాపాలను దేశ ప్రజలంతా వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. సుప్రీంకోర్టు కార్యకలాపాలను ప్రత్యక్ష ప్రసారం చేయడం అదే తొలిసారి. ఆ తర్వాత రాజ్యాంగ ధర్మాసనం విచారణలను లైవ్ స్ట్రీమింగ్ చేయాలని రెండేళ్ల క్రితం నిర్ణయం తీసుకున్నారు. ఈ చారిత్రక నిర్ణయంతో పౌరసత్వ సవరణ చట్టం, ఆర్టికల్ 370 వంటి కీలక కేసులకు సంబంధించిన విచారణల వంటివాటిని దేశ ప్రజలంతా ప్రత్యక్షంగా వీక్షించారు.

## యూఏఈ వెళ్లేందుకు వీసా ఇక సులువు

**అబుదాబి:** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కు వెళ్లే భారతీయులు ఇక సులువుగా వీసా పొందవచ్చు. యూఏఈలో దిగిన వెంటనే వీసా పొందే అవకాశం అందుబాటులోకి వచ్చింది. ఇందుకోసం వీసా-ఆన్-అరైవల్ యూఏఈ ప్రారంభించినట్లు అక్కడున్న భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. అర్హత కలిగిన భారతీయ పౌరులు.. 14 రోజుల వ్యవధితో కూడిన వీసాను యూఏఈ ఎయిర్‌పోర్టులోనే పొందే అవకాశం ఉంటుందని తెలిపింది. వీసా-ఆన్-అరైవల్ సదుపాయానికి సంబంధించి పలు అంశాలను భారత్ రాయబార కార్యాలయం వెల్లడించింది. అమెరికా జారీచేసిన గ్రీన్ కార్డు లేదా చెల్లుబాటయ్యే వీసా, యురోపియన్ యూనియన్ దేశాలు, యూకే దేశాలు ఇచ్చిన రెసిడెన్స్, వీసాలు కలిగి ఉన్నవారు వీటిని పొందవచ్చు. పాస్‌పోర్టు కనీసం 6 నెలలు చెల్లుబాటు అయ్యేలా ఉండాలి. తొలుత 14 రోజుల వ్యవధితో కూడిన వీసా పొందవచ్చని, మరో 14రోజులు పొడిగించుకునే అవకాశం ఉంటుంది. లేదా పొడిగింపునకు వీలుకాని 60 రోజుల వ్యవధితో కూడిన వీసాను తీసుకునే వెసులుబాటు ఉంది.

## తెలంగాణలో 9 యూనివర్సిటీలకు వీసీల నియామకం

(మొదటి పేజీ తరువాయి)
రావడంతో అర్హుల ఎంపిక బాధ్యతను విద్యాశాఖ సెర్చ్ కమిటీలకు అప్పగించింది. దరఖాస్తులను పరిశీలించిన సెర్చ్ కమిటీ.. ఒక జాబితాను ఇటీవల గవర్నర్‌కు పంపింది. ప్రభుత్వం పంపిన జాబితాకు ఆమోదం తెలిపిన గవర్నర్.. తొమ్మి వర్సిటీలకు వీసీలను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

**కొత్తగా నియమితులైన వీసీలు వీరే...**

- పాలమూరు యూనివర్సిటీ- జి.ఎన్.శ్రీనివాస్
- కాకతీయ యూనివర్సిటీ- ప్రతాప్‌రెడ్డి
- ఓయూ - ఎం. కుమార్
- శాతవాహన వర్సిటీ: ఉమేశ్ కుమార్
- తెలుగు వర్సిటీ - నిత్యానందరావు
- మహాత్మాగాంధీ వర్సిటీ- అల్తాఫ్ హుస్సేన్
- తెలంగాణ యూనివర్సిటీ - యాదగిరిరావు
- జయశంకర్ వర్సిటీ - జానయ్య
- శ్రీకొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ హార్టికల్చర్ వర్సిటీ- రాజిరెడ్డి

# చిక్కుల్లో సీఎం ఏక్‌నాథ్ షిండే



**ముంబయి:** అసెంబ్లీ ఎన్నికల తేదీ దగ్గర పడుతోన్న తరుణంలో మహారాష్ట్రలో రాజకీయాలు వాడీవేడీగా మారాయి. ఈ తరుణంలో సీఎం ఏక్‌నాథ్ షిండే కుమారుడు శ్రీకాంత్ షిండే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిషేధాజ్ఞలున్నా ఉజ్జయిని మహాకాళి ఆలయంలోని గర్భగుడిలోకి ఆయన్ను అనుమతించడంపై విపక్షాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. దాంతో అధికారులు విచారణకు ఆదేశించారు. శ్రీకాంత్ షిండే.. మహారాష్ట్ర థానె జిల్లాలోని కల్యాణ్ లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఆయన గురువారం సాయంత్రం ఈ ఆలయానికి వెళ్లారు. భార్యతో కలిసి గర్భగుడిలోకి వెళ్లి పూజలుచేశారని ఆలయ వర్గాలు వెల్లడించాయి. దీనికి సంబంధించిన వీడియో వైరల్ అయింది. సుమారు ఏడాది కాలంగా ఆ ఆలయ గర్భగుడిలోకి ప్రవేశంపై నిషేధం ఉండటంతో ఇది కాస్తా విమర్శలకు దారితీసింది. ''సామాన్యులు దైవ దర్శనం కోసం గంటల కొద్దీ క్యూలో నిలబడి వేచిచూస్తుంటే.. నిషేధం ఉన్నా వీఐపీలను మాత్రం అనుమతిస్తున్నారు. ఈ వ్యవహారం నిబంధనలకు విరుద్ధం'' అని కాంగ్రెస్ పేర్కొంది. ఉజ్జయిని జిల్లా కలెక్టర్, ఆలయ కమిటీ ఛైర్మన్ నీరజ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ..'' మేం ఎవరినీ గర్భగుడిలోకి అనుమతించలేదు. దీనిపై వెంటనే చర్యలకు ఆదేశించాను'' అని వెల్లడించారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల వేళ ఈ విమర్శలేవీ పనిచేయవని, హర్యానాలో ఇలాగే తప్పుడు ప్రచారం చేస్తే.. ప్రజలు ఎలాంటి ఫలితాన్ని ఇచ్చారో అంతా చూశామని శ్రీకాంత్ షిండే వ్యాఖ్యానించారు. ఇదిలా ఉంటే... ప్రస్తుతం మహారాష్ట్రలో ఎన్నికల వాతావరణం నెలకొంది. 288 స్థానాలున్న అసెంబ్లీకి నవంబర్ 20న పోలింగ్ జరగనుంది. 23న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. శివసేన, ఎన్సీపీ చీలిక తర్వాత జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలు కావడంతో దేశవ్యాప్తంగా ఈ రాష్ట్రంపై ఆసక్తి నెలకొంది. అసలైన శివసేన, ఎన్సీపీ ఏవో ప్రజలు తేల్చనున్నారు.

# మాజీ మంత్రి సత్యేందర్ జైన్‌కు భారీ ఊరట

- రెండేళ్ల తర్వాత బెయిల్ మంజూరు
- ఉత్తర్వులు జారీ చేసిన దిల్లీ కోర్టు
- మనీలాండరింగ్ కేసులో నిందితుడు

**దిల్లీ:** ఆప్ సీనియర్ నేత, దిల్లీ ఆరోగ్యశాఖ మాజీ మంత్రి సత్యేందర్ జైన్ కు భారీ ఊరట లభించింది. మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన రెండేళ్ల తర్వాత బెయిల్ వచ్చింది. శుక్రవారం దిల్లీ కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కోల్‌కతాకు చెందిన ఓ కంపెనీకి సంబంధించి లావాదేవీల విషయంలో మనీలాండరింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలపై 2022 మే



30న సత్యేందర్ జైన్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేశారు. 2015-16 సమయంలో హవాలా నెట్‌వర్క్ ద్వారా జైన్ కంపెనీలకు.. షెల్ కంపెనీల నుంచి సుమారు రూ.4.81 కోట్ల వరకు ముట్టినట్లు ఈడీ దర్యాప్తులో గుర్తించింది. సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా రంగంలోకి దిగిన ఈడీ అధికారులు.. ఈ హవాలా కేసును దర్యాప్తు చేశారు. ఈ క్రమంలోనే సత్యేందర్‌తో పాటు ఆయన కుటుంబానికి చెందిన రూ.4.81 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసి ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో వైద్య కారణాలతో గత ఏడాది మేలో సుప్రీంకోర్టు ఆయనకు తాత్కాలిక బెయిల్ ఇచ్చింది. అయితే రెగ్యులర్ బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించడంతో తిరిగి మళ్లీ తిహాడ్ జైలుకు వెళ్లాల్సి వచ్చింది. ఇదిలా ఉంటే.. దిల్లీ మద్యం పాలసీ వ్యవహారంలో మనీలాండరింగ్ ఆరోపణలపై ఆప్ నేతలు కేజ్రీవాల్, మనీశ్ సిసోదియా, సంజయ్ సింగ్ వంటి ముఖ్య నేతలు కొన్ని నెలల పాటు జైలులో ఉండగా.. ఇటీవల వారికి ఊరట లభించిన సంగతి తెలిసిందే. దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కు గత నెల సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయగా.. దాదాపు ఆరు నెలల తర్వాత ఆయన తిహార్ జైలు నుంచి బయటకు వచ్చారు. ఇదే కేసులో 17 నెలల పాటు జైల్లో ఉన్న దిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోదియాకు కూడా కొద్దినెలల క్రితం బెయిల్ లభించింది. ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా సత్యేందర్ జైన్‌కు బెయిల్ రావడంతో ఆప్ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

# ప్రత్యేకమైన కేసులు సీఐడీకి బదిలీ

- లోతుగా విచారిస్తుందనే ఉద్దేశంలో అప్పగించాం
- ప్రధాన కేసుల్లో ప్రత్యేక ఐపీఎస్ అధికారిని నియమించాం
- గంజాయి విక్రయాలు, రవాణాను అరికట్టేందుకు యాంటీ నార్కోటిక్ టీమ్
- బృదంలో 450మంది పనిచేస్తారు
- ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు



**విశ్వంభర, అమరావతి:** ప్రత్యేకమైన కేసులను లోతుగా విచారిస్తుందనే ఉద్దేశంతోనే.. ముంబయి నటి కేసు, టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసును సీఐడీకి అప్పగించినట్లు ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. ప్రస్తుతం కొన్ని ప్రధాన కేసుల్లో నిందితులుగా ఉన్నతస్థాయి వ్యక్తులు ఉన్నారని, వారిని విచారించడం పోలీసులకు కష్టమవుతుందనే ఉద్దేశంతో ఐపీఎస్ అధికారిని ప్రత్యేకంగా నియమించామని డీజీపీ చెప్పారు. రాష్ట్రంలో గంజాయి విక్రయాలు, రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఇటీవల జరిగిన మంత్రుల సమావేశంలో యాంటీ నార్కోటిక్ టీమ్ ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుందని చెప్పారు. 450 మంది పోలీసు సిబ్బంది ఈ బృందంలో పనిచేస్తారని తెలిపారు. ఐజీ స్థాయి అధికారి పర్యవేక్షణ చేస్తారని.. గంజాయి మూలాలను వెలికి తీస్తామన్నారు. ఇప్పటికే ఐజీ ఆకే రవికృష్ణను యాంటీ నార్కోటిక్ బృందానికి ఛీఫ్ గా నియమించామని చెప్పారు. ఈనెల 21 నుంచి 31 వరకు పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

# మూసీ పరీవాహకవాసులకు పునరావాసం

(మొదటి పేజీ తరువాయి)
కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. బాధిత మహిళలకు రూ. 2 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని, అందులో రూ. 1.40 లక్షలు సబ్సిడీగా ఉంటాయని, మిగిలిన రూ. 60 వేల రూపాయలు మూడు సంవత్సరాల్లో చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వివిధ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. అనుకోకుండా వరదలు వచ్చినప్పుడు ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు సన్నద్ధంగా ఉంటామని తెలిపారు. పునరావాసం పొందిన బాధిత కుటుంబాలకు ఉచిత విద్య, అంగన్వాడీ కేంద్రాలలో ప్రవేశం, రెండు పడకల గదుల ఇళ్లు ఉచితంగా అందించామని చెప్పారు. మూసీ పరిరక్షణలో జిహెచ్ఎంసి అర్బన్ డెవలప్మెంట్ విభాగం ఆధ్వర్యంలో బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాగా కృషి చేశారని మంత్రి సీతక్క ప్రశంసించారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం జిహెచ్ఎంసి కమిషనర్ కృషి మేరకు బాధిత కుటుంబాలకు న్యాయం చేకూర్చడంలో ముఖ్య భూమిక పోషించినట్లు పేర్కొన్నారు. ఇక నుండి కూడా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ ప్రక్షాళనలో జిహెచ్ఎంసి పాత్ర కీలకమని మంత్రి సీతక్క ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రి మూసీ పునరావాస మహిళా సంఘాలకు రూ.3.44కోట్లను 172 మంది మహిళలకు ఒక్కొక్కరికి 2 లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని మలక్ పేట్, కార్వాన్ శాసన సభ్యులు అహ్మద్ బిన్ బలాల, కౌసర్ మొహమందిన్, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డిలతో కలిసి పంపిణీ చేసారు.ఈ కార్యక్రమంలో సెర్ఫ్ సీఈఓ దివ్య దేవరాజ్, మూసీ జెడీఎం గౌతమి, శ్రీనివాస్ రెడ్డి, మూసీ ఈడీ ఎస్.సి కార్పొరేషన్ ఎండి మల్లయ్య భట్టు, డి ఈ ఓ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులపై పోలీసులు జులుం చేశారు

(మొదటి పేజీ తరువాయి)
సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతోనే నిరుద్యోగులపై పోలీసులు జులుం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మళ్లీ తెలంగాణ ఉద్యమం నాటి అణచివేత చర్యలు ప్రారంభమయ్యాయని ఆక్షేపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇదే అశోక్ నగర్‌కు వచ్చి అడ్డగోలు హామీలు ఇచ్చిన రాహుల్ గాంధీ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పత్తా లేకుండా పోవడం దుర్మార్గమని మండిపడ్డారు. గ్రూప్ -1 అభ్యర్థులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. అరెస్ట్ చేసిన విద్యార్థులు, గ్రూప్ -1 అభ్యర్థులను వెంటనే విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు మార్గం సుగమం

(మొదటి పేజీ తరువాయి)
అభ్యర్థులు హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లో 8, రంగారెడ్డిలో 11, మేడ్చల్ జిల్లాలో 27 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రతి పరీక్ష హాల్, చీఫ్ సూపరింటెండెంట్ గది, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, టీజీపీఎస్సీ కార్యాలయ కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి పర్యవేక్షించనున్నారు. అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరుకు ప్రత్యేక సిబ్బందిని నియమించామని, మధ్యాహ్నం 1.30 గంటల తరువాత కేంద్రంలోకి అనుమతించబోమని పేర్కొన్నారు. గురువారం సాయంత్రం వరకు 90 శాతం మంది అభ్యర్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారని, డౌన్‌లోడ్ చేసుకునేందుకు 20వ తేదీ వరకు అవకాశం ఉందని టీజీపీఎస్సీ వర్గాలు వెల్లడించాయి.

## సుప్రీంకోర్టును ఆశ్రయించిన తెలంగాణ గ్రూప్-1 అభ్యర్థులు



**దిల్లీ:** రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 29 రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ గ్రూప్-1 అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తీర్పు వచ్చే వరకు పరీక్ష వాయిదా వేయాలని కోరారు. జీవో 55నే అమలు చేయాలని కోరినా సీఎం పట్టించుకోవడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. తదుపరి విచారణను సుప్రీంకోర్టు సోమవారానికి వాయిదా వేసింది.
దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించి 2022లో జారీ చేసిన జీవో 55కు సవరణ తీసుకొస్తూ ఫిబ్రవరి 8న జారీ చేసిన జీవో 29ని రద్దు చేయాలని గ్రూప్-1 అభ్యర్థులు కోరుతున్నారు. జనరల్ కేటగిరీలోని అభ్యర్థుల కంటే ఎక్కువ మార్కులు సాధించిన వారిని అన్‌రిజర్వుడుగానే పరిగణిస్తుండటం వల్ల దివ్యాంగ అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందన్నారు. వారికంటే ఎక్కువ మార్కులు వచ్చినా.. రిజర్వేషన్ కేటగిరీగానే పరిగణించి 1:50 కింద అభ్యర్థులను మెయిన్స్‌కు పిలవాలని కోరుతున్నారు. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించిన వివాదం నేపథ్యంలో గ్రూప్-1 పరీక్షల నిలిపివేయాలని కొందరు అభ్యర్థులు కోరగా.. హైకోర్టు నిరాకరించింది. నోటిఫికేషన్ రద్దు చేయాలన్న అభ్యర్థనను తిరస్కరించిన ఉన్నత న్యాయస్థానం.. నియామకాలు తుది తీర్పునకు లోబడి ఉంటాయని విచారణ వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో గ్రూప్ -1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

## ఇక్రిశాట్ నూతన డైరెక్టర్ జనరల్‌గా హిమాన్షు పాఠక్

**విశ్వంభర, హైదరాబాద్:** అంతర్జాతీయ సమశీతోష్ణ మండల ప్రాంత వ్యవసాయ పరిశోధన సంస్థ (ఇక్రిశాట్) నూతన డైరెక్టర్ జనరల్‌గా డా. హిమాన్షు పాఠక్ నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇక్రిశాట్ ఆవిర్భావం జరిగిన తర్వాత డీజీగా నియమితులైన తొలి భారతీయుడిగా పాఠక్ గుర్తింపు పొందారు. ఆయన నేలల పరిశోధనా శాస్త్రం (సోయిల్ సైన్స్) లో పీహెచ్‌డీ చేశారు. దేశంలోని పలు ఐసీఆర్ఏ సంస్థల్లో వివిధ హోదాల్లో పని చేశారు.



# దేవాదాయ శాఖ
# భూముల పరిరక్షణకు చర్యలు

- అందుకోసం స్టేట్ గెజిట్ నోటిఫికేషన్ ఇస్తాం
- దేవాలయ భూముల సర్వే ...సైన్ బోర్డుల ఏర్పాటు
- రాష్ట్రంలోని ప్రముఖ ఆలాయాల అభివృద్ధి
- సిద్ధమైన ప్రత్యేక ప్రణాళికలు
- మంత్రి కొండా సురేఖ




**విశ్వంభర, హైదరాబాద్ :** దేవాదాయ శాఖ భూముల పరిరక్షణలో భాగంగా స్టేట్ గెజిట్ నోటిఫికేషన్ ఇస్తున్నామని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. రాష్ట్రంలోని పలు ఆలయాల అభివృద్ధి వివరాలు, భక్తులకు కల్పిస్తున్న వసతుల వివరాలు, దేవాదాయ శాఖ భూముల పరిరక్షణకు చేపడుతున్న చర్యల వివరాలు తెలుపుతూ శుక్రవారం సచివాలయంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేవాదాయ శాఖ భూములను పరిరక్షించేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని వివరించారు. దేవాదాయ భూములను సర్వే చేసి సైన్ బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు 34 వేల 92 ఎకరాల దేవాదాయ భూములకు జియో ట్యాగింగ్ చేశామని చెప్పారు. రు. 57 శాతం దేవాదాయ భూములను ధరణిలో నిక్షిప్తం చేయడంతో పాటు ఇతరలు ఆ భూములను రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వీలు లేకుండా చర్యలు తీసుకున్నమన్నారు.

**ఆలయాల అభివృద్ధి...**

రాష్ట్రంలోని ప్రముఖ ఆలాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రాబోయే బ్రహ్మోత్సవాల నాటికి యాదగిరి గుట్ట దేవాలయ గోపురానికి 60 కిలోల బంగారంతో తాపడం చేస్తున్నామన్నారు. దాతల నుంచి సేకరించిన రూ.15 కోట్లతో ఉచిత అన్నప్రసాద వితరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. దీనివలన రోజుకు సూమారు 2500 మంది భక్తులకు ఉచిత అన్నప్రసాదాన్ని అందించే వీలు కలుగుతుందని అన్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు విశ్రాంతి భవనాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాలినడక భక్తులకు ఎండ నుండి ఉపశమనం కల్పించేందుకు షెడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం అభివృద్ధి మాస్టర్ ప్లాన్ లో భాగంగా భూ సేకరణ చేయడానికి 60 కోట్ల రూపాయలు మంజూరు చేశామని అన్నారు. వీటితో పాటు వేములవాడ, భాసర వంటి ప్రముఖ ఆలయాల అభివద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామన్నారు. భవిష్యత్తులో అన్ని దేవాలయాల వెబ్ సైట్ లను ఒకే గొడుగుకిందకు తీసుకు వచ్చి దేవాదాయ శాఖ సమగ్ర వెబ్ సైట్ ను తయారు చేయబోతున్నామన్నారు. త్వరలో దేవాదాయ శాఖ యాప్ ను ఏర్పాటు చేయడంతో పాటు క్యూఆర్ కోడ్ విధానం ద్వారా భక్తులు తమకు ఇష్టం వచ్చిన దేవాలయాల వివరాలు స్థల పురాణాలు తెలుసుకునే వీలు కల్పిస్తున్నామన్నారు.

ఉద్యోగుల సంక్షేమం కోసం...

గత 15 సంవత్సరాలుగా బదిలీలు లేకుండా ఒకే చోట పని చేస్తూ ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులకు ఉపశమనం కల్పిస్తూ భారీగా బదిలీలు చేపట్టామన్నారు. దేవాదాయ శాఖలోనే ఇది రికార్డు అన్నారు. ప్రెసిడెన్,యల్ ఆర్డర్ 2018 వచ్చిన తర్వాత జోనల్ సిస్టమ్ ప్రకారం సబార్డినేట్ సర్వీస్ రూల్స్ ను సవరించుకున్నామని అన్నారు. చాలా రోజులుగా దేవాదాయ శాఖలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించామని తెలిపారు.

## చిట్యాలలో సమాచార హక్కు చట్టం ఆవిర్భావ వారోత్సవాలు

**సమాచార హక్కు ప్రజా చైతన్య సమితి జెండా ఆవిష్కరణ**

**అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో వారోత్సవాలు నిర్వహించాలి**

**కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కాచం సత్యనారాయణ**




**విశ్వంభర, చిట్యాల:** సమాచార హక్కు ప్రజా చైతన్య సమితి ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం ఆవిర్భావ వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం చిట్యాల పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో సమాచార హక్కు ప్రజా చైతన్య సమితి జెండా ఆవిష్కరణ జరిగింది. సమాచార హక్కు చట్టం 12 అక్టోబర్ 2005 నుంచి అమలు జరిగింది. 12 అక్టోబర్ 2005 నుండి 12 అక్టోబర్ 2024 వరకు 19 సంవత్సరాలు పూర్తి చేసుకుని 20వ సంవత్సరంలో అడుగు పెట్టిన సందర్భంగా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం చిట్యాల పట్టణంలో జెండా ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా , మండల కేంద్రాలలో సమాచార హక్కు చట్టం వారోత్సవాలు సమాచార హక్కు ప్రజా చైతన్య సమితి తరపున నిర్వహిస్తున్నారు. కాబట్టి మన కమిటీ సభ్యులందరూ వారి వారి జిల్లా , మండల కేంద్రాలలో జెండా ఆవిష్కరణ వారోత్సవాలు జరపాలని, కమిటీ సభ్యులందరూ సహకరించాలని కోర్ కమిటీ సభ్యులు, గౌరవ అధ్యక్షులు, ముఖ్య సలహాదారులు డాక్టర్ కాచం సత్యనారాయణ గుప్తా, ముఖ్య గౌరవ సలహాదారులైన కోటగిరి దైవ దినం కోరారు.

## ఆనందోత్సాహాల మధ్య సీఎం కప్ 2024 టార్చ్ రిలే ర్యాలీలు

**నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లా కేంద్రాల్లో సాగిన క్రీడాజ్యోతి ర్యాలీలు**




**విశ్వంభర, వనపర్తి :** సీఎం కప్ 2024 టార్చ్ రిలే ర్యాలీలు జోరుగా కొనసాగుతున్నాయి.శుక్రవారం నాగర్ కర్నూల్ , వనపర్తి జిల్లా కేంద్రాల్లో యువ క్రీడాకారుల ఆనందోత్సాహాల మధ్య క్రీడా ర్యాలీలు ఘనంగా కొనసాగాయి. ఉదయం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగిన టార్చ్ రిలే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ బి సంతోష్, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ లు ప్రారంభించారు. జిల్లా కబడ్డీ,వాలీ బాల్,ఫుట్ బాల్,కరాటే అసోసియేషన్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధులు , వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు , క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు . ఈ కార్యక్రమాన్ని జిల్లా యువజన, క్రీడాభివృద్ధి అధికారి సురేందర్ రెడ్డి సమన్వయం చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలో వందలాదిమంది యువ క్రీడాకారుల సందోహం మధ్య జిల్లా అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీఎస్పీ వెంకటేశ్వరరావులు క్రీడాజ్యోతి ర్యాలీని ప్రారంభించారు. వివిధ పాఠశాలల కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు . ఈ కార్యక్రమాన్ని జిల్లా యువజన, క్రీడాభివృద్ధి అధికారి సీతారాములు సమన్వయం చేశారు.శనివారం జోగులాంబ గద్వాల, నారాయణపేట జిల్లా కేంద్రాల్లో ఈ కార్యక్రమం కొనసాగనుంది.

## పోస్టాఫీస్‌లో రూ.21 కోట్ల విలువైన డ్రగ్స్

**స్వాధీనం చేసుకున్న సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు**

**బెంగళూరు:** బెంగళూరు సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు పెద్ద మొత్తంలో డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని ఫారిన్ పోస్ట్ ఆఫీస్ వద్ద చేపట్టిన తనిఖీల్లో రూ.21కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లుగా పోలీసులు పేర్కొన్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ..బెంగళూరులోని ఫారిన్ పోస్ట్ ఆఫీస్ వద్ద నార్కోటిక్స్ కంట్రోల్ యూనిట్ కస్టమ్స్ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించింది. ఈ క్రమంలో దాదాపు 606 డ్రగ్స్ పార్శిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. వీటిని అమెరికా, బెల్జియం, యూకె, థాయ్‌లాండ్, నెదర్లాండ్స్ వంటి దేశాల నుంచి అక్రమంగా రవాణా చేస్తున్నట్లుగా గుర్తించామన్నారు. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌లో హైడ్రో గంజాయి, ఎల్ఎస్‌డీ, ఎండీఎంఏ క్రిస్టల్స్ తదితర మత్తు పదార్థాలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. వీటిని బెంగళూరులో అధిక ధరలకు విక్రయించేందుకు నిందితులు ఇండియన్ పోస్టల్ సర్వీస్ ద్వారా దిగుమతి చేసుకున్నట్లు దర్యాప్తులో తేలిందని క్రైమ్ బ్రాంచ్ పోలీసులు వెల్లడించారు. తదుపరి విచారణ కొనసాగుతుందన్నారు.



ఛత్రినాక పోలీసు స్టేషన్ హోంగార్డ్ లక్ష్మీనారాయణ రిటైర్మెంట్ సందర్భంగా ఛత్రినాక ఏసీపీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. ఏసీపీ వెంట ఎస్ఐలు రాము, రవి కుమార్ ఇతర పోలీస్ సిబ్బంది ఉన్నారు.

- విశ్వంభర, ఉప్పుగూడ

## జీవో 29 వల్ల గ్రూప్-1 అభ్యర్థులకు నష్టం

- ఇది ప్రభుత్వ అనాలోచిత నిర్ణయమే
- గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి ఏం తేడా లేదు
- కేంద్ర మంత్రి బండి సంజయ్



**విశ్వంభర, కరీంనగర్:** తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 29 వల్ల గ్రూప్1 అభ్యర్థులకు నష్టం జరుగుతుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇది ప్రభుత్వ అనాలోచిత నిర్ణయమేనని విమర్శించారు. ఆందోళన చేస్తున్న అభ్యర్థులపై లాఠీచార్జ్ చేస్తున్నారని దుయ్యబట్టారు. 15వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి.. 60వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామంటున్నారని, గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి ఏం తేడా లేదని విమర్శించారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో బండి సంజయ్ మాట్లాడారు. "కేసీఆర్ ఆలోచనా విధానాలకు అనుగుణంగానే ఈ ప్రభుత్వం నడుస్తోంది.

ఈ ప్రభుత్వానికి ఉద్యోగాలు భర్తీ చేసే ఆలోచన లేదు. ప్రణాళిక ప్రకారమే జీవో 29 ఇచ్చారు. నిరుద్యోగుల ఉసురు తగిలే బీఆర్ ఎస్ ఓడిపోయింది. నిరుద్యోగుల గురించి మాట్లాడే అర్హత ఆ పార్టీకి లేదు. ప్రశ్న పత్రాలు లీకేజీ చేసి నిరుద్యోగుల భవిష్యత్‌ను భారాస నాశనం చేసింది" అని బండి సంజయ్ మండిపడ్డారు.

## రూ.25వేల కోట్లతో మూసీ ప్రక్షాళన చేయొచ్చు


- సుందరీకరణకు రూ.1.50 లక్షల కోట్లు ఎందుకు?
- మూసీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిందే బీఆర్ఎస్ సర్కారు
- తెలంగాణ భవన్‌లో కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్



**విశ్వంభర, హైదరాబాద్:** రూ.25వేల కోట్లతో మూసీ ప్రక్షాళన చేయవచ్చని, మూసీ సుందరీకరణకు రూ.1.50లక్షల కోట్లు ఎందుకని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. పేదల ఇళ్ల జోలికి వెళ్లకుండానే మూసీని ప్రక్షాళన చేయవచ్చన్న ఆయన .. గత ప్రభుత్వాలు మూసీని మురికి కూపంలా మార్చాయన్నారు. 31 ఎస్టీపీలు పూర్తయితే మూసీలో స్వచ్ఛమైన నీరు ప్రవహిస్తుందని.. ఎస్ఎన్‌డీపీని ప్రారంభించడం వల్లే మురికినీరు నిల్వ ఉండటం లేదన్నారు. మూసీ ప్రక్షాళనపై తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన కేటీఆర్.. మళ్లీ తమ ప్రభుత్వం వచ్చి ఉంటే రెండో దశ ఎస్ఎన్‌డీపీని ప్రారంభించేవాళ్లమన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రెండో దశ ఎస్ఎన్‌డీపీ ప్రాజెక్టును రద్దు చేసిందని ఆరోపించారు. తుది దశలో ఎస్టీపీలు, సీనరేజి ప్లాంట్‌లు ఉన్నాయని గుర్తు చేశారు. కేవలం రూ.1100 కోట్లతో నల్గొండకు శుద్ధమైన నీరు ఇవ్వొచ్చని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిందే బీఆర్ఎస్ ప్రభుత్వం అని తెలిపారు. కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంగా మారిందని ఆరోపించారు. రూ.లక్షన్నర కోట్ల లూటీని తెలంగాణ సమాజం గమనిస్తోందని, ఢిల్లీకి మూటలు పంపేందుకే మూసీపై సీఎం ప్రేమ ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. మూసీ ప్రాంతంలో సర్వే చేయకున్నా.. చేసినట్టు చెప్పారన్నారు. ప్రజలను అబద్ధాలతో మభ్యపెట్టేందుకు సీఎం యత్నించారని ఆరోపించారు.

## ఓటీటీ కంటెంట్ నియంత్రణకు ప్రత్యేక సంస్థ

- సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్ తిరస్కరణ
- అది విధానపరమైన అంశమన్న ధర్మాసనం
- ఇది నిజమైన ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదన్న కోర్టు




**ఢిల్లీ :** భారత్‌లో ఓటీటీ, ఇతర ప్లాట్‌ఫామ్‌లలో కంటెంట్‌ను పర్యవేక్షించడానికి/నియంత్రించడానికి స్వయంప్రతిపత్తి గల సంస్థను ఏర్పాటు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు శుక్రవారం తిరస్కరించింది. అది విధానపరమైన అంశం అన్న కోర్టు, ఈ విషయంలో నిర్ణయం తీసుకోవడానికి భాగస్వాములతో విస్తృత సంప్రదింపులు జరపాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఇటీవల ప్రజాప్రయోజన వ్యాజ్యాలన్నీ విధాన రమైన అంశాలపై దాఖలవుతున్నాయని, ఇప్పుడు ఇదో సమస్య అని కోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఫలితంగా నిజమైన ప్రజాప్రయోజన వ్యాజ్యాలను కోల్పోతున్నామని వ్యాఖ్యానించింది. ఓటీటీ సహా ఇతర ప్లాట్‌ఫామ్‌లలో కంటెంట్‌ను నియంత్రించడానికి ఓ స్వతంత్ర సంస్థ ఏర్పాటు చేయాలని లాయర్ శశాంక్ శేఖర్ సుప్రీం కోర్టులో పిల్ దాఖలు చేశారు. సినిమాటోగ్రాఫ్ చట్టం ప్రకారం సినిమాల బహిరంగ ప్రదర్శనను నియంత్రించడానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్‌సీబీఎఫ్‌సీ సంస్థ ఉందని పిటిషన్‌లో లాయర్ పేర్కొన్నారు. కానీ, ఓటీటీల్లో కంటెంట్‌ను పర్యవేక్షించడానికి అలాంటి సంస్థ ఏదీ లేదని తెలిపారు. ఆ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు స్వీయ నిబంధనలకు మాత్రమే కట్టుబడి ఉంటాయని, కానీ వాటిని పూర్తిగా పాటించవని ఆరోపించారు. ఎలాంటి తనిఖీలు లేకుండా వివాదాస్పద కంటెంట్‌ను ప్రదర్శిస్తాయని పిటిషనర్ చెప్పారు. అంతేకాకుండా దేశంలో 40కి పైగా ఓటీటీ, వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లు చెల్లింపు, ప్రకటనలతో కూడిన, ఉచిత ప్రాతిపదికన కంటెంట్‌ను పౌరులకు అందిస్తున్నాయని, ఆర్టికల్ 19 ద్వారా లభించిన భావ వ్యక్తీకరణ హక్కును దుర్వినియోగం చేస్తున్నాయని ఆరోపించారు.

## యాహ్యా సిన్వర్ సోదరుడి కోసం ముమ్మర వేట

- హమాస్ అధినేతను హతమార్చాక ఇజ్రాయెల్ గాలింపు
- ఇజ్రాయెల్ వ్యతిరేక పోరాటం తీవ్రం చేస్తామంటున్న హెజ్‌బొల్లా

జెరూసలెం : పశ్చిమాసియా నిప్పుల కొలిమిలా మారింది. హమాస్ అధినేత యాహ్యా సిన్వర్ ను ఐడీఎఫ్ మట్టుపెట్టడంతో ఉద్రిక్తతలు మరింత భగ్గుమన్నాయి. ఈ తరుణంలో ఇప్పుడు ఇజ్రాయెల్ సైన్యం దృష్టి అతడి సోదరుడిపై పడింది. సిన్వర్ సోదరుడు మహమ్మద్, ఇతర హమాస్ మిలిటరీ కమాండర్ల జాడ కోసం గాలిస్తున్నామని ఐడీఎఫ్ వెల్లడించింది. మరోవైపు, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా తాము జరుపుతోన్న పోరాటం తీవ్రతరం అవుతుందని హెజ్‌బొల్లా గ్రూప్ ప్రకటించింది. ఇరాన్ కూడా ఇదే విధంగా స్పందించింది. తమ ప్రతిఘటన బలోపేతం అవుతుందని ఐక్యరాజ్యసమితికి ఇరాన్ మిషన్ తెలిపింది. పాలస్తీనా విముక్తి కోసం, యువత, చిన్నారులు అతడి బాటలో నడుస్తారని తెలిపింది. ఆక్రమణ, శత్రుత్వ ధోరణి ఉన్నంతకాలం ప్రతిఘటన కొనసాగుతుందని, అమరులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకువెళ్తామని పేర్కొంది.

## యుద్ధం ముగిసే వరకు బందీలను విడిచిపెట్టం

**ఇజ్రాయెల్‌కు తేల్చిచెప్పిన హమాస్**

**తమ పౌరులను విడిచిపెడితే మిలిటెంట్లకు స్వేచ్ఛ**

**లేదంటే వేటాడి మరీ హతమారుస్తాం**

**గాజా :** ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో తమ అధినేత యాహ్యా సిన్వర్ మృతి చెందినట్లు హమాస్ సైతం ధ్రువీకరించింది. పాలస్తీనా కోసం చివరి వరకు పోరాడి ప్రాణాలు కోల్పోయారని తెలిపింది. అయితే, తమ ప్రాంతంపై బాంబు దాడులు ఆపి, ఇజ్రాయెల్ దళాలు ఉపసంహరించుకొని, యుద్ధం ముగించే వరకు బందీలను వదిలిపెట్టే ప్రసక్తే లేదని హమాస్ తేల్చి చెప్పింది. హమాస్ అధినేత మృతిచెందడంపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పందిస్తూ.. హమాస్ ఆయుధాలను వదిలి, తమ బందీలను తిరిగి పంపిస్తే ఈ యుద్ధం రేపే ముగుస్తుందని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. అదేవిధంగా తమ పౌరులను విడిచిపెడితే హమాస్ మిలిటెంట్లకు స్వేచ్ఛగా జీవించే అవకాశం కల్పిస్తామన్నారు. లేదంటే వేటాడి మరీ హతమారుస్తామని హెచ్చరించిన నేపథ్యంలో హమాస్ నుంచి ఇటువంటి స్పందన వచ్చింది.

మరోవైపు, గాజాపై ఇజ్రాయెల్ సైన్యం దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. గడిచిన 24 గంటల్లో 62 మంది మరణించగా.. 300 మంది గాయపడ్డారు. దీంతో మొత్తంగా ఇప్పటివరకు ఇజ్రాయెల్ దాడుల్లో మృతి చెందిన వారి సంఖ్య 42,500లకు చేరుకుందని గాజా ఆరోగ్యశాఖ వెల్లడించింది. మరో లక్ష మంది గాయపడినట్లు తెలిపింది.

## లెబనాన్‌కు భారత్ మానవతా సాయం

**33 టన్నుల వైద్య సామగ్రి రవాణా**

**తొలి విడతగా పంపిన 11 టన్నులు**



**ఢిల్లీ:** ఇజ్రాయెల్ హెజ్‌బొల్లా మధ్య భీకర దాడులతో నెలకొన్న సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో లెబనాన్‌కు భారత్ మానవతా సాయం అందించింది. సంక్షోభ పరిస్థితుల్లో అక్కడి ప్రజలను ఆదుకోవాలనే సంకల్పంతో వారికి అవసరమైన ఔషధాలను పంపించాలని నిర్ణయించింది. మొత్తం 33 టన్నుల వైద్య సామగ్రిని పంపుతున్నట్లు కేంద్ర విదేశాంగ శాఖ తెలిపింది. ఇందులో భాగంగా తొలి విడతలో 11 టన్నుల వైద్యసామాగ్రిని శుక్రవారం ప్రత్యేక విమానంలో పంపించినట్లు కేంద్ర విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ వెల్లడించారు. కార్డియోవాస్కులర్ ఔషధాలు, నాన్‌స్టెరాయిడ్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ మందులు, యాంటీ బయాటిక్స్, అనస్థీసియాకు సంబంధించిన ఔషధాలను పంపినట్లు ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు.

## మియాపూర్‌లో చిరుత సంచారం

**భయాందోళనలో స్థానికులు**

**విశ్వంభర, హైదరాబాద్:** మియాపూర్‌లో చిరుత సంచారం కలకలం రేపింది. మియాపూర్ మెట్రో స్టేషన్ వెనుకవైపు శుక్రవారం రాత్రి చిరుత సంచరించినట్టు ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు, అటవీ సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకుని చిరుత ఆనవాళ్లు గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.



# తెలుగు జాతికి చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు




## (నేడు ఆయన ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్షకు పూనుకున్న దినం)

ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలర్పించి, అమరజీవియైన మహాపురుషుడు, పొట్టి శ్రీరాములు, ఆంధ్రులకు చిరస్మరణీయుడు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడైనవాడు. ఆయన మహాత్మా గాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం జీవితాంతం కృషిచేసిన మహనీయుడు. మద్రాసు (ప్రస్తుత చెన్నై) లోని జార్జిటౌన్, అన్నాపిళ్లె వీధిలోని 163వ నెంబరు ఇంటిలో 1901 మార్చి 16వ తేదీన పుట్టారు. తండ్రి గురవయ్య, తల్లి మహాలక్ష్మమ్మ. శ్రీరాములు పూర్వీకుల స్వస్థలం ప్రకాశం జిల్లా కనిగిరి సమీపంలోని పడమటిపల్లె గ్రామం(ప్రస్తుత శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా). అప్పట్లో కనిగిరి, పడమటిపల్లి.. నెల్లూరు జిల్లాలో ఉండేవి.శ్రీరాములు ఫిఫ్త్ ఫామ్ వరకు మద్రాసులో చదివారు. అది పూర్తి కాలేదు. దీంతో బొంబాయిలోని విక్టోరియా జూబిలీ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరి 1924లో శానిటరీ ఇంజనీరింగ్, ప్లంబింగ్‌లో డిప్లమో చేశారు.(గ్రేట్ ఇండియన్ పెనిన్సులర్ రైల్వే (ప్రస్తుత సెంట్రల్ రైల్వే)లో అసిస్టెంట్ ప్లంబర్‌గా ఉద్యోగం పొందారు.తరువాత గ్రేట్ ఇండియన్ పెనిన్సులర్ రైల్వేలో చేరి దాదాపు నాలుగేళ్ళు అక్కడ ఉద్యోగం చేశారు. శ్రీరాములు తల్లి మహాలక్ష్మమ్మ 1928లో చనిపోయింది. ఆ తర్వాత భార్య సీతమ్మ ఒక మగ పిల్లాడికి జన్మనిచ్చింది. కానీ, ఆ పిల్లాడు ఐదు రోజులకే చనిపోయాడు. తర్వాత కొద్ది రోజులకు క్షయ రోగంతో సీతమ్మ మరణించింది.25 యేండ్ల వయసు కలిగిన శ్రీరాములు జీవిత సుఖాలపై విరక్తి చెంది ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆస్తిపాస్తులను తల్లికి, అన్నదమ్ములకు పంచిపెట్టి, గాంధీజీ అనుయాయిగా 1930 ఏప్రిల్‌లో సబర్మతి ఆశ్రమం చేరాడు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నాడు. పొట్టి శ్రీరాములు 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించాడు. తర్వాత మళ్ళీ 1941-42 సంవత్సరాల్లో సత్యాగ్రహాలు, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొనడం వల్ల మూడు సార్లు జైలు శిక్ష అనుభవించాడు.వివిధ రాష్ట్రాల్లో సత్యాగ్రహ ఉద్యమాలు చేస్తూ జైలుకెళ్లిన శ్రీరాములు బీహారు వంటి రాష్ట్రాల్లో కూడా సేవలు చేశారు. అనంతరం నెల్లూరులో దళితులకు ఆలయప్రవేశం, అస్పృశ్యత నివారణ మొదలైన వాటికోసం ప్రచారం, నిరాహార దీక్షలు చేసి విజయం సాధించారు.ఆంధ్ర రాష్ట్రం కోసం చేసిన 58 రోజుల ఆమరణ దీక్షకు ముందు శ్రీరాములు ఐదు సార్లు నిరాహార దీక్షలు చేశారు.

**సమాజాభివృద్ధికి పాటుపడే కార్యకర్తగా నిర్వచించుకునేవారు..**

పొట్టి శ్రీరాములు తనను తాను సమాజాభివృద్ధికి, నిర్మాణానికి పాటుపడే కార్యకర్తగా నిర్వచించుకునేవారు. ఆయనకు రాజకీయాల్లో చేరాలనే ఆసక్తి లేదు. కానీ, రాష్ట్ర ఏర్పాటు అనేది రాజకీయ సమస్య. అప్పటికే అది చాలా తీవ్రమైన సమస్యగా మారిపోయింది. అలాంటి రాజకీయ సమస్య కోసం శ్రీరాములు దీక్ష చేయటానికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయని పలు గ్రంథాలు, వ్యాసాలను బట్టి తెలుస్తోంది. స్వాతంత్ర్యం అనంతరం ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ సంఘం తరపున నిర్మాణ కార్యక్రమ ఆర్గనైజరుగా శ్రీరాములు పనిచేశారు. ఈ నేపథ్యంలో.. ఆంధ్రులకు ప్రత్యేకంగా రాష్ట్రం లేకపోవటం వల్ల నిర్మాణ కార్యక్రమాన్ని నిర్వహించటంలో ఎన్నో ఇబ్బందులు అనుభవించాల్సి వచ్చింది. ఆంధ్ర ప్రాంతంలో ఏ పని జరగాలన్నా రాష్ట్రం లేకపోతే సాధ్యం కాదని నిర్ణయించుకున్నారు. కాబట్టి రాజకీయ ప్రవేశం చేయాలని, అయితే అది నిర్మాణం కోసమేనని ఆయన తెలిపారు.

మహాత్మా గాంధీతో పాటు దాదాపు రెండు దశాబ్దాలు గడిపారు శ్రీరాములు. ఆయన అహింస సిద్ధాంతాన్ని బాగా విశ్వసించి, పలుమార్లు ఆచరించి.. విజయం సాధించారు. అదే మార్గంలో దీక్ష చేయాలని నిర్ణయించారు. ఆయన మాటల్లో చెప్పాలంటే..



''ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం విషయంలో నెహ్రూ దృష్టికి రాగల వాతావరణాన్ని కల్పించి, ఆ పరిస్థితి నుంచి తప్పించుకొనే అవకాశం లేకుండా.. తనంతట తానుగా దేశం అంతటి క్షేమాన్ని ఆకాంక్షించి, ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికి పూనుకొనే పరిస్థితులను కల్పించవలసిన అవసరం కలుగుతున్నది. దీనిని సాధించటానికి రెండు మార్గాలున్నాయి. ఒకటి హింసాయుతం, రెండు అహింసాయుతం. అహింసలో నమ్మకం ఉన్నవారు తమకు ఏమీ పట్టనట్లు నిద్రబోతే, ఏమీ పని చేయకుండా కూర్చుంటే.. హింసావాదులు పూనుకొని పరిష్కార దుస్సాధ్యమైన పరిస్థితులను కల్పిస్తారు.'' అని 1952అక్టోబర్ 14వ తేదీన మద్రాసు పౌరులకు, ఇతరులకు పొట్టి శ్రీరాములు విజ్ఞప్తి చేశారు.

**నిష్కామ దృష్టితో, ద్వేష రహితంగా, నిశ్చింతగా ప్రాణాలర్పించటమే మార్గం..**

1952 సెప్టెంబర్ 15వ తేదీన శ్రీరాములు నెల్లూరు నుంచి భాగవతుల లక్ష్మీనారాయణకు ఒక లేఖ రాశారు. అందులో.. ''ఆంధ్ర రాష్ట్ర సమస్య అనేక మందికి, అనేక పార్టీలకు, అనేక అభిప్రాయాలకు, అనేక భావాలకు అనేక రకాలుగా పుట్టిల్లు అయ్యింది. ప్రతి ఒక్కరి స్వార్థమూ వేర్వేరుగా ఉంది. ప్రత్యక్ష ఆర్థిక లాభాలున్నాయి. కాబట్టి అందరూ పరమార్థ దృష్టితో ఆలోచిస్తే తప్ప ఏకాభిప్రాయానికి రాలేరు. అధికారంలో ఉన్న మహా నాయకుల దృష్టి మార్చాలంటే సామాన్యం కాదు. ఇందుకు ఒక్కటే మార్గం కనబడుతోంది. నిష్కామ దృష్టితో, ద్వేష రహితంగా, నిశ్చింతగా ప్రాణాలర్పించటమే. ఇక ఈ సమస్యను ఉపేక్షించటం పాపమని నిన్నే (1952 సెప్టెంబర్ 14) అనిపించింది''.

తర్వాత 15 రోజులకు భీమవరంలో స్వామి సీతారాంను శ్రీరాములు కలిసి, లక్ష్మీనారాయణకు రాసిన లేఖను, దానితోపాటు పంపించిన 'ఆంధ్ర రాష్ట్రం' అనే వ్యాసాన్ని చూపించారు. వీటిని పరిశీలించిన స్వామి సీతారాం అక్టోబర్ 2వ తేదీన శ్రీరాములుకు తన స్పందన తెలియజేస్తూ లేఖ రాశారు. దీక్ష చేయాలన్న శ్రీరాములు నిర్ణయాన్ని అభినందిస్తూనే.. ''ప్రస్తుతానికి మద్రాసు నగర భవిష్యత్తును గూర్చి పట్టుబట్టడం ఉచితం కాదు'' అని సూచించారు. కానీ, ఆయన సూచనను శ్రీరాములు అంగీకరించలేదు. ''మద్రాసు నగర భవిష్యత్తు నిర్ణయించే బాధ్యతను పండిట్ నెహ్రూకు అప్పగించటానికి వీలులేదు. మద్రాసు నగర పౌరులే ఆ నగరం భవిష్యత్తుని నిర్ణయించాలి. నా దీక్ష వలన మద్రాసు నగరంలోని తమిళ ప్రముఖుల్లో కొందరిలోనైనా హృదయ పరివర్తన ఏర్పడి.. మద్రాసు నగరాన్ని కేంద్ర పాలిత రాష్ట్రంగా ఏర్పరచడానికి వారు అంగీకరించగలరని నేను నమ్ముతున్నాను. ప్రజాభీష్టాన్ని అమలు జరపడమే పండిట్ నెహ్రూ వంతు'' అని పేర్కొన్నారు. 1952 అక్టోబరు 19వ తేదీన తన దీక్ష ప్రారంభించడానికి ముందు పత్రికలకు శ్రీరాములు ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో.. ''మద్రాసు నగర భవిష్యత్తు విషయమై మద్రాసు పౌరుల్లో ఏకాభిప్రాయం సాధించడానికి తీవ్రమైన కృషి జరగాలి'' అని పేర్కొన్నారు.

**దీక్షను విరమించడానికి రెండు షరతులు పేర్కొన్నారు. అవి..**

1) మద్రాసు నగర భవిష్యత్తు విషయమై మద్రాసు పౌరుల్లో ఏకాభిప్రాయం ఏర్పడటం.

2) భారత ప్రభుత్వం రాజ్యాంగంలోని 3వ ఆర్టికల్ కింద ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించటం.

**మొదటి రోజు 53 కేజీలు.. చివరి రోజు 38 కేజీలు...**

దీక్షా కాలంలో శ్రీరాములు పాటించిన దిన చర్యను డాక్టర్ కస్తూరి నారాయణ మూర్తి, డాక్టర్ అవధాని, డాక్టర్ శాస్త్రి తదితరులు పర్యవేక్షించేవారు. గాంధీజీ తన నిరశన వ్రతాల్లో పాటించిన నియమాలనే ఇంచుమించు శ్రీరాములు కూడా అనుసరించారు. ప్రతిరోజూ నాలుగు నిమ్మకాయల రసం, రెండు చెంచాల ఉప్పు, రెండు చిటికెల సోడా బైకార్బొనేట్, రెండు ఔన్సుల తేనె తీసుకునేవారు. దీక్ష ప్రారంభించిన రోజు నుంచి ఆయన్ను వైద్య బృందం పరీక్షించి, ఆ వివరాలను నమోదు చేసేది.

**రాష్ట్రం కోసం బలిదానం...**

ఉద్యమం ఉధృతం కావడం ప్రభుత్వం స్పందించకపోవడంతో ఓరోజు బులుసు సాంబమూర్తి, నరసింహలతో మాట్లాడారు. క్రమక్రమంగా దేహం బలహీనం అయ్యి, స్పృహ తప్పి పోయినా దీక్ష నిర్విఘ్నంగా కొనసాగాలని కోరుకొన్నారు. స్పృహ లేనప్పుడు ఎవరూ బలవంతంగా ఇంజెక్షను ద్వారా ఆహారం ఎక్కించరాదని ఆయన చెప్పారు. అప్పటికే రాష్ట్రంలో జరుగుతున్న అల్లరును ఆయన వ్యతిరేకించారు. డిసెంబర్ 15 శ్రీరాములు ఆత్మార్పణ రోజు ఉదయం నుంచే ఆయన స్పృహలో లేరు. రాత్రి 11.23 గంటలకు పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం తనను తాను బలిదానం చేసుకొన్నాడు.

**రెండెడ్ల బండి మీద కట్టిన రథంపై శ్రీరాములు అంతిమ యాత్ర..**

డిసెంబర్ 16వ తేదీన రెండెడ్ల బండి మీద కట్టిన రథంపై శ్రీరాములు అంతిమ యాత్ర జరిగింది. కన్యకాపరమేశ్వరి దేవస్థానం వారు నిర్మించిన.. మాళైలోని ఆర్యవైశ్య శ్మశానంలో అంత్యక్రియలు జరిగాయి. ఈ సందర్భంగా పక్కనే ఉన్న ఒక పెంకుటిల్లు వరండాలో ప్రకాశం పంతులు, బులుసు సాంబమూర్తి తదితరులు శ్రీరాములు గురించి ప్రసంగించారు. ''గాంధీజీ తుపాకీ గుండుకు అసువులు కోల్పోగా, ఆయన బోధించిన సత్యం, అహింసల కోసం శ్రీరాములు ఆత్మ బలిదానం చేశాడు'' అని ప్రకాశం పంతులు అన్నారు.ప్రజలు హింసాత్మక చర్యలు పాల్పడ్డారు. తదుపరి జరిగిన పరిణామాలలో మద్రాసు నుండి విశాఖపట్నం వరకు ఆందోళనలు, హింస చెలరేగాయి. పోలీసు కాల్పుల్లో ప్రజలు మరణించారు. మద్రాసు లేకుండా ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డిసెంబర్ 19వ తేదీన లోక్‌సభలో ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ప్రకటించారు. ఈ మేరకు వాంఛూ కమిటీని ఏర్పాటు చేశారు. పలు తర్జనభర్జనల తర్వాత కర్నూలు రాజధానిగా 1953 నవంబర్ 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పరచారు. బళ్ళారి, బరంపురం,హోస్పేట, తిరువళ్ళూరు లాంటి తెలుగు ప్రాంతాలు కూడా వదులుకొని ఆంధ్ర రాష్ట్రం ఏర్పరచారు. ఈ మహనీయుని జ్ఞాపకార్థం రాష్ట్రప్రభుత్వం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం స్థాపించింది2008 మే 22వ తేదీన నెల్లూరు జిల్లా పేరును శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

### శరీరం కృశించినా.. ఆగని దీక్ష..

ప్రకాశం పంతులు మాటల్లో చెప్పాలంటే.. ''ఉపవాసం చెయ్యడానికి ఎవ్వరూ స్థలం ఇవ్వకపోతే అట్టలు కట్టుకొని, వీధుల్లో తిరిగి ప్రాణాలైనా అర్పిస్తానన్న పట్టుదల గల మనిషి శ్రీరాములు''. ఆయనకు ఆశ్రయం ఇచ్చేందుకు బులుసు సాంబమూర్తి ముందుకొచ్చారు. మద్రాసు రాజధానిగా వుండే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం మద్రాసులో 1952 అక్టోబర్ 19న బులుసు సాంబమూర్తి ఇంట్లో నిరాహారదీక్ష ప్రారంభించాడు. చాలా మామూలుగా ప్రారంభమైన దీక్ష, క్రమంగా ప్రజల్లో అలజడి రేపింది. ఆంధ్ర కాంగ్రెస్ కమిటీ ఈ దీక్షను సమర్థించలేదు. ప్రజలు మాత్రం శ్రీరాములుకు మద్దతుగా సమ్మెలు, ప్రదర్శనలు జరిపారు. ప్రభుత్వం మాత్రం రాష్ట్రం ఏర్పాటు దిశగా విస్పష్ట ప్రకటన చెయ్యలేదు.రోజురోజుకూ ఆరోగ్యం క్షీణిస్తూ ఉన్నా, శ్రీరాములులో మనోధైర్యం మాత్రం మరింత పెరుగుతుండేది. తన ఆరోగ్యానికి ఏమీ ఢోకా లేదని ఆయన ఉత్తరాల్లో పదే పదే చెప్పేవారు. నవంబర్ 27వ తేదీ నాటికి శ్రీరాములు ఇంట్లోనే కొద్దికొద్దిగా తిరుగుతూ అవసరాన్ని బట్టి మాట్లాడుతుండేవాడు. ఆ తర్వాత అతని ఆరోగ్యం క్రమంగా క్షీణించసాగింది. వార్తా పత్రికల్లో ఆయన ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తమయ్యేది. డాకర్లు వచ్చి రక్త పరీక్షలు కూడా చేశారు. నిద్రపోయే సమయంలో తప్పితే ఆయనకు ఎల్లప్పుడూ నోట్లో లాలాజలం కారుతుండేది. నిమిష నిమిషానికి చొంగ కారుతుండేది. తరచూ వాంతులు అయ్యేవి. ఎక్కిళ్ళు, తుమ్ములు వచ్చేవి. అప్పటికే ఆయన అలసిపోవడం... పైగా వాంతులు, తుమ్ములతో మరింత కష్టంగా ఉండేది. డిసెంబరు 5వతేదీ నాటికి ఎక్కిళ్లు, తుమ్ములు తగ్గినా శీతవిరోచనాలు మొదలయ్యాయి. దాంతో మరింత నీరసించారు. శిబిరంలోని అందరూ గాబరాపడ్డారు. నిరాహార దీక్షకు కూర్చునే ముందు ఆయన రోజుకు మూడుసార్లు నీటిలో నిమ్మకాయ రసం, కొంచెం తేనె కలిపి తీసుకుంటానని ప్రకటించారు. అవి కూడా వాంతులు అయిపోయేవి. కొన్ని కొన్ని సందర్భాల్లో నెత్తురు పడ్డది. ఇక ఆత్మార్పణ వారం రోజులు ఉందనగా శ్రీరాములు పూర్తిగా లేవలేని, మాట్లాడలేని స్థితికి వచ్చారు. డిసెంబర్ నెల కావడంతో విపరీతంగా చలి. దాంతో, ఆయన వణుకుతుంటే ఎప్పుడూ చొక్కా వేసుకోని శ్రీరాములుకు చొక్కా తొడిగారు. ఆయన బాగా నీరసించిపోవడంతో గ్లూకోజ్ ఇవ్వాలని డాకర్లు చెప్పారు. అప్పటికే మాట్లాడలేని స్థితిలో ఉన్న శ్రీరాములు వద్దని చేయి ఊపుతూ సూచించారు.



-పోతుగంటి వెంకటరమణ,
న్యూస్ నెట్‌వర్క్ ఇన్‌ఛార్జి
(వీ3 న్యూస్, విశ్వంభర)
సెల్: 6304475133

# బాలికల రక్షణకు సమాజం సన్నద్ధం కావాలి



**బాలికలపట్ల వివక్ష, అసమానత, చిన్నచూపు, లైంగిక వేధింపులు, అత్యాచారాల నుండి రక్షించడానికి కుటుంబం, మిత్రులు, సమాజం సన్నద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను, అనర్థాలను నివారించి, వారి హక్కులను తెలియజేసేందుకు ఐక్యరాజ్య సమితి కెనడా తీర్మానంతో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని అధికారికంగా ప్రతిపాదించింది. కెనడా మహిళా మంత్రి రోనా అంబ్రోస్ ఈ తీర్మానాన్ని స్పాన్సర్ చేసింది. అమెరికన్ పౌరహక్కుల కార్యకర్త ఎలానార్ రూజ్‌వెల్ట్, 192 దేశాలు సంతకం చేసిన మానవ హక్కుల ప్రకటనలో మహిళల, పురుషుల సమానత్వాన్ని ప్రతిబింబించేలా మ్యాన్ అన్న పదాన్ని పీపుల్‌గా మార్చింది. మహిళల ఆత్మగౌరవం కాపాడడం కోసం పోరాటం చేసిన ఎలానార్ రూజ్‌వెల్ట్ పుట్టిన రోజైన అక్టోబరు 11ను అంతర్జాతీయ బాలికా దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి గుర్తించింది. 2012, అక్టోబరు 11న తొలిసారిగా ఈ దినోత్సవం నిర్వహించారు. బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలియచేయడమే కాకుండా, ఆ సమస్యలు పరిష్కారమైనప్పుడు జరిగే పరిణామాల గురించి కూడా అవగాహన పెంచడానికి ఈ దినోత్సవం ఉపయోగపడుతున్నది. సమాజంలో బాలికలు ఎదుర్కొన్న సమస్యల గురించి ప్రజలలో అవగాహన పెంచడానికి జరుపుకుంటారు. బాలికా శిశువు గురించి అసమానత్వం, విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, గౌరవం, బాల్య వివాహాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు.**

వాషింగ్టన్ లోని యునైటెడ్ స్టేట్స్ అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ 2014లో అందించిన వివరాల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 62 మిలియన్లకు పైగా బాలికలకు విద్య అందడంలేదు. ప్రపంచవ్యాప్తంగా 5 నుండి 14 సంవత్సరాల వయస్సు గల బాలికలు, అదే వయస్సు గల అబ్బాయిల కంటే 160 మిలియన్ గంటలకుపైగా ఇంటి పనుల కోసం తమ సమయాన్ని కేటాయిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా, నలుగురు బాలికల్లో ఒకరికి 18 ఏళ్ళకంటే ముందుగానే వివాహం జరుగుతోంది. 2016, అక్టోబరు 11న, ఐక్యరాజ్యసమితి వుమెన్ గుడ్‌విల్ అంబాసిడర్ ఎమ్మా వాట్సన్, బలవంతపు బాల్య వివాహాలను అంతం చేయాలని ప్రపంచ దేశాలను కోరింది.


చైనా మొదలు అమెరికా సహా ఆధునికత వైపు అడుగులు వేస్తున్న భారత్‌లోనూ అమ్మాయిల పట్ల వివక్ష ఉంటుందని గ్లోబల్ ఎర్లీ అడల్సెంట్ స్టడీ పేరిట నిర్వహించిన అధ్యయనంలో అమ్మాయిలు పదహారేళ్ల వయసుకు చేరుకున్నప్పటికీ మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తేలింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ, జాన్‌హాఫ్‌కిన్స్ బ్లూమ్ బెర్గ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ కిడ్స్ సంయుక్తంగా 15 దేశాల్లో నిర్వహించిన సర్వేలో అమ్మాయిలు శారీరకంగా బలహీనులనే విషయం... చిన్న వయసులోనే ముద్ర పడేలా చేయడంలో తల్లిదండ్రులు, బంధువులు, మిత్రులు, టీచర్లు కీలకపాత్ర పోషిస్తున్నట్టు తేలింది.

బాలికల కంటే అబ్బాయిలకే ఎక్కువ ప్రాధాన్యత అధికంగా ఇవ్వడం సర్వత్రా వ్యక్తమవు తున్నది. ఇటీవల కాలంలో ఆడపిల్లగా పుట్టడం, పుట్టినా సురక్షితంగా మనుగడ సాగించడమే దుర్భరమైన దురవస్థ ఉంది. ఆడపిల్ల అనగానే సమాజంలో చిన్నచూపు చూస్తున్నారు. అంతేకాకుండా కడుపులో బిడ్డ ఆడపిల్ల అని తెలియగానే భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారు. పుట్టిన తరువాత అనేక ఆంక్షలు విధిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా బాల్య వివాహాల్లో నలభై శాతానికి పైగా భారత్‌లోనే జరుగు తున్నాయన్న చేదు నిజాన్ని యునిసెఫ్ స్పష్టం చేసింది. బాలికల ఉన్నత విద్య మరో సమస్యగా మారింది, ఇప్పటికీ అధిక రాష్ట్రాల్లో 40 శాతానికి పైగా పదో తరగతి కంటే ముందే బడి మాని వేస్తున్నారు. ప్రభుత్వాలు ఎన్ని కార్యక్రమాలు చేసినా, ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా, ఉన్నత విద్యలో డ్రాపౌట్స్ తగ్గడంలేదు. బాల్య వివాహం కారణంగా రాష్ట్రంలోని 28 శాతం మంది బాలికలకు పద్దెనిమిది సంవత్సరంలోపే వివాహాలు చేస్తున్నారు. యునెస్కో వెలువరించిన ప్రపంచ విద్యా నివేదిక ప్రకారం భారత దేశంలో వయోజన నిరక్షరాస్యులలో మహిళలు 68 శాతం వున్నారు. పంతొమ్మిది ఏళ్లు నిండక ముందే దాంపత్య జీవితంలో అడుగుపెడుతున్నారు. బాలికల సంఖ్య 41 శాతం అని జనగణనలో తేలింది. బాల్య వివాహాలు, పాఠశాలలు చేరువగా, అందుబాటులో లేకపోవడం, బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్ల కొరత, లైంగిక విచక్షణ వంటి సమస్యలు భారతావనిలో బాలిక విద్యకు శాపంగా పరిణమించాయి. పోషకాహార లోపం కారణంగా రక్తహీనతతో బాధపడుతున్న బాలికల సంఖ్య దేశంలో దాదాపు డెబ్బై శాతం అన్న అంచనాలు తీవ్రంగా కలవరపరుస్తున్నాయి. మహిళా కార్మిక శక్తి, వారి ఆదాయం, అక్షరాస్యత స్థాయి, జననాల విషయం, తదితర అంశాల్లో అథమస్థాయిలో వున్న 20 దేశాల్లో మన దేశం ఒకటి కావడం ఆందోళనకర అంశం. మహిళలు పురుషులకన్నా ఎందులోనూ తక్కువ కాదు. ఆడపిల్లలు ప్రతి రంగంలో, చదువులో మొదలుకుని ఆటల దాకా, రాణిస్తున్నారు. పురుషులతో పోటీ పడుతున్నారు. బాలికల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం నేషనల్ గర్ల్స్ డెవలప్‌మెంట్ మిషన్ పేరుతో ఓ కార్యక్రమం తెచ్చింది. బాలికల సంపూర్ణ ఎదుగుదల కోసం రకరకాల సదుపాయాలు కల్పిస్తోంది. 2008 నుంచి దీన్ని ఏటా నిర్వహిస్తోంది. సమాజంలో బాలికల సంరక్షణ, వాళ్ల హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల అంశాలపై అవగాహన కల్పిస్తోంది. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధాని అయ్యాక... "బేటీ బచావో బేటీ పడావో" స్కీం తెచ్చారు. తద్వారా బాలికల చదువు, పెంపకంపై మరిన్ని జాగ్రత్తలు తీసుకునేలా చేస్తున్నారు.

నేడు మహిళా సంఘాలు, ప్రభుత్వ యంత్రాంగం నిత్యం ఎన్నో చర్యలు తీసుకుంటున్నా మైనర్లపై అత్యాచారాలు ఆగడంలేదు. సమాజంలో అమ్మాయిలకు, మహిళలకు రక్షణ కరువవుతున్నది. ఎంతోమంది ఆడ పిల్లలు ఈ లోకంలో అడుగుపెట్టక ముందే బలవంతపు మరణాలకు బలవు తున్నారు. ఆధునిక పరిజ్ఞానం ఎంత పెరిగినా మానవతా విలువలు మాత్రం పెరగడం లేదు. దానికి నిదర్శనం భ్రూణ హత్యలు. గర్భస్థ శిశువుల లింగ నిర్ధారణను నిషేధించి తద్వారా ఆడపిల్లల భ్రూణ హత్యలు నివారణ కోసం 1994లోనే చట్టం తెచ్చినా అది ఏనాడూ పకడ్బందీగా అమలైన జాడలు లేవు.

సమాజంలో చైతన్యం నింపాలంటే ముందు మహిళ జాగృతం కావాలి. స్త్రీ కళ్లు తెరిస్తే కుటుంబం, దానితో పాటు గ్రామం, రాష్ట్రం, దేశం పురోగతి బాట పడతాయి' అని భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ గతంలో చేసిన వ్యాఖ్యలు గుర్తుంచుకోవాలి. కౌమారదశలో ఆడపిల్లలు, యువతులు ఎదుర్కొనే వివిధ రకాల హింసను అంతం చేయాలి.

బాలికలు వారి చట్టపరమైన హక్కులు, జీవిత వాస్తవాలను గురించి తెలుసుకోవాలి. వారు మంచి విద్య, పోషణ, ఆరోగ్య సంరక్షణ హక్కులను కలిగి ఉంటారని అవగాహన కల్పించాలి. గృహ హింస చట్టం 2009, చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ 2006 , కట్న నిషేధ చట్టం 2006 వంటి చట్టాల గురించి తెలుసుకోవాలి. వారి సరైన హక్కులు పొందడానికి జీవితంలో అన్ని సవాళ్లను ఎదురుకొని ముందుకు వెళ్ళాలి.



-రామ కిష్టయ్య
సంగన భట్ల...
9440595494

# చైన్ స్నాచర్‌ను పట్టుకున్న సీసీఎస్ పోలీసులు

## ప్రజలు 100కు ఫోన్ చేసి వినియోగించుకోవాలి: ఎస్పీ




**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ పట్టణంలో గత కొంత కాలంగా వరుస చైన్ స్నాచింగ్‌లు జరుగుతున్నందున ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని జిల్లా ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు క్రైమ్ అడిషనల్ ఎస్పీ చెన్నయ్య పర్యవేక్షణలో మహబూబాబాద్ డి.ఎస్.పి తిరుపతిరావు ఆధ్వర్యంలో మహబూబాబాద్ టౌన్, సీసీఎస్ పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి శుక్రవారం ఉదయం 6 గంటలకు వాహనాలు తనిఖీ చేస్తుండగా మహబూబాబాద్ ఇల్లందు రోడ్ ఆర్తీ గార్డెన్ వద్ద ఒక వ్యక్తి అనుమానస్పదంగా బయ్యారం వైపు నుండి మహబూబాబాద్ వైపు కు హీరో స్పెండర్ బైకు పై వస్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా వెంబడించి పట్టుకోవడం జరిగింది ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ పేర్కొన్నారు. ఆంగోతు విక్రమ్ తన తల్లిదండ్రులతో కలిసి 2013 వరకు ఖమ్మంలో ఉండేవాడని. ఆ తర్వాత విక్రం తల్లి దండ్రులు గార్ల బయ్యారంకు నివాసం మార్చారని. దాంతో విక్రం కిరాయి ఇంట్లో ఉంటూ డిగ్రీ చదువుతున్న సమయంలో సెల్ ఫోన్ లో ఆన్ లైన్ బెట్టింగ్ ఆడటం అలవాటు అయి డబ్బులు పోగొట్టుకొని అప్పులయ్యాడని ఎస్పీ తెలిపారు. తిరిగి డబ్బులు ఎలా సంపాదించాలని సెల్ ఫోన్ ఫేస్ బుక్ లో చైన్ స్నాచింగ్ సీన్లు చాలాసార్లు చూసి, తను కూడా అలాగే చైన్ స్నాచింగ్‌లు చేసి డబ్బులు సంపాదించి, అప్పులు తీర్చి తిరిగి ఆన్ లైన్ బెట్టింగ్ లు ఆడుతూ జల్సాలు చేస్తూ బ్రతకాలని ప్లాన్ చేసుకున్నాడని. గత సంవత్సరం నుండి తన తండ్రి హీరో స్పెండర్ ప్లస్ బైక్ పై ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల ఏరియాలో తిరుగుతూ ఒంటరిగా వెళ్లే మహిళల మెడలలో ఉన్న బంగారు వస్తువులను లాక్కొని దొంగతనాలు చేసేవాడని ఎస్పీ అన్నారు. గొలుసు దొంగతనాలకు వెళ్లేటప్పుడు ఎవరు గుర్తుపట్టకుండా తన బైక్ నెంబర్ ప్లేట్ ను తొలగించి ముఖానికి మాస్క్ ధరించి చైన్ స్నాచింగ్ లు చేసేవాడని. ఇప్పటివరకు మహబూబాబాద్ పట్టణంలోని కృష్ణ కాలనీ లో ఒకటి, బ్యాంకు కాలనీలో రెండు, కంకర బోడు ఏరియా లో ఒకటి చొప్పున మొత్తం 4, ఖమ్మం టౌన్ ఏరియాలో ఏడు గొలుసు దొంగతనాలు చేశాడని ఎస్పీ తెలిపారు. తాను దొంగిలించిన బంగారు వస్తువులను ఎవరికైనా అమ్ముకునేందుకు తన స్పెండర్ బైక్ పై శుక్రవారం మహబూబాబాద్ కు వస్తుండగా ఆర్తీ గార్డెన్స్ వద్ద పోలీసు అతనిని పట్టుకున్నారు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ వివరించారు. అతని నుండి 22.4 తులాల బంగారు వస్తువులు, హీరో స్పెండర్ ప్లస్ బైక్, ఒక సెల్ ఫోన్, (వీటి మొత్తం విలువ రూ. 14,63,000లు) మణప్పురం గోల్డ్ లోన్ నందు తాకట్టు లో ఉన్న 33 గ్రాముల బంగారు వస్తువులు (విలువ రూ. 2,31,000లు), మొత్తం బంగారు వస్తువుల విలువ రూ. 16,94,000ల ని స్వాధీనపరచుకున్నామని ఎస్పీ తెలిపారు. ఇతనిపై సస్పెక్ట్ షీట్, పీడీ యాక్ట్ కూడా పెట్టి నిఘా పెంచడం జరిగిందని ఎస్పీ అన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో డీజే బాక్సులు నిషేదం

### కలెక్టర్ జితేష్




**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** బహిరంగ ప్రదేశాలలో డీజే బాక్సులు ఉపయోగించి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ హెచ్చరించారు. అధిక శబ్దం వచ్చే పరికరాల వినియోగంపై పోలీస్ చట్టం నిబంధనల ప్రకారం తాజాగా ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈనెల 20 నుంచి ఈ నిబంధన అమలులోకి వస్తుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పేర్కొన్నారు.

# బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



**విశ్వంభర, మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం చిన్న చింతకుంట మండలం లోని శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానంలో శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలపై జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) పాల్గొన్నారు. ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాల న్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు దగ్గరుండి పర్యవేక్షించాలని కోరారు. ముఖ్యంగా సెప్టెంబర్ 6 న అలంకారం, 8 న ఉద్దాల ఉత్సవం రోజులలో ప్రజలు లక్షలాదిగా తరలి వస్తారని, దానికి తగ్గ ఏర్పాట్లు చేయాలని, క్యూ లైన్ లు, పార్కింగ్ వద్ద పటిష్టమైన బారికేడ్ల వ్యవస్థ ఏర్పాటు చేయాలని, మంచినీటి కొరత లేకుండా చూడాలని, కరెంట్ అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ అందించాలని, శానిటేషన్ పకడ్బందీగా నిర్వహించాలని, మహాలక్ష్మీ ఉచిత బస్సు సౌకర్యం దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం ఎక్కువ బస్సులు నడపాలని, ముఖ్యమైన రహదారులు వెడల్పు చేసి, రోడ్ల మరమ్మత్తులు పూర్తి చేయాలని, చైన్ స్నాచింగ్, పిక్ పాకెటర్లను దృష్టిలో పెట్టుకొని పకడ్బందీగా పోలీస్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఈవ్ టీజింగ్ దృష్టిలో ఉంచుకొని షీ టీంలు ఏర్పాటు చేయాలని, వీఐపీలకన్న సామాన్య భక్తులకే ఎక్కువ ప్రాధాన్యమివ్వాలని, భక్తులకు లోటు లేకుండా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండాఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

# త్వరలో నెట్ బ్యాంకింగ్ సేవలు

## కడ్తాల్ మండల కేంద్రంలో డీసీసీబీ బ్యాంకు ఏర్పాటు చేయాలి

### డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, డైరెక్టర్ వెంకటేష్ గుప్తా



**విశ్వంభర, కడ్తాల్:** జిల్లా సహకార బ్యాంకుల ద్వారా ఖాతాదారులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేం దుకు తెలంగాణ స్టేట్ కో-ఆపరేటివ్ మేనేజింగ్ కమిటీ సంసిద్ధంగా ఉందని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డీసీసీబీ చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువ ర్ధన్ రెడ్డి, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తాలు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్బీఐ నియమ నిబంధనలను అనుసరించి డీసీసీబీ బ్యాంకుల లో త్వరలో నెట్ బ్యాంకింగ్ సేవలు, యూపీఐ, గూగుల్ పే, ఫోన్ పే వంటి సేవలు అమలులోకి రానున్నాయని ఇక ఖాతాదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా జిల్లా కో-ఆపరేటివ్ బ్యాంకు సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అలాగే కడ్తాల్ మండల కేంద్రంలో డీసీసీబీ బ్యాంక్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా రైతన్నలకు, ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ సేవలు కొనసాగించేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు. అన్ని బ్యాంకుల వలే తమ బ్యాంకు ద్వారా కూడా మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు అవసరమయ్యే ఏర్పాట్లను చేయడానికి సంసిద్ధంగా ఉన్నామన్నారు. ఇప్పటి వరకు వ్యవసాయ, గృహ, విద్య తదితర వాటిపై రుణాలను మంజూరు చేయడం జరిగిందని అదేవిధంగా కొనసాగిస్తూ.. మునుముందు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నియమ నిబంధనలు పాటిస్తూ ముందుకు సాగుతామని వారు తెలిపారు.

## డా. కోడి శ్రీనివాసులకు మహాత్మా గాంధీ శాంతి పురస్కారం



**విశ్వంభర,చండూరు :** గాంధీజీ ఫౌండేషన్, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు డాక్టర్ కోడి శ్రీనివాసులకు తెలం గాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ గ్లోబల్ పీస్ అవార్డు 2024 కు ఎంపికయ్యారు. ఈయన ఈ అవార్డును ఈ నెల 22వ తేదీ మంగళవారం రోజున హైదరాబాదులోని తెలంగాణ సార స్వత పరిషత్ ఆడిటోరియం నందు అందుకోనున్నారు. ఈ కార్యక్ర మంలో ఎమ్మెల్సీలు బండా ప్రకాష్, దయానంద్ లు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, రిటైర్డ్ జడ్జ్ చంద్రకుమార్, గోపిశెట్టి నిరంజన్, తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షులు రాజనారాయణ్‌లు పాల్గొం టారని తెలిపారు. డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ తాను గాంధీజీ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలకు గాను ఈఅవార్డుకి ఎంపిక అయ్యానని తెలిపారు.

# ముస్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు



**విశ్వంభర, షాద్‌నగర్:** షాద్‌నగర్ మున్సిపాలిటీ ఆవరణలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ వెంకన్న ఆధ్వర్యంలో పట్టణ మున్సిపల్ శాఖ పరిధిలో పని చేస్తున్న సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్మన్ కే నరేందర్ హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా కంటి పరీక్షలతో పాటు, క్షయ వ్యాధికి సంబంధించిన పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సిబ్బంది రోజువారి పనులలో పడి ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోక పపోవడం, తరచు అనారోగ్యాలకు గురౌతుంటారు కాబట్టి, సిబ్బందికి అనారోగ్య సమస్యలు ఏర్పడకుండా వారికి అవసరమైన వైద్య పరీక్షల కోసం హెల్త్ క్యాంప్ నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఈశ్వర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా

# వాలీబాల్ పోటీలు



**విశ్వంభర,మెట్ పల్లి:** మెట్ పల్లి పట్టణంలోని మినీ స్టేడియంలో పోలీసు అమరవీరుల సంస్కరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం సబ్ డివిజన్ పరిధిలోని 10 గ్రామాల వాలీబాల్ జట్ల మధ్య పోటీ నిర్వహించారు. డీఎస్పీ ఉమామహేశ్వరరావు, సీఐ నిరంజన్ రెడ్డి క్రీడాకారుల పరిచయ కార్యక్రమం అనంతరం పోటీలో పాల్గొన్న క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఉమా మహేశ్వర రావు మాట్లాడుతూ ఈ టోర్నమెంట్ యొక్క ముఖ్య ఉద్దేశం యువత చెడు మార్గాల్లో డ్రగ్స్ సైబర్ నేరగాళ్ల ఉచ్చు లో పడి ఎక్కువ శాతం మోసానికి గురి అవుతున్నారని, వారికి అవగాహన కలిగించి యువతను సన్మార్గంలో నడిపించడానికి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు డి.ఎస్.పి ఉమామహేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో సీఐ నిరంజన్ రెడ్డి ఎస్ఐలు చిరంజీవి, రాజు, ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్, మల్లాపూర్ ఎస్సై కిరణ్, ట్రైనీ ఎస్ఐ సతీష్, పీఈటి ఆల్ రౌండర్ గంగాధర్, ఎంఏ భారీ, వి గంగాధర్, సిహెచ్ లక్ష్మీనారాయణ, సీనియర్ క్రీడాకారులు అమీర్ అలీ, వాలీబాల్ క్రీడాకారులు రాజేష్, వివిధ గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఘనంగా పౌర్ణమి పూజ



**విశ్వంభర, కోరుట్ల:** గణేష్ నవదుర్గా మండలి ఆద్వర్యంలో జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని త్రిశక్తి మాత దేవాలయంలో గురువారం సాయంత్రం ఘనంగా 'పౌర్ణమి పూజ' నిర్వహించారు. త్రిశక్తి మాత దేవాలయంలో నిర్వహించిన దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా సహకరించిన దాతలు, పాత్రికేయ మిత్రులను ఘనంగా సత్కరించారు. అనంతరం అమ్మవారి ఓడి బియ్యంతో అన్నప్రసాదం వితరణ జరిపారు. గణేష్ నవదుర్గా మండలి అధ్యక్షులు కటుకం గణేష్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ముగిసిన అనంతరం కోజాగిరి పౌర్ణమి సందర్భంగా 'పౌర్ణమి పూజ' నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఉత్సవాలకు సహకరించిన దాతలు, పాత్రికేయ మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గణేష్ నవదుర్గ మండలి అధ్యక్షులు కటుకం గణేష్, ఉపాధ్యక్షులు తాటిపాముల రమేష్, ప్రధాన కార్యదర్శి గజ్జల శంకర్, సహాయ కార్యదర్శి పోతని రాజేశం, కోశాధికారి ఆడువాల ప్రభాకర్, సభ్యులు కటుకం గంగారాం, సంకు అశోక్, కస్తూరి రాజేశ్వర్, గాజుల రమేష్, వేముల నందీశ్వర్, కార్తీక్, విజయ్ పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**విశ్వంభర, ఊరుకొండ:** ఊర్కొండ: మండల కేంద్రానికి చెందిన కంఠం చంద్రయ్య గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మాధారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్ రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేసి ఆ కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల ద్వారా ఐదు వేల రూపాయలు, కాంగ్రెస్ యువ నాయకుడు కంఠం శ్రీశైలం మరో మూడు వేల రూపాయలు మొత్తం 8 వేల రూపాయలను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గ్రామ అధ్యక్షుడు అరిఫ్, మాజీ వార్డు సభ్యులు రవి, వాల్మీకి, నాయకులు దయాకర్, ఆదినారాయణ, కంఠం రాములు, అశోక్, అభిషేక్, ఖాజా, తేజ, తిరుపతయ్య, కాంగ్రెస్ నాయకులు, డీఎన్ఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు కిట్స్ పంపిణీ

- స్వచ్ఛ భారత్‌లో ప్రతి ఒక్కరు పాల్గొనాలి
- మున్సిపల్ ఛైర్మన్ సత్యం




**విశ్వంభర, కల్వకుర్తి:** కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామి వివేకానంద సేవా బృందం, జిల్లా యువజన క్రీడల శాఖ ( మై భారత్ ) ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ పై అవగాహన సదస్సు కార్యక్రమం స్థానిక కల్వకుర్తి సరస్వతి శిశుమందిర్ లో నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా మున్సిపల్ ఛైర్మన్ ఎడ్మ సత్యం హాజరయ్యి మాట్లాడారు. ప్రతి ఒక్కరం పరిసరాలను శుభ్రం చేసుకోవాలని, తడి చెత్త పొడి చెత్త పై అవగాహన పెంచుకోవాలని అన్నారు. ముఖ్యంగా కల్వకుర్తి పట్టణం స్వచ్ఛ్ భారత్ లో పరిశుభ్రత లో కేంద్ర రాష్ట్ర పురస్కారాలు అందుకొనేందుకు స్వచ్ఛత గురించి ప్రజలను అవగాహన పరుస్తున్నామని తెలిపారు. సేవ బృందం అధ్యక్షుడు శివ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ పై అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని, యువత ప్రతి అదివారం స్వచ్ఛ భారత్ లో పాల్గొనాలి అని కోరారు. అనంతరం విద్యార్థులకు స్వచ్ఛ భారత్ కిట్స్ (డైరీ, టోపీలు, పెన్నులు) పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్.ఎస్.ఎస్ జిల్లా కార్యవాహ ఆంజనేయులు, పాఠశాల ప్రధానాచార్యులు రాజు, సేవా బృందం సభ్యులు హర్షిత్ , చింటూ పాల్గొన్నారు.

## జీవిత బీమా చెక్కును అందజేసిన ఎమ్మెల్యే



**విశ్వంభర, ఘట్కేసర్:** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త కీర్తి శేషులు ద్యాగాల రమేష్ కొద్దిరోజుల క్రితం మరణించడం జరిగింది. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తగా సభ్యత్వం నమోదు కింద ఇన్సూరెన్స్ పాలసీ ఉండడంతో అతని భార్య దేగల రజితకు శుక్రవారం ఘట్కేసర్ క్యాంప్ కార్యాలయంలో రెండు లక్షల రూపాయల చెక్కును మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ ఘట్కేసర్ మున్సిపాలిటీ అధ్యక్షులు బండారి శ్రీనివాస్ గౌడ్, మున్సిపాలిటీ వైస్ ఛైర్మన్ పలుగుల మాధవ రెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్య కర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తదంతరం మేడ్చల్ జిల్లా పోచారం, ఘట్కేసర్ మున్సి పాలిటీకి చెందిన ప్రజాప్రతినిధులకు, నాయకులకు ఎమ్మెల్యే మల్లారెడ్డి మనువరాలు మల్కా జిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కూతురు మర్రి శ్రేయారెడ్డి ఆదిత్యల వివాహానికి కుటుంబ సమేతంగా విచ్చేసి వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు.

## మెస్‌ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**విశ్వంభర, ఘట్కేసర్:** మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీలో నూతనంగా ఏర్పాటు చేసిన సాయి కృప మెస్‌ని శుక్రవారం సినీ దర్శకులు పోసాని కృష్ణ మురళి మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో స్థానిక మున్సిపాలిటీ చైర్మన్ కొండల్ రెడ్డి, ఘట్కేసర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు, నాయకులు, మెస్ యాజమాన్యం, తదితరులు పాల్గొన్నారు.

# రిలయన్స్, ఎయిర్‌టెల్‌కు బీఎస్ఎన్ఎల్ మాస్టర్ స్ట్రోక్

- ఇక సిమ్ లేకుండానే కాల్స్!
- 'డైరెక్ట్ టు డివైజ్' సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చిన బీఎస్ఎన్ఎల్
- గ్లోబల్ శాటిలైట్ కమ్యూనికేషన్ సంస్థ వియాసత్‌తో కలిసి సరికొత్త సేవలు
- మొబైల్ టవర్లతో పనిలేకుండానే ఫోన్ కాల్స్
- స్మార్ట్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఇతర స్మార్ట్ డివైజ్‌లకు కూడా శాటిలైట్ కమ్యూనికేషన్

**విశ్వంభర, మహబూబాబాద్:** రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌కు ప్రభుత్వరంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ మరోమారు మాస్టర్ స్ట్రోక్ ఇచ్చింది. గ్లోబల్ శాటిలైట్ కమ్యూనికేషన్ సంస్థ 'వియాసత్'తో కలిసి 'డైరెక్ట్ టు డివైజ్ (డీటుడీ) సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు ట్రయల్స్ కూడా పూర్తిచేసుకుంది. ఆండ్రాయిడ్, ఐవోఎస్ యూజర్లు ఇద్దరికీ ఇది అందుబాటులోకి రానుంది. అంతేకాదు, స్మార్ట్ వాచ్‌తో పాటు మార్కెట్లో అందుబాటులో ఉన్న ఇతర స్మార్ట్ డివైజ్‌లకు కూడా ఇది సపోర్ట్ చేస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర సేవలను అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతోనే ఈ సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చింది. డైరెక్ట్ టు డివైజ్ సాంకేతికతతో సిమ్‌కార్డు లేకుండానే మొబైల్ ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, కార్ల యజమానులు కూడా నేరుగా శాటిలైట్ నెట్‌వర్క్‌తో అనుసంధానం కావొచ్చు. పర్సనల్, డివైజ్ కమ్యూనికేషన్‌కు సపోర్ట్ చేసేలా దీనిని డిజైన్ చేశారు. ఎక్కడున్నామన్న దానితో సంబంధం లేకుండా నిరంతర కనెక్టివిటీని ఇది అందిస్తుంది. యూజర్లకు ఇది గొప్ప కవరేజీ ఇవ్వడంతోపాటు నమ్మకమైన కమ్యూనికేషన్ అంది స్తుంది. మరీ ముఖ్యంగా మారు మూల ప్రాంతాలకు గొప్ప ఉపయోగకరంగా ఉంటుంది.

**మొబైల్ టవర్లతో పనిలేదు:** శాటిలైట్ కమ్యూనికేషన్‌లో భాగమైన డైరెక్ట్ టు డివైజ్ సేవల్లో ఇక మొబైల్ టవర్లతో పని ఉండదు. ఇంకా చెప్పాలంటే శాటిలైట్ ఫోన్లలా అన్న మాట. స్మార్ట్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఇతర స్మార్ట్ డివై జ్‌లను నేరుగా ఈ టెక్నాలజీ సాయంతో అంతరాయం లేని కాల్స్ మాట్లాడుకోవచ్చు. ట్రయల్స్‌లో భాగంగా 36 వేల కిలో మీటర్ల దూరంలోని ఉపగ్రహాన్ని ఉపయోగించి దిగ్విజయంగా ఫోన్ కాల్ చేయడం జరిగింది.

## యువత చెడు వ్యసనాలు అలవాటు చేసుకోవద్దు



**విశ్వంభర, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా వార్షిక తనిఖీలలో భాగంగా గురువారం మునిపల్లి పోలీసు స్టేషన్ ను జిల్లా ఎస్ పీ సందర్శించారు. రాత్రి 10 గంటలకు మునిపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీలు, కేడీలు, సస్పెక్ట్ ల ఇండ్ల వద్దకు ఎస్ పీనేరుగా వెళ్ళి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారితో మాట్లాడుతూ ప్రస్తుతం జీవన విధానం, వారు చేస్తున్న పని/ఉద్యోగం గురించి అడిగి తెలుసుకున్నారు. గతంలో చేసిన తప్పులను తిరిగి పునరావృతం చేయకుండా సత్ ప్రవర్తన కలిగి సాధారణ జీవన విధానాన్ని కలిగి ఉండాలని సూచించారు. సత్ ప్రవర్తన కలిగి ఉన్నట్లయితే హిస్టరీ షీట్లను తీసివేయడం జరుగుతుందన్నారు. అనంతరం ముని పల్లి గ్రామాన్ని సందర్శించిన జిల్లా ఎస్ పీ యువతతో మాట్లాడారు. యువత చెడు వ్యసనాలను అలవాటు చేసుకోవద్దని, విద్యావంతులు ఇతరులకు మార్గదర్శకంగా ఉండాలని సూచించారు. చదువు పూర్తయిన తర్వాత జాబ్ ట్రయల్స్ చేస్తూ, కలిసి చదువుకొని, ఉద్యోగం సాధించి ఆదర్శంగా ఉండాలని అన్నారు. గ్రామాలలో గ్రంధాలయాల ఏర్పాటుకు గ్రామ పెద్దలు సహకరించాలని సూచించారు. గంజాయి, నిషేదిత ఇతర మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా వుండాలని, గ్రామ రక్షణ, దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈ విలేజ్ సందర్శన లో ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ ఎ.సంజీవ రావ్, కొండాపూర్ సీఐ చంద్రయ్య, మునిపల్లి ఎస్ఐ లు పాల్గొన్నారు.

## మనిషికి మానసిక ఆరోగ్యం చాలా అవసరం

### సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీదేవి




**విశ్వంభర, సరూర్ నగర్:** మనిషికి మానసిక ఆరోగ్యం చాల అవసరం అని రంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి శ్రీదేవి అన్నారు. సరూర్ నగర్ లోని డిస్ట్రిక్ట్ డిసబులిటీ, రిహాబిలిటేషన్ సెంటర్ లో"ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం" సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేయడం జరిగినది. కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి గ ముఖ్య అతిథిది గా హాజరు అయ్యారు. మాట్లాడుతూ" మానసిక ఆరోగ్యం అనేది మన శారీరక ఆరోగ్యం కంటే కూడా ముఖ్యమైనది. శరీరం బలంగా ఉన్నప్పటికీ, మన మనస్సు ప్రశాంతంగా లేకపోతే మన జీవితం సంతోషకరంగా ఉండదు అని తెలిపారు.ఈ నేపథ్యంలో, ప్రతి సంవత్సరం అక్టోబర్ లో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యం మానసిక సమస్యలను అర్థం చేసుకోవడం, అవగాహన కల్పించడం , మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం. మానసిక ఆరోగ్యం అనేది కేవలం ఒక సమస్య కాదు, అది ప్రతి మనిషి జీవితంలో ఒక భాగం. మానసిక స్థిరత్వం, మన శాంతి, సంతోషం మరియు వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేసే అంశం. అయితే, చాలామందికి మానసిక ఆరోగ్యం పై సరైన అవగాహన ఉండదు. మానసిక ఆరోగ్య సమస్యలను సిగ్గుగా భావించడం, ఇతరులకు చెప్పకపోవడం వల్ల సమస్యలు మరింత తీవ్రమవుతాయి. కార్యక్రమం లో జిల్లా సంక్షేమ అధికారి సంధ్య రాణి, జిల్లా వైద్య అధికారి చంద్ర శేఖర్, సి డి పి ఓ రేణుక, డి డి ఆర్ సి నోడల్ ఆఫీసర్ రమేష్, భూక్య కాసిం, శ్యామల దేవి, రఘు, సుస్మిత, పిల్లలు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

## నిధులు మంజూరు చేయించినందుకు ధన్యవాదాలు



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం కొత్తగూడెం గ్రామం నుండి లక్ష్మాపురం గ్రామానికి రోడ్డు నిర్మాణానికి సీ.ఆర్.ఆర్ నిధుల నుండి కోటి రూపాయలు మంజూరు చేయించిన సందర్భంగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ను తాజా మాజీ సర్పంచ్ చిల్లర కైలాసం, శంబాల వెంకటేశంల నాయకత్వంలో కొత్తగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. తమ చిరకాల కోరిక అయిన రోడ్డుకు నిధులు మంజూరు చేసినందుకు గ్రామ ప్రజలు హర్షం వెలిబుచ్చారు.

## అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులకు ఆహ్వానం

**విశ్వంభర, ఆమనగల్లు:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆమనగల్లు లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఇంగ్లీషు బోధించుటకు అతిథి అధ్యాపకుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శర్వాణి పేర్కొన్నారు. అభ్యర్థులు కనీసం పీజీలో 55 శాతం మార్కులతో పీజీ డిగ్రీ కలిగి ఉండాలని, అదేవిధంగా పీహెచ్ డి. ఎన్ ఈ టీ. ఎస్ ఈ టీ. ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని వారు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 19 అక్టోబర్ 2024 శనివారం సాయంత్రం 4:00 గంటల లోపు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆమనగల్లులో తమ దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు.

## ఎస్.టీ.పీ.ప్లాంట్‌ను సందర్శించనున్న కేటీఆర్

**విశ్వంభర, ఎల్బీనగర్:** తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి వర్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు 19 అక్టోబర్ 2024 శనివారం ఉదయం 08.00 గంటలకు ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని నాగోల్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున హిల్స్ నందు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఎస్.టీ.పీ.ప్లాంట్ సందర్శించడం జరుగుతుందని ఎల్.బి.నగర్ నియోజకవర్గం బీఅర్ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తెలియజేశారు. కావున ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని మాజీ కార్పొరేటర్లు, ఉద్యమకారులు, సీనియర్ నాయకులు, పలు డివిజన్ల తాజా, మాజీ అధ్యక్షులు, అధ్యక్ష రాళ్ళు, పలు విభాగాల కమిటీ అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు, పలు విభాగాల తాజా మరియు మాజీ కమిటీ ధర్మకర్తలు, మహిళలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయ వంతం చేయాలని దేవిరెడ్డి సుధీర్‌రెడ్ మనవి చేశారు.

### నల్గొండ ప్రజలకు మేలు జరగాలంటే మూసీ ప్రక్షాళన తప్పనిసరి: గుత్తా

**విశ్వంభర, హైదరాబాద్:** నల్గొండ జిల్లా ప్రజలకు మేలు జరగాలంటే మూసీ ప్రక్షాళన తప్పనిసరి అని తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను అందరూ అభినందించాలని చెప్పారు. ప్రజలకు మంచి చేసే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం మూసీ ప్రక్షాళన చేపట్టిందని.. దీనిపై విమర్శలు సరి కాదన్నారు.

### ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో మాత్రమే

## సన్నధాన్యానికి బోనస్ ఇవ్వాలి

### ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**విశ్వంభర, మిర్యాలగూడ:** మిర్యాలగూడ మండలం అవంతిపురం మార్కెట్ యార్డ్‌లో జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) నూతన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా ఇప్పటికే అన్ని రకాల చర్యలు చేపట్టామని, ధాన్యం కొనుగోలు విషయంలో ఎవ్వరు కూడా అస్యత ప్రచారాలు నమ్మవద్దని, అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే నిబంధనలు ప్రకారం ధాన్యం తీసుకువచ్చి ప్రతీ రైతు మద్దతు ధర పొందవచ్చు అని అన్నారు. అలాగే సన్న ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తామని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం 17% మాయుచర్ ధాన్యానికి రూ. 2,320 ల ధర తో 500 రూపాయల బోనస్ కలిపి 2,830 రూపాయల ధర ఇవ్వడం జరుగుతుందని అన్నారు.కేవలం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో మాత్రమే సన్నధాన్యానికి బోనస్ లభిస్తుంది అని అన్నారు. రైస్ మిల్లులో విక్రయాలకు బోనస్ వర్తించదని, ప్రతిఒక్క రైతుకు తెలియజేస్తున్నామని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కోసం ప్రత్యేక కాల్ సెంటర్ ను ఏర్పాటు చేశామన్నారు. ధాన్యం కొనుగులు పై సీఎం, మంత్రులు నిత్యం సమీక్ష చేస్తున్నారని తెలిపారు. చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కోసం 156 కేంద్రాలను ఏర్పాటు చేశామని, అవసరం అనుకుంటే మరికొన్ని కేంద్రాలను ఏర్పాటు చేస్తాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్, కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఆర్ బ్రదర్స్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ప్రతి రైతుకు అండగా ఉంటాం

### ఛైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి



**విశ్వంభర, ఎల్బీనగర్:** మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ కూరగాయల మార్కెట్‌కి వచ్చే ప్రతి రైతుకు అండగా ఉంటాము అని గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎన్టీఆర్ నగర్ కూరగాయల మార్కెట్ ని పాలకవర్గంతో కలిసి మార్కెట్ మొత్తం తిరిగి రైతులు,వర్తకులు,హోల్ సేల్ వ్యాపారులు, వినియోగదారులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మార్కెట్ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం అధ్యక్షులు చిలుక నరసింహారెడ్డి యూనియన్ బిల్డింగ్‌లో సమావేశం ఏర్పాటు చేసిపాలకవర్గాన్ని ప్రత్యేకంగా సన్మానించారు. అనంతరం ఛైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు మాకు ముఖ్య ఉద్దేశమని వారికి గిట్టుబాటు ధర ఇచ్చేలా చూస్తామని,వారికి సౌకర్యాలు కల్పిస్తామని, వినియోగదారులకు ధరలు అందుబాటులో ఉండేలా చూస్తామని అన్నారు. మార్కెట్ ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుకోవాలని, దళారీ వ్యవస్థను అరికట్టేలా చూడాలని, రైతులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్ వైస్ ఛైర్మన్ బాస్కర చారి, మార్కెట్ డైరక్టర్లు జైపాల్ రెడ్డి,బండి మధుసూదన్ రావు,మచ్చేందర్ రెడ్డి, రఘు పతి రెడ్డి, నరసింహ, గణేష్ నాయక్, నరసింహ, గోవర్ధన్ రెడ్డి, అంజ య్య,వెంకట్ గుప్త,మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, ఎన్టీఆర్ నగర్ మార్కెట్ కార్యదర్శి ఎండీ..వహీద్ అధికారులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలి

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**విశ్వంభర, పటాన్‌చేరు:** ప్రతి పేదవాడికి సొంతింటి కలను సాకారం చేయాలన్న సమున్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు పథకం ప్రారంభించిందని, పూర్తి పారదర్శకంగా కమిటీలు, లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని సంభందిత శాఖ అధికారులకు పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆదేశించారు. గురువారం సాయంత్రం పటాన్ చేరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులతో ఇందిరమ్మ ఇళ్ల పథకం విధివిధానాలపై ఎమ్మెల్యే జీఎంఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన నిబంధనలకు అనుగుణంగా గ్రామసభ ఏర్పాటు చేసి గ్రామ కమిటీలు, వార్డ్ కమిటీలు ఏర్పాటు చేయడంతో పాటు అర్హులైన వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని సూచించారు. ఈ పథకం కింద ఇండ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు సొంతంగా ఖాళీ జాగా ఉంటే ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు సాయం అందించడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా నిరుపేదలకు జాగా లేకుంటే.. అధికారుల పరిశీలన తర్వాత వారికి ఖాళీస్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల ఎంపికలో ఎట్టి పరిస్థితుల్లోనూ అవకతవకలు జరగడానికి వీలు లేదని ఆదేశించారు. త్వరలోనే ప్రభుత్వం లాంఛనంగా పథకాన్ని ప్రారంభించనున్నదని తెలిపారు.

## పాత పోచంపల్లి రోడ్డును పునరుద్ధరణ చేయాలి

### శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**విశ్వంభర, ఎల్బీనగర్:** మన్సురాబాద్ డివిజన్ పరిధిలోని డంపింగ్ యార్డ్ వద్ద ఉన్న పాత పోచంపల్లి రోడ్డును పునరుద్ధరణ చేయాలి అని ఎల్.బి. నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి రాకేశ్ మోహన్ దొబ్రియల్ (ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణ అధికారి)హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ ను కోరారు. శుక్రవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పాత పోచంపల్లి రోడ్డు విషయంలో గతంలో మిమ్మల్ని కలిసి పలుసార్లు ప్రస్తావన చేయడం జరిగిందని తెలిపారు.దానిలో భాగంగా గతంలో ఆ ఫారెస్ట్ స్థలంలో రోడ్డు వేయడానికి ఎక్కువ స్థలం అటవీశాఖ వారికి ఉందని తెలియజేసిన నేపథ్యంలో ప్రస్తుతం అధికారులు చేసిన సర్వే ప్రకారం కేవలం 200 మీటర్ల కంటే తక్కువ స్థలం ఫారెస్ట్ వారి అధీనంలో ఉందని వారికి తెలిపారు.ఆ రోడ్డు విషయంలో తగు నిర్ణయాలు తీసుకోవాలని సుధీర్ రెడ్డి కోరారు.దానికి వారు మాట్లాడుతూ రోడ్డు విషయంలో 200 మీటర్ల ఫారెస్ట్ స్థలం గురించి తప్పకుండా పలువురు అధికారులచే చర్చించి తగు నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని హామీ ఇచ్చారు. మన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి,రవి ముదిరాజ్,అశోకప్ప పాల్గొన్నారు.

**ట్రంక్ లైన్ పనులు త్వరగా పూర్తి చెపిస్తా:** బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ తూర్పు (శివారు) కాలనీలలో ట్రంక్ లైన్ పనులు ప్రజలకు అసౌకర్యం కలగకుండా త్వరగా పూర్తి చేపిస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ సుధీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ తూర్పు (శివారు)సంక్షేమ సంఘాల అధ్యక్షులు, కార్యవర్గసభ్యులు, బి.ఆర్.ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేని కలిసి వివిధ కారణాల వలన పెండింగ్‌లో ఉన్న డ్రైనేజి ట్రంక్ లైన్ సమస్యని త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సుమన్ గౌడ్, యూత్ అధ్యక్షులు రాఘవేందర్ రావు, వివిద కాలనీల అధ్యక్షులు మనోజ్ కుమార్, కృష్ణ, శ్రీశైలం, రమేష్, రాజు గౌడ్, నర్సి రెడ్డి, లక్ష్మీపతి, యాదిరెడ్డి, రాం బాబు నాయక్, సూర్య నాయక్, శశి, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## బిల్డింగ్ మెటీరియల్ సప్లై సెంటర్ ప్రారంభం



**విశ్వంభర, బోడుప్పల్:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్ సాయి నగర్ కాలనీలో కేజీఎన్ 786 బిల్డింగ్ మెటీరియల్స్ సప్లై సెంటర్ నిర్వాహకులు ఎండి.అన్వర్ ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేటర్ కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త కిషోర్ గౌడ్, దానగల్ల యాదగిరి హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 13వ డివిజన్ అధ్యక్షులు గోపు రాములు, మైనార్టీ సెల్ సీనియర్ నేత ఎండి. అఫ్జల్, ఎండి.గఫర్,నాయకులు నానాజీ, వేణు,తదితరులు పాల్గొని ఎండి. అన్వర్కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వాహకులు అన్వర్ ముఖ్య అతిథులను శాలువాతో సన్మానించారు.

## సెంట్రల్ టెలికాం బోర్డ్ మెంబెర్‌గా బైండ్ల కుమార్

### నియామక పత్రాన్ని అందజేసిన ఎంపీ రఘునందన్ రావు



**విశ్వంభర, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా శుక్రవారం భాజపా జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్ ను కేంద్ర ప్రభుత్వం టెలికం బోర్డు మెంబర్ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ఈ నియమాక పత్రాన్ని మెదక్ పార్లమెంట్ సభ్యులు భారతీయ జనతా పార్టీ పార్లమెంటరీ బోర్డు కమిటీ మెంబర్ యం.రఘునందన్ రావు చేతుల మీదుగా బైండ్ల కుమార్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ పార్టీ కోసం ఎన్నో సంవత్సరాల నుండి నమ్మిన సిద్ధాంతం కోసం పార్టీ గెలుపు కోసం నిరంతరం పనిచేస్తున్న కార్యకర్తలను పార్టీ గుర్తించి సముచితమైన స్థానం కలిపిస్తుందని అన్నారు. అందుకుగాను బైండ్ల కుమార్ ను టెలికం బోర్డు మెంబర్‌గా నియమాకం చేసినందుకు సంతోషంగా ఉందని ఎంపీ రఘునందన్ రావు తెలిపారు.

## బి.జె.ఆర్ భవన్ ఆధునీకరణ పనులు త్వరితగతిన ప్రారంభించాలి: ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**విశ్వంభర, సరూర్ నగర్:** బాబు జగ్జీవన్ రామ్ భవనం ఆధునికరణ పనులు త్వరితగతిన చేపట్టాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని సరూర్నగర్ డివిజన్ కొత్తపేటలోని బాబు జగ్జీవన్ రామ్ భవనం ఆధునికరణకు అధికా రులతో సమీక్ష సమావేశంను ఎమ్మెల్యే నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని అధికారుల్ని ఆదేశించారు. ఏ ఎస్ డబ్లూ కన్వీనర్ లావణ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సబ్ జైలును సందర్శించిన డీఐజీ సంపత్ కుమార్



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ సబ్ జైలును తెలంగాణ జైళ్ల శాఖ డీఐజీ మాధారపు సంపత్ కుమార్ శుక్రవారం సందర్శించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా వచ్చిన డీఐజీ సంపత్ కుమార్ కు వరంగల్ జిల్లా సబ్ జైళ్ల అధికారి విజయ్ డేనీ పుష్ప గుచ్చంతో స్వాగతం పలికారు. గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జైలు అంతా కలియతిరిగారు. ఖైదీలకు అంది స్తున్న సౌకర్యాలు, జైల్లో అమలు చేస్తున్న పద్ధతుల విషయాలను సబ్ జైలు జైలర్ మల్లెల శ్రీని వాసరావు డీఐజీకి వివరించారు. జైల్లో పరిశుభ్రత, పచ్చటి వాతావరణం, ఖైదీల సంక్షేమం పట్ల డీఐజీ సంతృప్తి వ్యక్తం చేశారు. ఖైదీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబ్ జైలు అధికారులు డీఐజీ సంపత్ కుమార్‌కు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. వీరితోపాటు జైలు ఉన్నతాధికారులు పట్టేం భిక్షపతి, సిటిజన్ ఫోరమ్ సభ్యులు శంతన్, రామరాజు, సదా, నిరంజన్, సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ఎమ్మెల్యే వీరేశం



**విశ్వంభర, నార్కెట్‌పల్లి:** నార్కెట్ పల్లి మండలంలోని పలు గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మాత్రమే రైతులు ధాన్యాన్ని అమ్మాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వం అని రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని తెలియజేశారు. కార్యక్రమంలో నార్కెట్ పల్లి మండల తాసిల్దార్, ఇతర అధికారులు, మండల కాంగ్రెస్ నాయకులు పాశం శ్రీనివాస్ రెడ్డి, సట్టు సత్తయ్య,జర్రిపోతుల భరత్, దూదిమెట్ల వెంకన్న, స్రవంతి, పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలి



**విశ్వంభర, చిట్యాల:** విద్యార్థి దశలోనే బ్యాంకింగ్ లావాదేవీల పై, ఆర్థిక క్రమశిక్షణ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఏర్పరచు కోవాలని నల్గొండ జిల్లా ఎస్బిఐ ఫైనాన్షియల్ లిటరసీ కౌన్సిలర్ అడ్డు వెంకటయ్య అన్నారు. తాటికల్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమంలో వెంకటయ్య పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ రుణాలు, డిపాజిట్లు, ఆర్థిక క్రమశిక్షణ వల్ల ప్రజలు పొందే లాభాలు, ఆర్థిక సైబర్ నేరాలు తదితరు అం శాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రైవేటు వ్యక్తులు సంస్థల నుంచి రుణాలను తీసుకొని మోసపోవద్దని అన్నారు. సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి అతి చౌకైన ధరల్లో లభించే ఇన్సూరెన్స్ సౌకర్యం ఉపయోగించుకోవాలని సూచించారు. పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ప్రజ్ఞాపురం వెంకన్న, పండుగ తిరుమలయ్య,మోసంగి హరీష్ చంద్ర, మార్త రాములు, డాక్టర్ సాగర్ల సత్తయ్య, లొట్లపల్లి కోటయ్య పద్మ తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే సబిత



**విశ్వంభర, మహేశ్వరం:** కల్వకోల్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పులి మామిడి పర్వతాలు గౌడ్ నూతన గృహప్రవేశానికి ముఖ్యాతిగా మాజీ మంత్రి మహేశ్వరం శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి హాజరై పర్వతాలు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. సబితా ఇంద్రారెడ్డితో పాటు కల్వకోల్ మాజీ సర్పంచ్ తామస్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ చంద్రయ్య, బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు డి. శ్రీనివాస్, పీ.ఏ.సీ.ఎస్ డైరెక్టర్ కాడమోని ప్రభాకర్, నర్సింగ్, భాస్కర్ రెడ్డి, దేవరం గౌడ్, రామకృష్ణ గౌడ్, మచెందర్, రఘుపతి పాల్గొన్నారు. 35

# కబ్జాల వెనుక మేయర్ హస్తం

## బీజేపీ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి ఆరోపణ




**విశ్వంభర, మహేశ్వరం:** నియోజకవర్గం బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ లో పార్కులు, ఓపెన్ స్థలాలు కబ్జా జరుగుతున్నా బడంగ్ పేట మున్సిపల్ మేయర్ పట్టించుకోవడంలేదని బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకటరెడ్డి అన్నారు. మేయర్ గెలిచి నాలుగు సంవత్సరాల దాటింది అయినా ఆ ప్రాంతాలలో 733, 747, 749, 743 సర్వే నెంబర్లు కబ్జా జరిగిన టీపీఓ అధికారులు పట్టించుకోవడంలేదని ఏకంగా మున్సిపల్ శాఖ అవినీతి మయంగా మారిందని ఆయన అన్నారు. జూలై 10న టీపీఓ సెక్షన్లో 23 భాగాలు విభజించే అక్రమాలు అనుమతులు ఇచ్చారని 11 ఆగస్టు 2023లో చంపాపేట రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ఒకే రోజు 23 ఫ్లాట్లు రిజిస్ట్రేషన్ చేశారని, తిరిగి నాలుగు ఫ్లాట్లను రీసెల్ చేసి మళ్లీ రిజిస్ట్రేషన్ చేశారని వెంకటరెడ్డి అన్నారు. ఇదంతా జరుగుతుందని స్వయంగా మేయర్ కు కమిషనర్ కు లిఖితపూర్వకంగా ఆధారాలతో సహా ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఫిర్యాదు చేసి రెండు నెలలు గడుస్తున్నా ఎలాంటి విచారణ చర్యలు లేకుండా కాలయాపన చేస్తూ మరో నాలుగు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఇది ఇలా జరుగుతుండగా బాలాపూర్ లో 75/1 సర్వేనెంబర్ 2200 గజాలు ఆక్రమణ జరిగిందని ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని ఆరోపించారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎక్కడ చూసినా కబ్జాలే జరుగుతున్నాయని అయినా మేయర్ ఎందుకు స్పందించడం లేదని వెంకటారెడ్డి ప్రశ్నించారు. ఈ కబ్జాల వెనుక మేయర్ హస్తం ఏమైనా ఉందా అని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఇన్ని కబ్జాలు జరుగుతున్న మేయర్ రహస్తం లేకపోతే ఎందుకు విచారణ జరిపించడం లేదని వెంకటారెడ్డి ప్రశ్నించారు. పార్కులు ఓపెన్ స్థలాల అబ్జా చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు పోరాటం చేస్తామని వెంకటారెడ్డి హెచ్చరించారు. అవసరమైతే ఎంత దూరమైనా వెళ్తామని ఇప్పటికైనా మేయర్ స్పందించాలని లేకపోతే మేర హస్తం ఉందని అనుకోవాల్సిన పరిస్థితి వస్తుందని ఆయనఅన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టపాసుల విక్రయదారులతో డీసీపీ సమావేశం



**విశ్వంభర,హైదరాబాద్:** టపాసుల విక్రయదారుల తో దక్షిణ మండల డీసీపీ స్నేహ మెహ్రా సమీక్ష సమావేశం నిర్వహించారు. దీపావళి పండుగ పురస్కరించుకొని హైదరాబాద్ పాతబస్తీ దక్షిణ మండలం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉప్పుగూడ ధనరాజ్ ఫంక్షన్ హాల్ నందు డీసీపీ స్నేహ మెహ్రా ఆధ్వర్యంలో ఈ సమీక్ష సమావేశం జరిగింది. సమావేశంలో టపాసుల నిర్వాహకులకు డీసీపీ స్నేహ మెహ్రా సలహాలు సూచనలు తెలియజేశారు. అడిషనల్ డీసీపీ షేక్ జహంగీర్, ఏసీపీలు, సీఐలు, డీఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

# హమాలీల బ్రతుకులు మార్చాలి



**విశ్వంభర, మహేశ్వరం:** హమాలీల బ్రతుకులు మారాలి అంటే ఏఐటీయూసీ జండా పట్టుకుని సమస్యల పరిష్కారం కోసం పోరాడాలి అని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బి.దత్తు నాయక్ అన్నారు. గురువారం మహేశ్వరం మండలం కేంద్రంలోని సివిల్ సప్లై గోదాము హమాలీ కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకుని అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడుతూ మూటలు మోసే కార్మికులకు ప్రమాదాలు జరిగితే ఆదుకోవడానికి హెల్త్ కార్డులు ఇవ్వకపోవడం, ఈఎస్ఐ సౌకర్యం కల్పించకపోవడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధాప్యంలో ఆదుకునే పెన్షన్ సౌకర్యం లేకపోవడం వయసులో ఉన్నంతకాలం పనిచేసే హమాలి కార్మికులు రిటైర్మెంట్ అయిన తర్వాత వీరి బ్రతుకులు అగమ్యగోచరంగా మారే పరిస్థితిలో ఉన్నందున తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం హమాలీ కార్మికులందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అక్టోబర్ 20 ఆదివారం రాజేంద్రనగర్లో జరిగే హమాలీ మీటింగ్కు అంద రూ తరలి రావాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రమేష్, జంగయ్య మల్లేష్, రవి శ్రీరాములు, కృష్ణ, శివ, మల్లేష్ హమాలి కార్మికులు పాల్గొన్నారు.

## డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ని సందర్శించిన 'భూల్ భూలయ్యా 3' చిత్ర బృందం




**విశ్వంభర, కుత్బుల్లాపూర్ మైసమ్మగూడ :** ప్రముఖ సినీతార కార్తీక్ ఆర్యన్ నటించిన చిత్రం భూల్ భూలయ్యా 3 ప్రమోషన్ లలో భాగంగా శుక్రవారం డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ని సందర్శించారు. ఈ నేపథ్యంలో స్కూల్ క్యాంపస్లో సినిమా తారలతో ప్రత్యేక ఇంటరాక్టివ్ సెషన్లను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్, ఎడీఫై వరల్డ్ స్కూల్ డైరెక్టర్ ఏ.కే. అగర్వాల్, యాజమాన్యం, పాఠశాల సిబ్బంది, విద్యార్థులతో కలిసి కార్తీక్ ఆర్యన్ (రూహ్ బాబా క్యారెక్టర్)కు స్వాగతం పలికారు. డైరెక్టర్ ఏకే అగర్వాల్ మాట్లాడుతూ విద్యార్థులతో డాన్స్ చేయడం, కార్తిక్ ఆర్యన్, విద్యాబాలన్‌లు కలిసి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. డైరెక్టర్లు శ్రీ సంజయ్ అగర్వాల్, గర్వ్ అగర్వాల్ ఏట్రియం ఆర్ట్ గ్యాలరీలో సందర్శనకు అతిథులను ఆహ్వానించారు. ఇందులో భాగంగా అతిథులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చేసిన శాస్త్రీయ, పాశ్చాత్య నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్తీక్ ఆర్యన్ కొత్త సినిమా 'భూల్ భూలయ్యా 3' ప్రత్యేక ప్లాంటేషన్ డ్రైవ్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఫ్లాష్ మాబ్‌లో మా విద్యార్థులు పాల్గొనడం చాలా గర్వంగా ఉందని ఏ.కే. అగర్వాల్ అన్నారు.. సెషన్స్‌లో భాగంగా పోస్టర్‌లను విడుదల చేసి, విద్యార్థులకు టీ-షర్టులపై సంతకాలు చేసి చిత్ర బృందం సందడి చేసింది.కార్యక్రమం ముగింపు సందర్భంగా డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో అతిథులకు కృతజ్ఞతలు తెలుపుతూ జ్ఞాపికలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు యాజమాన్యం తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రజలు మాతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి



**విశ్వంభర, చింతపల్లి:** స్థానిక సమస్యల పరిష్కారంతో పాటు మాతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం చింతపల్లి మండలం కుర్మపల్లి గ్రామంలో గ్రామశాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం ప్రజలను మతం పేరుతో రెచ్చగొడుతూ పేదల దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇండియా బ్లాక్ పేరిట ప్రతిపక్షాలు గత ఎన్నికల్లో కొంత మేరకు బీజేపీ ప్రభావాన్ని తగ్గించాయని తెలిపారు. బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాదం తగ్గించే దిశగా గ్రామాలలో ప్రజలను చైతన్యం చేస్తూ పోరాటాలు నిర్వహించాలన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయకుండా సర్వేలు ప్రజాభిప్రాయం పేరిట కాలయాపన చేస్తుందన్నారు. రైతు భరోసా నిధులను మంజూరు చేయలేదన్నారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాటాలలో ముందు ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మహాసభ అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. కుర్మపల్లి గ్రామ నూతన కార్యదర్శిగా పోలేజి బ్రహ్మచారి, సహాయ కార్యదర్శిగా చలిచీమల కోటేష్, సాయి, కార్యదర్శిగా దండేకర్ ఈశ్వర్‌ని ఎన్నుకోవడం జరిగింది. మండల కార్యదర్శి వుడుగుండ్ల రాములు, మండల కమిటీ సభ్యులు వెంకటయ్య, అమృతాచారి, శ్రీకాంత్, మురళి, వెంకటయ్య, రాజు, విఠల్, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

## రామన్నపేట న్యాయమూర్తులకు సన్మానం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని న్యాయస్థానంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జీలుగా పనిచేస్తున్న ఏ. ప్రదీప్, ఎస్.చందన లు సీనియర్ సివిల్ జడ్జీలుగా ప్రమోషన్ పొందిన సందర్భంగా న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఘన సన్మానించారు. అనంతరం ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి ఏ.ప్రదీప్, అడిషనల్ జూనియర్ జడ్జి చందనలు, మాట్లాడుతూ మాకు ఎంతగానో సహకరించిన అడ్వకేట్స్, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. కృషి ఉంటే ఎంతటి సమస్యనైనా సాధించవచ్చు, పనిని దైవంగా భావించి పట్టుదలతో కృషి చేయడం ద్వారా ఫలితాన్ని సాధించవచ్చని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండి మజీద్, సీనియర్ న్యాయవాదులు యాపాల కృష్ణారెడ్డి, కే.యాదగిరి, అశోక్ కుమార్, నరేంద్ర రావు, బార్ అసోసియేషన్ సభ్యులు గాలి లింగయ్య, సత్తయ్య, మామిడి వెంకట్ రెడ్డి, శ్రవణ్ కుమార్, న్యాయవాదులు జినుకల ప్రభాకర్, శోభన్ బాబు, అశోక్ కుమార్, పాల్వంచ జగతయ్య, డేవిడ్, నకిరేకంటి మొగులయ్య, కొండూరు బాలరాజు, ఎస్.బాలరాజు, శ్రీశైలం, దినేష్, స్వామి, రమేష్, అజీజ్, రెండు కోర్టుల సూపరిండెంట్లు నారగోని గంగాభవాని, బాలగోని శివరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల కమిటీలో భాగస్వామ్యం కల్పించాలి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** భారత కమ్యూనిస్టు పార్టీ ఆత్మకూరు (ఎం) మండల సమితి సమావేశం ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మహ్మద్ నయీమ్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు, వీటితో పాటు ఆరు గ్యారంటీలు అమలు చేయాలని, ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీలలో సీపీఐ నాయకుల భాగస్వామ్యం ఉండాలని ప్రభుత్వ విప్ ఆలేరు నియోజకవర్గం శాసనసభ్యులు బీర్ల ఐలయ్యని కోరారు. మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గ్రామశాఖ సమావేశాలు నిర్వహించాలని, పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాల సందర్భంగా ప్రతి గ్రామంలో జండా ఆవిష్కరణ కార్యక్రమం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి బత్తిని నరేష్, మండల కార్యవర్గ సభ్యులు బొబ్బల లాల్ రెడ్డి, కల్వల నరసయ్య, మారుపాక అంజయ్య, గాజుల సిద్ధులు, సీపీఐ మండల నాయకులు సుల్తాన్ పురుషోత్తం, యాస బుచ్చిరెడ్డి, సోమనబోయిన నరసింహ, మారు పాక యాదయ్య, కొమ్ము కిష్టయ్య , దంతూరి ఎల్లయ్య పాల్గొన్నారు.

## నిరుపేదలకు సేవలు అందించడమే లయన్స్ క్లబ్ లక్ష్యం

### లయన్ డా. జి మహేందర్ కుమార్ రెడ్డి



**విశ్వంభర, ఆమనగల్లు:** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ వారి ఆధ్వర్యంలో కడ్తాల్ బస్టాండ్ ఆవరణలో కీర్తిశేషులు జంబుల రంగనాయకమ్మ తొమ్మిదో వర్ధంతి సందర్భంగా లయన్స్ క్లబ్ మల్టీపుల్ జిల్లా ఎల్సీఐఎఫ్ కోఆర్డినేటర్ జి చెన్న కిషన్ రెడ్డి సౌజన్యంతో ఏర్పాటు చేసిన మీల్స్ ఆన్ వీల్స్ అన్నదాన శిబిరాన్ని క్లబ్ అధ్యక్షులు లయన్ పసుల లక్ష్మారెడ్డి తో కలిసి జిల్లా వైస్ గవర్నర్ డా. జి మహేందర్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ, ఆకలితో అలమటిస్తున్న వారి ఆకలి తీర్చడమే లయన్స్ క్లబ్ లక్ష్యమని అన్నారు. జిల్లాలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా అన్నదాన శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. నిరుపేదలకు సేవలు అందించాలనే ఉద్దేశంతో లయన్స్ క్లబ్ ఆమనగల్ గ్రామీణ ప్రాంత క్లబ్ లకు ఆదర్శమని ఆయన అన్నారు. లయన్స్ క్లబ్ ఆమనగల్లు జిల్లా స్థాయిలోనే కాక అంతర్జాతీయ స్థాయిలో అగ్రగామిగా ఉందని ఆయన పేర్కొన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టే ఉచిత కంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. క్లబ్ చేసే సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న క్లబ్ సభ్యులకు అభినందనలు తెలిపారు. 450 మందికి అన్నదానం ఏర్పాటు చేసినట్లు క్లబ్ పీ ఆర్ ఓ పాషా తెలిపారు. క్లబ్ కార్యదర్శి దోనాదుల మహేష్, జిల్లా కోఆర్డినేటర్ కె. రామ్ రెడ్డి, జిల్లా చైర్మన్ జూలూరి రమేష్, సభ్యులు వేణు పంతులు, దూదే రాజేందర్, అంజయ్య, గంప శ్రీను, పిప్పళ్ళ వెంకటేష్, గోవర్ధన్ రెడ్డి, కుమార్, లక్ష్మయ్య, పీఆర్ఓ పాషా పాల్గొన్నారు.

## రూ.ఐదు వేలు ఆర్థిక సహాయం అందించిన ఉపాధ్యాయులు



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** డీఎస్సీ-2024 ఉపాధ్యాయుల భర్తీకి ముందు మండల పరిషత్ ప్రామికోన్నత పాఠశాల మోరిపిరాలలో ఉపాధ్యాయుల కొరత ఉన్న కారణంగా తల్లిదండ్రులు, గ్రామస్తుల తీర్మానంతో విద్యా వాలంటీర్లను నియమించారు. విద్యా వాలంటీర్లకు వేతనాల నిమిత్తం మోరిపిరాల పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన వేనేపల్లి సుజాత, జూకంటి కరుణాకర్ ఐదు వేల రూపాయలను విరాళంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ముద్దసాని జయమ్మకి అందజేశారు. ఈ కార్యక్రమంలో కొణతం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం




**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా దామ్య తండలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ షెఫర్డ్ చైర్మన్ రొయ్యూరు సురేష్ ప్రారంభించారు. మానుకోట జిల్లా కురవి మండలం దామ్య తండా గ్రామపంచాయతీలో ఆరు తండాలకు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ షెఫర్డ్ చైర్మన్ రొయ్యూరు సురేష్, సీపీఐ మండల నాయకులు బానోత్ లింగా నాయక్ ఆధ్వర్యంలో శ్రీ సత్య లయన్స్ చారిటబుల్ కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష కేంద్రాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోయ్యురు సురేష్ మాట్లాడుతూ గిరిజన తండాలలో ఉచిత మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకొని శ్రీ సత్య చారిటబుల్ కంటి హాస్పిటల్ ఉచితంగా క్యాట్ రాక్ ఆపరేషన్లు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ పీఆర్ఓ భూక్య మోహన్ నాయక్, ఆశ, గ్రామపంచాయతీ సిబ్బంది, తండా ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.

## ప్రజా పాలన కాకుండా రౌడీ పాలన జరుగుతోంది

### మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య



**విశ్వంభర, నల్గొండ:** నకిరేకల్ నియోజకవర్గంలో ప్రజా పాలన కాకుండా రౌడీ పాలన జరుగుతుందని మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్ నియోజకవర్గం లోని 6 మండలాలలో రోజు ఏదో ఒక మండలంలో బి.ఆర్.ఎస్. పార్టీ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని చిరుమర్తి పేర్కొన్నారు. కేతేపల్లి మండలంలోని చెరుకుపల్లి గ్రామంలో ఎన్నికలు జరిగి ఫలితాలు రాగానే పోకల సైదులుని నువ్వు బీఆర్ఎస్ కార్యకర్తవు అని కర్రలతో దాడి చేసి చెట్టుకు కట్టేసి మరి కొట్టడం జరిగిందని అన్నారు. ఈ విషయంపై కేతపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా తిరిగి అతనిపైనే ఎస్సై కేసు పెట్టడం జరిగిందని, దాడి చేసిన వాళ్లే దెబ్బలు తిన్నవాళ్లపై కేసు నమోదు చేయడం జరిగిందని అన్నారు. కేతపల్లి పట్టణంలో దసరా పండుగ రోజు ముగ్గురు వ్యక్తులు ఇంటి ముందు కూర్చొని ఉండగా 14 మంది కాంగ్రెస్ కార్యకర్తలు కావాలని వాళ్లపై రాడ్లు, కర్రలతో దాడి చేసి తలలు పగులగొట్టడం జరిగిందని చిరుమర్తి లింగయ్య తెలిపారు. ఈ విషయంపై ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్ౕం వెళ్లగా దెబ్బలు తిన్న వ్యక్తులపైనే కేసులు పెడతానని బెదిరించడం జరుగుతుందని అన్నారు. నకిరేకల్ మండలం మంగళపల్లి గ్రామంలో ప్రైవేట్ స్థలంలో 15 సంవత్సరాల క్రితం బి.ఆర్.ఎస్. పార్టీ కార్యాలయాన్ని వారి సొంత స్థలంలో నిర్మాణం చేసుకుంటే ఆ స్థలం ప్రభుత్వ స్థలంలో ఉందని రాత్రికి రాత్రే పార్టీ కార్యాలయాన్ని కూల్చివేసి అదే చోట కావాలని బొడ్రాయిని పెట్టడం జరిగిందని తెలిపారు. పోలీస్ యంత్రాంగం ఉన్నది అన్యాయం జరిగిన వాడికి న్యాయం చేయడానికి అంతేకానీ డబ్బుల కోసం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను స్టేషన్లో కొట్టి వారి దగ్గర డబ్బులు వసూలు చేసి కాంగ్రెస్ వాళ్లను ఇంటికి పంపడం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే కనుక ఇక ముందు జరుగుతే జిల్లా ఎస్పీ ఆఫీస్ ముందు బి.ఆర్.ఎస్. పార్టీ రాష్ట్ర నాయకత్వంతో ధర్నా నిర్వహించడం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హెచ్చరించారు. జిల్లా ఎస్పీ నకిరేకల్ నియోజకవర్గంలోని పరిసర ఆరు మండలాలలోని పోలీస్ స్టేషన్లో కేసులు ఏ విధంగా జరుగుతున్నాయో పరిశీలించవలసిందిగా ఆయన కోరారు. ఇక పైనుండి నకిరేకల్ నియోజకవర్గంలో బి.ఆర్.ఎస్. పార్టీ కార్యకర్తలపై దాడులు చేయడం జరిగితే దానికి తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని చిరుమర్తి హెచ్చరించారు.

## మాస్టర్ ప్లాన్‌తో మరింత పకడ్బందీగా చర్యలు

### మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల



**విశ్వంభర, వికారాబాద్:** డ్రోన్ కెమెరాల సహాయంతో చేయబోయే మాస్టర్ ప్లాన్ డిజిటల్ సర్వే భవిష్యత్తులో వికారాబాద్ మున్సిపల్ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని, సమస్యలు లేని మున్సిపాలిటీగా తీర్చిదిద్దడంలో ముఖ్య భూమిక పోషిస్తుందని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ అన్నారు. ఈరోజు చైర్ పర్సన్ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ హాల్లో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు, కో ఆప్షన్స్ సభ్యులు, మున్సిపల్ సిబ్బందికి మాస్టర్ ప్లాన్ డిజిటల్ సర్వేపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డిజిటల్ సర్వేకు కౌన్సిలర్లు, కో ఆప్షన్స్ సభ్యులు ప్రతి ఒక్కరు సహకరించాలని, మీ సహకారమే భవిష్యత్ తరాలకు మంచి భవిష్యత్తును ఇస్తుందని అన్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అమృత్ 2.0 కింద వికారాబాద్ మున్సిపాలిటీలో మొట్టమొదటిసారి డ్రోన్ కెమెరాల సహాయంతో డిజిటల్ సర్వే చేసి మాస్టర్ ప్లాన్ రూపొందించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ మాస్టర్ ప్లాన్‌తో వికారాబాద్ మున్సిపల్‌లో ఎక్కడ ఏమేమి ఉన్నాయో మొత్తం డిజిటలైజ్ చేయడమే కాకుండా, భవిష్యత్తు తరాలకు ఎలాంటి సమస్యలు లేని మాస్టర్ ప్లాన్ అందించడం జరుగుతుందని అన్నారు. నా ఆధ్వర్యంలో ఇంత మంచి కార్యక్రమం జరగడం చాల సంతోషంగా ఉందని అన్నారు. మీ మీ వార్డులలో సర్వే చేయడానికి వచ్చిన డీటీసీపీ అధికారులకు మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కో ఆప్షన్స్ సభ్యులు, ఇన్చార్జి కమిషనర్ రాకేష్ రెడ్డి, డీటీసీపీ అధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భూనిర్వాసితులకు నష్టపరిహారం నిధుల విడుదల పట్ల హర్షం




**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం) మండలం బునాది కాలువ పెండింగ్ పనులు నిర్మాణం కొరకు, అడ్డగూడూరు మండల భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించుట కొరకు రూ. 266.65 కోట్ల ప్రభుత్వం విడుదల చేయడం పట్ల సీపీఐ హర్షం వ్యక్తం చేసింది. శుక్రవారం మండల కేంద్రంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాల అధ్యక్షతన జరిగిన ఆత్మకూరు, మోత్కూర్, అడ్డగూ డూరు, మోటకొండూర్, వలిగొండ మండల కార్యదర్శిల సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రాంతం లో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో కాలువల నిర్మాణం కోసం అనేక ఉద్యమాలు, పోరాటాలను, పాదయాత్రలు నిర్వహించినా గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్, నీటి పారుదల శాఖమంత్రి, ముఖ్యమంత్రికి సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడంతో నిర్మాణం పనులు పూర్తి కావడానికి నిధులు మంజూరు చేశారని హర్షం వ్యక్తం చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు చేడే చంద్రయ్య, ఉప్పల ముత్యాలు, కుసుమని హరిచంద్ర, బోడ సుదర్శన్, మండల కార్యదర్శులు మారుపాక వెంకటేశం, అన్నెపు వెంకట్, రైతు సంఘం నాయకులు యాస బుచ్చిరెడ్డి, బొబ్బల లాల్ రెడ్డి పాల్గొన్నారు.

## నగేష్ ట్రేడర్స్ ను ప్రారంభించిన సీఐ వెంకటేశ్వర్లు

**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో కల్లూరి సైదమ్మ నగేష్‌కు చెందిన నగేష్ ట్రేడర్స్ షాపును రామన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అతిథులుగా రామన్నపేట పట్టణ మాజీ ఎంపీటీసీ మహమ్మద్ రెహమాన్, మాజీ వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, మాజీ సర్పంచ్ జల్లెల పెంటయ్య, పట్టణ మాజీ సర్పంచ్ మధు బాబు, వర్తక వ్యాపారుల సంఘం అధ్యక్షులు వెంకటేశ్వరాచారి, వర్తక వ్యాపారుల సంఘం నాయకులు వనం బిక్షం, ఎలక్ట్రిషన్ యూనియన్ అధ్యక్షులు ఎ.శ్రీనివాస్, సీపీఎం నాయకులు బొడ్డుపల్లి వెంకటేశం, జనపాల లక్ష్మణ్, గట్టు ఉపేందర్, శ్రీధర్ పాల్గొన్నారు.

## గుర్రాలతో తొక్కించిన నీచ సంస్కృతి

# నీ కాంగ్రెస్.. టీడీపీలది..

## మండిపడ్డ మాజీ మంత్రి హరీశ్‌రావు



**విశ్వంభర, హైదరాబాద్ :** గతంలో ఇదే తెలంగాణ గడ్డపై గుర్రాలతో తొక్కించిన నీచ సంస్కృతి నీ కాంగ్రెస్ పార్టీది.. టీడీపీలది అని సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మండి పడ్డారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఓట్లేసిన పాపానికి మీరు వాళ్లను ముంచిండ్రు.. గుర్రాలతో తొక్కించిండ్రు.. అని రేవంత్ రెడ్డి మాట్లాడడం సరికాదన్నారు హరీశ్‌రావు. రేవంత్ రెడ్డి.. గుర్రాలతో తొక్కించిన సంస్కృతి నీ కాంగ్రెస్ పార్టీది, నువ్వు గతంలో ఉన్న తెలుగు దేశం పార్టీకి ఉంది తప్ప మాకు లేదు. ఆశా వర్కర్లను, అంగన్‌వాడీలను అసెంబ్లీ ముందు గుర్రాలతో తొక్కించి, వాటర్ క్యాన్లతో కొట్టించిన చరిత్ర నీ కాంగ్రెస్ పార్టీది. పెంచిన కరెంట్ బిల్లులను తగ్గించమని చెప్పితే గుర్రాలతో తొక్కించిన ఘనత గతంలో నువ్వున్న టీడీపీ పార్టీది. గుర్రాలతో తొక్కించే సంస్కృతి మాకు లేనే లేదని హరీశ్‌రావు తేల్చిచెప్పారు. శత్రుదేశాల మీద దాడికి పోయినట్టు.. రేవంత్ రెడ్డి పేదల ఇంటిమీద దాడి చేస్తున్నాడు. నిర్మాణాత్మకమైన పనితో పని ప్రారంభం కావాలి.. కానీ విధ్వంసంతో నువ్వు పని ప్రారంభం చేస్తున్నావు అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. మీకు దమ్మంటే మేము మల్లన్న సాగర్ నిర్వాసితులకు ఇచ్చిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి. ఆక్రమణలు చేస్తున్నది పేద ప్రజలు కాదు, నువ్వే అక్రమంగా పేదల భూములు ఆక్రమణలు చేస్తున్నావ్. ఫోర్త్ సిటీ ఎక్కడ పెడుతున్నావ్. రియల్ ఎస్టేట్ చేస్తున్నావ్. ఎందుకు బ్లఫ్ చేస్తున్నావ్. నల్లగొండ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నావ్. రాజకీయాలు చేస్తున్నావ్. నీకు చిత్తశుద్ధి ఉంటే నీకు నల్లగొండ ప్రజల మీద నిజంగా ప్రేమ ఉంటే పారిశ్రామిక వ్యర్థాలు చెరువుల ద్వారా మూసీలో చేరకుండా తీసుకోవాల్సిన చర్యలు ప్రారంభించు. మూసీ పునరుజ్జీవనానికి మేం వ్యతిరేకం కాదు. నీ బుల్డోజర్ విధానాలకు, మీ రియల్ ఎస్టేట్ దందాలకు మేం వ్యతిరేకం. నువ్వు ఎంత వెకిలి దాడి చేసినా సరే బాధితులైన ప్రజల పక్షాన నిలబడుతం. నీ దుర్మార్గ విధానాలను ప్రతిఘటిస్తం అని హరీశ్‌రావు హెచ్చరించారు.

## అశోక్ నగర్ ఏమైనా టెర్రరిస్ట్ హబ్బా?

# లేదా మన శత్రు దేశమా?

### కాంగ్రెస్ సర్కార్‌పై ఏనుగుల రాకేశ్ రెడ్డి ధ్వజం



**విశ్వంభర, అశోక్‌నగర్:** అశోక్‌నగర్ ఏమైనా టెర్రరిస్ట్ హబ్బా? లేక అదేమైనా శుత్రు దేశమా? అని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అశోక్‌నగర్‌లో ఉన్న లైబ్రరీలో చదువుకుంటున్న గ్రూప్-1 అభ్యర్థులను లైబ్రరీ లోపల ఉన్న స్టడీ హాల్స్ లో చొరబడి లాఠీచార్జి ఎందుకు చేస్తున్నారు? అని నిలదీశారు. పరీక్షలు నిర్వహించరాకపోతే.. మాకు చేతకాదు అని చెప్పండి కానీ నిరుద్యోగులను ఎందుకు చితకబాదుతారని ప్రశ్నించారు.గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను రీషెడ్యూల్ చేయాలని ఆందోళనకు దిగిన అభ్యర్థులపై కాంగ్రెస్ ప్రభుత్వం వ్యహరించిన తీరుపై ఏనుగుల రాకేశ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎంఆర్ఓలు, ఆర్‌డిఓలు, డిప్యూటీ కలెక్టర్ లు, డీఎస్పీ లు కావాల్సిన వాళ్ళ పైనా మీ ప్రతాపం? అని ధ్వజమెత్తారు. సమైక్య పాలనలో.. సమైక్యవాదులు కూడా ఇంత దుర్మార్గంగా వ్యవహరించలేదని మండిపడ్డారు. వెంటనే గ్రూప్స్ అభ్యర్థుల సమస్యను పరిషరించాలని, ఆ తర్వాతే పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై అక్రమంగా దాడి చేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు.

## ఇల్లెందులో జర్నలిస్టుపై దాడి.. పరిస్థితి విషమం



**విశ్వంభర, కొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దారుణం జరిగింది. ఇల్లెందు మండలం జగదాంబ గుంపు సమీపంలో జర్నలిస్టు నిట్టా సుదర్శన్(ఆదాబ్ రిపోర్టర్)పై గురువారం రాత్రి కొంతమంది దుండగులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. రాత్రి సమయంలో కాపుకాసి మారణాయుధాలతో తీవ్రంగా దాడి చేశారు.దాడి గురించి సమాచారం అందగానే పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. రక్తపు మడుగులో పడి ఉన్న సుదర్శన్‌ను సీఐ బత్తుల సత్యనారాయణ ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. తనపై వంశీ, ప్రేమ్ మరికొందరు దాడి చేసినట్లు నిట్ట సుదర్శన్ పోలీసులకు తెలిపినట్లు సమాచారం.కాగా, ఇల్లెందుకు చెందిన పలువురు రౌడీ షీటర్లు, నాయకులతో తనకు ప్రాణహాని ఉందని నిట్ట సుదర్శన్ పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

## అశోక్‌నగర్‌లో మరోసారి గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళన



**విశ్వంభర, హైదరాబాద్:** గ్రూప్-1 పరీక్ష రీ షెడ్యూల్ చేయాలని కోరుతూ అశోక్‌నగర్‌లో అభ్యర్థులు మరోసారి ఆందోళనకు దిగారు. ప్లకార్డులతో రోడ్లపైకి వచ్చిన 16 మందిని పోలీసులు అరెస్టు చేసి బేగంబజార్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆందోళనకారులను అదుపులోకి తీసుకునే క్రమంలో పోలీసులు లాఠీ ఛార్జి చేయడంతో పలువురికి గాయాలయ్యాయి. జీవో 29 రద్దు చేసేంత వరకు తమ పోరాటం ఆగదని అభ్యర్థులు తేల్చిచెప్పారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో అశోక్ నగర్ దద్దరిల్లిపోతోంది.గ్రూప్ -1 అభ్యర్థులను అరెస్టు చేసి వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. ఇందిరా పార్కు నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వరకు అడుగడుగునా పోలీసులు భారీ మోహరించారు.

## ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా గందె సురేష్

**విశ్వంభర, షాద్ నగర్:** రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా షాద్ నగర్ పట్టణానికి చెందిన గందె సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా ఆర్య వైశ్య సంఘం ఎన్నికలు రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ నేపథ్యంలో షాద్ నగర్ నుండి పలువురు జిల్లా అధ్యక్ష పదవికి పోటీ చేశారు. ఆర్యవైశ్య సంఘం సీనియర్ నాయకులు, జర్నలిస్ట్ సరాపు రమేష్ కుమార్, అగీరు రవికుమార్ గుప్త, గందె సురేష్, రిటైర్డ్ తహసిల్దార్ సరావు జగదీశ్వర్, తదితరులు నామినేషన్ వేశారు. వీరందరు షాద్ నగర్ ప్రాంతానికి చెందినవారు. అయితే ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కార్యవర్గం తదితర పెద్దలు కొంతమంది నామినేషన్లను స్వచ్ఛందంగా ఉపసంహరించుకునేలా చేశారు. ఎన్నికను ఏకగ్రీవం చేసి గందె సురేష్ ను అధ్యక్షుడిగా ప్రకటించారు. గతంలో షాద్ నగర్ వాసవి క్లబ్ చార్టర్ ప్రసిడెంట్, ప్రస్తుతం ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యదర్శిగా గందె సురేష్ కొనసాగుతున్నారు. తాజాగా అధ్యక్షుడిగా ఎన్నికున్నారు.



## టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన పట్టణ కో కన్వీనర్



**విశ్వంభర, షాద్ నగర్:** షాద్ నగర్ పట్టణ కో కన్వీనర్ కుంభం కిషోర్ ముదిరాజ్ శుక్రవారం గాంధీభవన్లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్, తెలంగాణలో బీసీ కులగణన, స్థానిక ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు, వారి సామాజిక స్థితిగతుల గురించి తెలియజేస్తూ అట్టి అంశాలపై ప్రభుత్వానికి నివేదిక అందించాలని వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా సీనియర్ నాయకులు షబ్బీర్ అలీ, కే కేశవరావు మొదలగు నేతలను ఈ సందర్భంగా కలిశారు.

## బీరవోలు నీరజకు మాజీమంత్రి జగదీష్ రెడ్డి నివాళి



**విశ్వంభర, సూర్యపేట:** సూర్యపేట మండల పరిధిలోని సోలిపేటకు చెందిన సూర్యాపేట జిల్లా టీడీపీ సీనియర్ నాయకులు బీరవోలు ఇంద్రారెడ్డి సతీమణి నీరజ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, వారి కుటుంబసభ్యులను పరామర్శించిన మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి.

## నలుగురిని పెళ్లి చేసుకున్న.. ఆర్మీ జవాన్‌పై కేసు నమోదు

**మేరఠ్:** నిత్య పెళ్లికొడుకులా మారి పలు పెళ్లిళ్లు చేసుకున్న ఓ ఆర్మీ జవాన్‌పై యూపీలోని మేరఠ్‌లో కేసు నమోదైంది. ఆర్మీలో పనిచేస్తున్న మనీష్ కుమార్ గత పదేళ్లలో నాలుగు పెళ్లిళ్లు చేసుకున్నాడని హైదరాబాద్‌కు చెందిన అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. హరియాణాకు చెందిన మనీష్ కుమార్ 2015లో హైదరాబాద్‌లో తనకు పరిచయం అయ్యారని.. తర్వాత తాము వివాహం చేసుకున్నట్లు ఆమె తెలిపింది. మొదట్లో బాగానే ఉన్నా.. కొన్ని రోజుల తర్వాత అతడి ప్రవర్తనలో మార్పు వచ్చిందని, తనను తరచూ వేధింపులకు గురిచేసేవాడని బాధిత మహిళ తెలిపింది. 2018లో తాను గర్భం దాల్చినప్పుడు అబార్షన్ చేయించుకోవాలని ఒత్తిడి చేశాడని, అతడి మాట వినపోవడంతో తనను విడిచి వెళ్లిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొంది. మనీష్ ఆచూకీ కోసం వెతకగా.. అప్పటికే అతడికి మూడు పెళ్లిళ్లు జరిగిన విషయం తనకు తెలిసిందని ఆమె పోలీసులకు వెల్లడించింది. ఆ తర్వాత తాను మారినట్లు చెప్పి కొంత కాలం పాటు తన దగ్గరే ఉన్నాడని.. తనకు కుమారుడు పుట్టిన అనంతరం మరోసారి అదృశ్యమయ్యాడని ఫిర్యాదులో పేర్కొంది. ఆ తర్వాత మేరఠ్‌లోని ఓ కాలనీలో ఇద్దరు మహిళలతో అతడు దొరికినట్లు చెప్పింది. ఈ ఘటనపై మొదట కంకరఖేడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. అక్కడి పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేశారని, అందుకే జిల్లా ఎస్ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించినట్లు తెలిపింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకే మూసీపై బీఆర్ఎస్ విష ప్రచారం: ఎంపీ చామల



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకే మూసీపై భారాస విష ప్రచారం చేస్తోందని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం కమీషన్లకు అలవాటు పడినవారు అలానే ఆలోచిస్తున్నారని వ్యాఖ్యానించారు. గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో భారాస రూ.7లక్షల కోట్ల అప్పు చేసిందని.. ఆదాయ మార్గాలను అన్వేషిస్తున్నామని చెప్పారు. మూసీ సుందరీకరణపై వాస్తవాలను కప్పిపుచ్చి ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. తాము అడిగిన ప్రశ్నలకు భారాస నేతలు సమాధానం ఇవ్వడం లేదన్నారు.

## దమ్ముంటే హరీశ్‌రావు సవాల్‌ను సీఎం స్వీకరించాలి

### వంటేరు ప్రతాప్‌రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే మాజీమంత్రి హరీశ్‌రావు సవాల్‌ను స్వీకరించాలని గజ్వేల్ బీఆర్ఎస్ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. హరీశ్‌రావు సవాలు స్వీకరించి మల్లన్న సాగర్, కొండపోచమ్మ ముంపు గ్రామాల్లో పర్యటిస్తే వెయ్యి మందితో స్వాగతం పలుకుతామని తెలిపారు. శుక్రవారం గజ్వేల్‌లో వంటేరు ప్రతాప్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముంపు గ్రామాలకు చెందిన 9,600మంది బాధితులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు, ఓపెన్ ప్లాట్లు, ప్యాకేజీలు అందజేశామని తెలిపారు. ప్రస్తుతం ముంపు గ్రామాలకు చెందిన 400మంది నిర్వాసితులకు రావాల్సిన రూ.448 కోట్లను వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మైకుల ముందు మాట్లాడి ప్రజలను అయోమయానికి గురిచేసి అబద్ధాలు చెప్పడం కాంగ్రెసోళ్లకు అలవాటైందని వంటేరు ప్రతాప్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి తాగు, సాగునీటిని అందించిందని తెలిపారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అప్పుల ఉబిలోకి నెట్టుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ రైతులను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ముందుకు సాగారని పేర్కొన్నారు. కొండపోచమ్మ, మల్లన్నసాగర్ ప్రాజెక్టుల నిర్మాణంతో హైద రాబాద్ నగరానికి తాగునీటిని అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కు తుందని చెప్పారు. మూసీ సుందరీకరణతో రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు ఎలా పెడుతారో ప్రజలకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.మూసీకి పెట్టే ఖర్చుతో ఎన్ని ప్రాజెక్టులను నిర్మిస్తారో, ఎంతమంది రైతులకు లబ్ధి చేకూరుతుందో చెప్పాలన్నారు. ఢిల్లీ బాసులకు డబ్బులను పంపేందుకే మూసీ సుందరీకరణను సీఎం రేవంత్ రెడ్డి తెరపైకి తెచ్చారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజల మీద రేవంత్‌రెడ్డికి సోయిలేదని, మూసీ పెద్ద స్కాం అని ఆరోపించారు. కాంగ్రెస్ సర్కార్ మొద్దు నిద్ర వీడి ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రైతులకు రుణమాఫీని వెంటనే అమలు చేయాలని, చేతకాని పక్షంలో సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# అభివృద్ధిని ఆగం చేస్తామంటే ఊరుకోం

### సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి



**విశ్వంభర, సూర్యాపేట:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగల తొక్కి.. అణిచివేతతో పాలన సాగించాలని చూస్తున్నారని కాంగ్రెస్ నాయకులపై మండిపడ్డారు. ముఖ్యమంత్రి, మంత్రులు పాలనను గాలికొదిలేసి.. స్కాముల్లో పోటీపడుతున్నారని విమర్శించారు.బీఆర్ఎస్ నియోజకవర్గస్థాయి వర్క్‌షాపులో భాగంగా తొలిరోజు సూర్యాపేట టౌన్, రూరల్, ఆత్మకూర్(ఎస్) మండలాల ముఖ్యనేతల సమావేశం శుక్రవారం జరిగింది. సూర్యాపేటలోని ఎస్ఎస్ ఫంక్షన్ హాలులో జరిగిన ఈ వర్క్‌షాపులో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి పాల్గొని బీఆర్ఎస్ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. నిత్యం ప్రజల్లో ఉండి ప్రజా సమస్యలపై పోరాడాలని సూచించారు. ప్రజల పక్షాన అండగా నిలబడాలని అన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ చెప్పిన ఆరు గ్యారంటీలు ఏమయ్యాయని అడుగడుగునా నిలదీయాలని తెలిపారు.కాంగ్రెస్ పాలకులు అభివృద్ధి చేయకపోగా.. భయభ్రాంతులకు గురిచేస్తున్నారని జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ ఇచ్చిన హామీలను బంద్ పెట్టి.. రైతుల నోట్లో మన్ను గొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేం అరాచకాలు సృష్టిస్తామని.. దానిపై ప్రశ్నిస్తే కేసులు పెడతామని బెదిరిస్తున్నారని మండిపడ్డారు. అధికారం కట్టబెట్టిన ఏడాదిలోపే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని అన్నారు. తమ సమస్యలను చెప్పుకునేందుకు నిత్యం తెలంగాణ భవన్ ముందు ప్రజలు బారులు తీరుతున్నారని పేర్కొన్నారు.కాంగ్రెస్ అరాచకాలకు మహిళలు సైతం బయటకు వచ్చి పోరాడతామని అంటున్నారని జగదీశ్ రెడ్డి తెలిపారు. అందుకే ఈ ఆపద సమయంలో బీఆర్ఎస్ శ్రేణులు ప్రజలకు అండగా నిలబడాలని సూచించారు. మనం చేసిన అభివృద్ధిని ఆగం చేస్తామంటే చూస్తూ ఊరుకుందామా అని ప్రశ్నించారు. కేసీఆర్, బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ అభివృద్ధి కోసమని తెలిపారు. మన సంపద దోచిపెడతాం.. అభివృద్ధిని అటకెక్కిస్తామంటే ఊరుకునేదే లేదని పేర్కొన్నారు.

## తమిళనాడులో మరోసారి సీఎం, గవర్నర్ వివాదం

**గవర్నర్‌ను రీకాల్ చేయాలని సీఎం డిమాండ్**

**'ద్రవిడ' పదం పలకలేదని స్టాలిన్ ఆరోపణ**

**పదవికి ఆర్ఎన్ రవి అర్హుడు కాదు**



**చెన్నై:** తమిళనాడులో మరోసారి ప్రభుత్వానికి, గవర్నర్‌కు మధ్య వివాదం రాజుకొంది. గవర్నర్ ఆర్ఎన్ రవి ఉద్దేశపూర్వకంగానే 'ద్రవిడ' అనే పదం పలకకుండా దాటవేశారని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆరోపించారు. జాతి ఐక్యతను దెబ్బతీసే విధంగా వ్యవహరించిన ఆయన్ను వెంటనే రీకాల్ చేయాలంటూ కేంద్రానికి లేఖ రాశారు.చెన్నైలోని దూరదర్శన్ గోల్డెన్ జూబ్లీ కార్యక్రమం జరిగింది. ఇదే ఈవెంట్‌లో హిందీ మాసోత్సవం కూడా నిర్వహించారు. హిందీని, హిందీ భాషేతర రాష్ట్రాల ఈవెంట్‌ను కలిపి నిర్వహించడాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ తొలుత తప్పుబట్టారు. ఈవెంట్ సందర్భంగా రాష్ట్ర గేయాన్ని ఆలపిస్తూ.. ద్రవిడ అనే పదాన్ని గాయకులు దాటవేయడంపై వివాదం నెలకొంది. దీనిపై దూరదర్శన్ తమిళ్ క్షమాపణ కూడా చెప్పింది. గాయకుల పొరపాటుగా పేర్కొంది. అదే ఈవెంట్‌లో పాల్గొన్న గవర్నర్ కూడా 'ద్రవిడ' అనే పదాన్ని ఉచ్చరించకపోవడాన్ని స్టాలిన్ తప్పుబట్టారు. దేశ ఐక్యతను దెబ్బతీసే విధంగా వ్యవహరించిన ఆయన.. గవర్నర్ పదవికి ఏమాత్రం అర్హులు కాదంటూ ఆరోపించారు. రాష్ట్ర గేయంలో ఆ పదాన్ని ఉచ్చరించకపోవడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. ఒకవేళ జాతీయ గీతంలో ద్రవిడ అనే పదం వస్తే ఇలానే వదిలేస్తారా? అని ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగా తమిళనాడును, ఇక్కడి ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్న గవర్నర్‌ను తక్షణమే రీకాల్ చేయాలని కేంద్రాన్ని స్టాలిన్ డిమాండ్ చేశారు. ఈ వివాదంపై గవర్నర్ కార్యాలయం స్పందించింది. ఈ వ్యవహారంలో గవర్నర్ ఆర్ఎన్ రవి తప్పేమీ లేదని పేర్కొంది. ఆయన హాజరైన కార్యక్రమంలో గేయాన్ని ఆలపించిన బృందం పొరపాటుగా పేర్కొంది. ఈ విషయం వెంటనే నిర్వాహకుల దృష్టికి తేవడంతో పాటు, సంబంధిత అధికారులతో మాట్లాడినట్లు గవర్నర్ కార్యాలయ ప్రతినిధి పేర్కొన్నారు.

# ముడా కార్యాలయంలో ఈడీ సోదాలు



**బెంగళూరు:** మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) కుంభకోణంలో కీలక పరిణామం చోటు చేసుకున్నది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య బీఎం పార్వతికి స్థలాల కేటాయింపులో అక్రమాలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో మైసూర్‌లోని ముడా కార్యాలయంపై ఈడీ అధికారులు దాడులు చేశారు . 12 మంది అధికారుల బృందం శుక్రవారం ఉదయం ముడా కార్యాలయం లో సోదాలు చేపట్టారు.ముడా కమిషనర్ ఏఎన్ రఘునందన్ సహా సీనియర్ అధికారులతో సమావేశం అయ్యారు. భూ కేటాయింపు కేసులో ముడా అధికారుల ప్రమేయాన్ని నిర్ధారించేందుకు దర్యాప్తు సంస్థ అధికారులు వారిని ప్రశ్నిస్తున్నారు. అనంతరం కేసుకు సంబంధించిన కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది.


### ముడా చైర్మన్ రాజీనామా

కాగా, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య బీఎం పార్వతికి స్థలాల కేటాయింపులో అక్రమాలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో ముడా చైర్మన్ కే మరిగౌడ బుధవారం తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి ఆదేశాలతో పాటు తన అనారోగ్య సమస్యలవల్ల రాజీనామా చేస్తున్నానని, తనపై ఎలాంటి ఒత్తిడి లేదని ఆయన ప్రకటించారు. ముడా స్కామ్‌పై విచారణ కొనసాగుతున్నదని, అక్రమాలు జరిగాయా అనేది విచారణలో తేలుతుందని పేర్కొన్నారు. తాను 40 ఏండ్లుగా సిద్ధరామయ్యతో ఉన్నానని, ఆయనే తనను తాలుకా, జిల్లా పంచాయతీ అధ్యక్షుడిని చేశారని, చట్టవ్యతిరేక పనులు చేయమని ఆయన తనకు ఎప్పుడూ చెప్పలేదని అన్నారు. ఆయన రాజీనామా చేసిన రెండు రోజుల తర్వాత ఈ పరిణామం చోటు చేసుకుంది.

### ముడా స్కామ్‌లో సీఎంపై ఆరోపణలు..

మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ భూకుంభకోణం ఆరోపణలు కర్ణాటకలో గత కొన్ని నెలలుగా ప్రకంపనలు రేపుతున్నాయి. ఈ కేసులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అడ్డంగా బుక్కయ్యారు. ముడా నుంచి తన భార్యకు అనుచితంగా లబ్ధి కలిగించినట్లు సీఎంపై ఆరోపణలున్నాయి. దీంతో కుంభకోణం వ్యవహారం లో సిద్ధరామయ్యపై లోకాయుక్త పోలీసులు, ఈడీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే.ఈ వివాదం నేపథ్యంలో సీఎం సిద్ధరామయ్యభార్య పార్వతికి కేటాయించిన 14 స్థలాలను ముడా అధికారులు ఇటీవలే వెనక్కి కూడా తీసుకున్నారు. ముడా కుంభకోణంనేపథ్యంలో,తనకు కేటాయించిన భూములను తిరిగి వెనక్కి తీసుకోవాలని సీఎం భార్య మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ 14 ప్లాట్లను వెనక్కి తీసుకుంటూ సేల్‌డీడ్‌ను రద్దు చేయాలని ముడా ఆదేశాలుజారీ చేసింది. మరోవైపు ఈకుంభకోణం వ్యవహారంలో సిద్ధరామయ్యపైవిచారణ కొనసాగుతోంది.ఇకముడా కుంభకోణం లో పీకల్లోతు కూరుకుపోయి విచారణను ఎదుర్కొంటున్న సీఎం సిద్ధరామయ్య ఏ క్షణంలోనైనా పదవిని కోల్పోతారన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి.

## ఈషా ఫౌండేషన్‌కు భారీ ఊరట యువతులను బంధించిన ఆరోపణల కేసును కొట్టేసిన సుప్రీంకోర్టు





**ఢిల్లీ:** ఆధ్యాత్మిక గురువు సద్గురు జగ్గీ వాసుదేవ్ కు భారీ ఊరట లభించింది. సద్గురుకు చెందిన ఈషా ఫౌండేషన్ పై నమోదైన కేసును సుప్రీంకోర్టు కొట్టేసింది. తన ఇద్దరు కూతుళ్లను సద్గురు బ్రెయిన్‌వాష్ చేశారని, వాళ్లను ఈషా యోగా సెంటర్ నుంచి బయటకు రానివ్వడం లేదంటూ ఓ వ్యక్తి ఇటీవలే హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఇవాళ విచారణ జరిపింది.విచారణ సందర్భంగా ఆ ఇద్దరు మహిళలు ఈషా కేంద్రంలో స్వచ్ఛందంగానే ఉంటున్నారని అత్యున్నత న్యాయస్థానానికి పోలీసులు తెలిపారు. ఈ మేరకు వివరాలు సమర్పించారు. పోలీసులు సమర్పించిన వివరాలను పరిశీలించిన న్యాయస్థానం.. ఈ కేసును కొట్టేస్తూ ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది.కోయంబత్తూరులోని తమిళనాడు అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్ కామరాజ్ ఆ కేసు ఫైల్ చేశారు. 42, 39 ఏళ్లు ఉన్న ఇద్దరు కూతుర్లను సద్గురు బ్రెయిన్‌వాష్ చేశారని, వాళ్లను ఈషా యోగా సెంటర్ నుంచి బయటకు రానివ్వడం లేదంటూ ఆరోపించారు. ఈ మేరకు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇటీవలే ఈ కేసుపై మద్రాసు హైకోర్టులో విచారణ జరిగింది. ఈ విచారణ సందర్భంగా ఇద్దరు మహిళలు కోర్టుకు హాజరయ్యారు. తమ ఇష్ట ప్రకారమే ఈషా ఫౌండేషన్‌లో ఉంటున్నట్లు చెప్పారు. తమను ఎవరూ బంధించలేదని స్పష్టం చేశారు.దీంతో ఈషా ఫౌండేషన్‌కు సంబంధించిన అన్ని కేసుల జాబితాను తయారు చేసి, నివేదికను సమర్పించాలని పోలీసులను కోర్టు ఆదేశించింది. ఫౌండేషన్‌పై అనేక క్రిమినల్ ఫిర్యాదులు ఉన్నాయని పేర్కొన్న మద్రాస్ హైకోర్టు.. ఈ కేసులో మరింత లోతుగా విచారణ చేపట్టాలని సూచించారు. సద్గురు తన కుమార్తెకు వివాహం జరిపించి సంపన్నమైన జీవితాన్ని ప్రసాదించారని,ఇతర స్త్రీలను సన్యాసం తీసుకునేలా ప్రోత్సహిస్తున్నాడని కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ మేరకు హైకోర్టు ఈషా ఫౌండేషన్‌కు వ్యతిరేకంగా ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాల మేరకు దాదాపు 150 మంది పోలీసులు ఈషా ఫౌండేషన్‌లో తనిఖీలు చేశారు.ఇక ఈ వ్యవహారంపై ఈషా ఫౌండేషన్ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. దీంతో ఈ కేసు మద్రాసు హైకోర్టు నుంచి సుప్రీం కోర్టుకు బదిలీ అయ్యింది. దీనిపై ఇటీవలే విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం..మహిళల వాంగ్మూలాన్ని బట్టివారు స్వచ్ఛందంగా ఆశ్రమంలో ఉండటంపై ఎలాంటి సందేహాలకు తావులేదని పేర్కొంది. ఈ కేసులో తదుపరి చర్యలు తీసుకోకుండా స్టేటస్ రిపోర్టును అత్యున్నత న్యాయస్థానంలో దాఖలు చేయాలని తమిళనాడు పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు శుక్రవారం తీర్పు వెలువరించింది.

## ఫుడ్ వోచర్స్‌తో ఇంటి సామాన్లు కొనుగోలు.. ఉద్యోగులపై మెటా ఫైర్




**ఢిల్లీ:** ఫేస్‌బుక్ మాత్రుసంస్థ మెటా పలువురు ఉద్యోగులపై సీరియస్ అయ్యింది. ఫుడ్ వోచర్స్ సిస్టమ్‌ను మిస్‌యూజ్ చేసుకున్నట్లు గుర్తించిన సంస్థ.. సదరు ఉద్యోగులపై వేటు వేసింది.లాస్ ఏంజిల్స్ కార్యాలయంలో పనిచేస్తున్న సుమారు 24 మంది ఉద్యోగులు.. కంపెనీ ఫుడ్ వోచర్ సిస్టమ్‌ను దుర్వినియోగం చేశారు. ఈ మీల్ వోచర్స్‌తో ఉద్యోగులు టూత్‌పేస్ట్, లాండ్రీ డిటర్జెంట్, స్కాచ్ టేప్ వంటి గృహోపకరణాలతో పాటు ఆహారేతర (నాన్- ఫుడ్) వస్తువలైన వైన్ గ్లాస్ వంటివి కొనుగోలు చేశారు.ఈ విషయాన్ని గుర్తించిన సంస్థ..దీనిపై అంతర్గత విచారణకు ఆదేశించింది.ఈ విచారణలో ఉద్యోగులు ఆఫీసు వేళల్లో భోజనానికి సంబంధం లేని వస్తువులను కొనుగోలు చేసి ఫుడ్ క్రెడిట్‌లను దుర్వినియోగం చేసినట్లు తేలింది.ఉద్యోగుల తీరుపై సంస్థ సీరియస్ అయ్యింది. సదరు ఉద్యోగులను పిలిచి విచారించగా.. కిరాణా వస్తువులు, గృహోపకరణాల కోసం ఫుడ్ క్రెడిట్స్‌ను వినియోగించినట్లు అంగీకరించారు. దీంతో సంస్థ చర్యలకు ఉపక్రమించింది. దాదాపు 24 మంది ఉద్యోగులపై వేటు వేసింది.

### మెటాలో ఆగని ఉద్యోగాల కోతలు..


మరోవైపు మెటాలో ఉద్యోగుల కోతలు ఆగడం లేదు. మరోసారి ఉద్యోగుల తొలగింపుకు సిద్ధమైంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, రియాలిటీ ల్యాబ్స్ కోసం పనిచేస్తున్న టీమ్‌లతో సహా మెటా వర్స్ అంతటా లే ఆఫ్స్‌ను ప్రకటించింది. అయితే, ఎంతమంది ఉద్యోగులను తొలగించారనే విషయాన్ని మెటా వెంటనే వెల్లడించలేదు.ఈ కోతల వల్ల కంపెనీలోని వివిధ టీమ్‌లు ప్రభావితమవుతాయని టెక్ క్రంచ్ నివేదిక తెలిపింది. దీర్ఘకాల వ్యూహాత్మక లక్ష్యాల కోసం కొన్ని టీముల్లో మార్పులు చేస్తున్నట్టు మెటా అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఉద్యోగాలు కోల్పోయిన వారికి వేరే అవకాశాలను చూపించడానికి తాము తీవ్రంగా శ్రమిస్తున్నట్టు చెప్పారు. తమను ఉద్యోగం నుంచి తొలగించారని పలువురు మెటా ఉద్యోగులు సామాజిక మాధ్యమాల్లో ప్రకటించారు. ఈ ఏడాది ప్రారంభంలో మెటా తన రియాల్టీ ల్యాబ్స్ విభాగం ఉద్యోగులను తొలగించింది.

## చంపేస్తామంటూ బెదిరింపు సల్మాన్ ఖాన్ ఇంటి దగ్గర భద్రత పటిష్టం..




**ముంబయి:**'సల్మాన్‌ఖాన్ ప్రాణాలతో ఉండాలన్నా, లారెన్స్ బిష్ణోయ్‌తో శత్రుత్వాన్ని ముగించుకోవాలన్నా తమకు రూ.5 కోట్లు చెల్లించాలి. లేదంటే సల్మాన్ పరిస్థితి బాబా సిద్ధిఖీ కంటే దారుణంగా ఉంటుంది. ఈ విషయాన్ని తేలిగ్గా తీసుకోవద్దు' అంటూ ముంబై ట్రాఫిక్ పోలీస్ వాట్సాప్ నంబర్‌కు గురువారం రాత్రి ఒక మెసేజ్ వచ్చింది. దాంతో ముంబై పోలీసులు అప్రమత్తమయ్యారు. సల్మాన్ ఖాన్ ఇంటిదగ్గర భద్రతను పటిష్టం చేశారు. ఖాన్ సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులు కలిసి అక్కడ పహారా కాస్తున్నారు.మరోవైపు బెదిరింపు మెసేజ్ నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేపట్టారు. ఆమెసేజ్ ఎక్కడి నుంచి వచ్చిందనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.ఇదిలావుంటే సల్మాన్ ఖాన్ హత్యకు కుట్ర పన్నిన కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో నిందితుడిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. హర్యానాలోని పానిపట్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నారు. 1998లో సల్మాన్ ఖాన్ కృష్ణ జింకను వేటాడటంతో అటు కేసులో ఇరుక్కోవడమే కాకుండా ఇటు లారెన్స్ బిష్ణోయ్ గాంగ్‌కు టార్గెట్‌గా మారారు.కృష్ణ జింకను బిష్ణోయ్ వర్గం ప్రజలు దైవంలా భావిస్తారు. ఈ నేపథ్యంలో సల్మాన్ ఖాన్ కృష్ణ జింకను వేటాడటం లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు ఆగ్రహం తెప్పించింది. అప్పటి నుంచి సల్మాన్ ఖాన్‌ను హత్య చేసేందుకు ఆ గ్యాంగ్ కుట్రలు పన్నుతూనే ఉంది. గత జూన్‌లో కూడాబైక్‌పై సల్మాన్‌ఖాన్ గెలాక్సీ అపార్టుమెంట్ వద్దకు వచ్చిన ఇద్దరు దుండగులు నాలుగు రౌండ్ల కాల్పులు జరి పారు. ఈ ఘటనపై దర్యాప్తు సాగుతుండగానే బాబా సిద్ధిఖీ హత్య, సల్మాన్‌కు బెదిరింపుల ఘటనలు చోటుచేసుకున్నాయి.

## మరోసారి రష్యా పర్యటనకు ప్రధాని మోదీ



**ఢిల్లీ** భారత ప్రధాని నరేంద్ర మోదీ రష్యా పర్యటన ఖరారైంది. మాస్కో అధ్యక్షతన వచ్చే వారంలో జరగనున్న బ్రిక్స్ సదస్సులో మోదీ పాల్గొనున్నారు. ఈమేరకు భారత విదేశాంగ శాఖ ప్రకటించింది. రష్యాలోని కజన్ వేదికగా ఈనెల 22 నుంచి 24వరకు 16వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ఈసదస్సుకు హాజర వ్వాలని రష్యా అధ్యక్షుడు పుతిన్ స్వయం గా మోదీని ఆహ్వానించారు. అందులో భాగంగానే ఈనెల 22 నుంచి 23 వరకు మోదీ రష్యాలో పర్యటించనున్నారని విదే శాంగ శాఖ తెలిపింది. ఈసందర్భంగా బ్రిక్స్ సభ్య దేశాల అధినేతలతో మోదీ ద్వైపాక్షిక చర్చలు నిర్వహిస్తారని వెల్లడించింది.

## న్యూక్లియర్ మిస్సైల్ యూనిట్ సన్నద్ధతను పరీక్షించనున్న రష్యా




**మాస్కో:** మాస్కోకు వాయువ్య ప్రాంతంలో న్యూక్లియర్ మిస్సైల్ యూనిట్ సన్నద్ధతను రష్యా పరీక్షించనున్నట్లుగా అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. యూనిట్ సన్నద్ధతను రష్యా స్ట్రాటజిక్ న్యూక్లియర్ దళ కమాండర్లు పరీక్షిస్తారని ఆ దేశ రక్షణశాఖ వర్గాలు వెల్లడించినట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ కసరత్తులో భాగంగానే ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను సైతం మోహరించనున్నట్లు సమాచారం.ఈ క్షిపణులు ఒక్కొక్కటి దాదాపు 100 కి.మీ.(62 మైళ్ళు)మేర విధ్వంసం సృష్టించగలవని మంత్రిత్వశాఖ తెలిపినట్లు మీడియా కథనాలు వెల్లడించాయి. రష్యా–ఉక్రెయిన్‌కు మధ్య జరుగుతున్న యుద్ధంలో పశ్చిమ దేశాలు జోక్యం చేసుకోకుండా నివారించడానికి రష్యా ఈ అణు విన్యాసాలు నిర్వహిస్తున్నట్లు అంతర్జాతీయ భద్రతావిశ్లేషకులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. కాగా ఇటీవల నాటో తన వార్షిక అణు విన్యాసాన్ని నిర్వహించింది. ఉక్రెయిన్‌తో యుద్ధం, సరిహద్దులో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అణ్వస్త్రాల విధానంలో మార్పులు చేసినట్లు ఇటీవల రష్యా వెల్లడించింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అణ్వాయుధ విన్యాసాలు మొదలుపెట్టాలని తన సైన్యాన్ని ఆదేశించినట్లు ఆ దేశ రక్షణశాఖ వెల్లడించింది. తమపై పాశ్చాత్య నేతలు రెచ్చగొట్టే ప్రకటనలు, బెదిరింపులకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రాంతీయ సమగ్రతను కాపాడేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. ఈ అణ్వాయుధ విన్యాసాల్లో గగనతల, నావికాదళాలు పాల్గొంటాయని ప్రకటించింది. సుదీర్ఘ కాలంగా రష్యా- ఉక్రెయిన్ల మధ్య కొనసాగుతున్న భీకరయుద్ధం గురించి ఉక్రెయిన్ అధ్య క్షుడు జెలెన్‌స్కీ తాజాగా తీవ్ర ఆరోపణలు చేశారు. రష్యా తరఫున యుద్ధంలో పాల్గొనేందుకు ఉత్తర కొరియా నుంచి 10 వేల మంది సైనికులు సిద్ధమవుతున్నారని ఆరోపించారు. మా రెండు దేశాల మధ్య జరుగుతున్న యుద్ధంలో మూడో దేశం పాల్గొంటే అది ప్రపంచయుద్ధానికి దారితీస్తుందని ఆయన పేర్కొన్నారు.

### పుతిన్‌కు అనారోగ్యమంటూ మళ్లీ ఊహాగానాలు.. స్పందించిన క్రెమ్లిన్

రష్యా అధ్యక్షుడు పుతిన్ అధ్యక్షుడు పుతిన్ అనారోగ్యంతో బాధపడుతున్నట్లు అక్కడి మీడియాల్లో కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ వార్తలను అధ్యక్ష భవనం క్రెమ్లిన్ ఖండించింది. ఇటీవల అధ్యక్షుడు పుతిన్, ఆరోగ్య మంత్రిత్వశాఖ మిఖాయిల్ మురాష్కోతో కలిసి ఫ్లూ వ్యాక్సినేషన్‌లపై అవగాహన కార్యక్రమంలో భాగంగా ఓ వార్తాసంస్థతో మాట్లాడారు. ఆ సమయంలో 'నేను సెంట్రల్ క్లినికల్ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నా. దేశీయంగా ఉత్పత్తి చేసిన మందులతో టీకాలు వేయమని సిఫార్సు చేస్తున్నా' అని పుతిన్ ఫ్లూ వ్యాక్సిన్‌ల గురించివ్యాఖ్యానించారు. ఈనేపథ్యంలో ఆయన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు సామాజిక మాధ్యమాల వేదికగా వచ్చిన వార్తలు పలు అనుమానాలకు దారితీశాయి. అయితే ఈ వార్తలపై క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పెస్కోవా స్పందించారు. అధ్యక్షుడు పుతిన్ సాధారణ వైద్య పరీక్షలు మాత్రమే చేయించుకున్నారని పేర్కొన్నారు. ఆయన ఆరోగ్యంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఇక, ఇటీవల పుతిన్ ఆరోగ్య పరిస్థితులపై ఎన్నో కథనాలు వెలువడ్డాయి. ఆయన డూప్‌ని సైతం ఉపయోగిస్తున్నారంటూ ఆరోపణలు వచ్చాయి. వీటిపై గతంలో పుతిన్ స్వయంగా స్పందించారు. అదేవిధంగా పుతిన్ అనారోగ్యంపై వస్తున్న వార్తలను క్రెమ్లిన్ ఎప్పటికప్పుడు ఖండిస్తోంది.

## మనిషి రక్తం రుచి మరిగిన ఆ చిరుతను చంపేశారు..



జైపూర్: మనిషి రక్తమాంసాల రుచి మరిగి.. ఉదయ్‌పుర్‌వాసులకు కంటిమీద కునుకులేకుండా చేసిన చిరుత పులిని అధికారులు ఎట్టకేలకు మట్టుబెట్టారు. అధికారులు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం పోలీసులు, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపడుతున్న సమయంలో మదర్ గ్రామానికి సమీప ప్రాంతంలో చిరుతను గుర్తించి.. దానిని హతమార్చినట్టు డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ అజయ్ చిత్తోరా పేర్కొన్నారు. నివేదికలు వచ్చిన అనంతరం అది మనుషుల రక్తం రుచి మరిగిన చిరుతేనా, కాదా అనే విషయం పూర్తిస్థాయిలో నిర్ధరణ అవుతుందని పేర్కొన్నారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పుర్ ప్రాంతంలో కొన్ని రోజులుగా వరుసగా చిరుత దాడి ఘటనలు కలకలం రేపుతున్నాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. సాయంత్రం దాటిన తర్వాత ప్రజలు బయటకురావొద్దని అధికారులుఆదేశాలు జారీ చేశారు. బయటకు వస్తే ఒంటరిగా రావొద్దని.. గుంపులుగా రావాలని సూచించారు. చిరుతపులుల భయానికి ఆ ప్రాంతంలో పాఠశాలలు కూడా మూతపడ్డాయి. సెప్టెంబరు 18 నుంచి ఇప్పటి వరకు చిరుత దాడుల్లో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. విష్ణుగిరి అనే 65 ఏళ్ల పూజారి ఆలయ సమీపంలో నిద్రిస్తుండగా.. చిరుత దాడి చేసి హతమార్చింది. బుధవారం సైతం చిరుత ఇద్దరు మహిళలపై దాడి చేయడంతో ఓ మహిళ ప్రాణాలను కోల్పోయింది. దీంతో చిరుతను పట్టుకోవడానికి అటవీశాఖ అధికారులు బోన్లు, కెమెరా ట్రాప్‌లను అమర్చారు. అయితే అది మనుషుల రక్తం రుచి మరిగింది కావడంతో చిరుత కనిపిస్తే కాల్చేయాలని ఉన్నతాధికారులు ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు మూడు చిరుతలు పట్టుబడినట్లు పేర్కొన్నారు.

## బాల్య వివాహాల కట్టడికి సుప్రీం మార్గదర్శకాలు



ఢిల్లీ: బాల్య వివాహాల కట్టడికి సర్వోన్నత న్యాయస్థానం మర్గదర్శకాలను జారీ చేసింది. పర్సనల్ లాతో సంబంధం లేకుండా దాన్ని అమలుచేయాలని సూచించింది. దేశంలో బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని సమర్థవంతంగా అమలుచేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఇందుకుగాను కొన్ని మార్గదర్శకాలను సైతం జారీ చేసింది. బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని పర్సనల్ లాతో తగ్గించవద్దని వెల్లడించింది. అలాగే ఇలాంటి వివాహాలతో మైనర్లకు వారి జీవితాన్ని ఎంచుకొనే స్వేచ్ఛను ఉల్లంఘించడమేనని వ్యాఖ్యానించింది. బాల్యవివాహాల నిరోధం, మైనర్‌ల రక్షణపై అధికారులు దృష్టిసారించాలని, చివరి ప్రయత్నంగా నిందితులకు జరిమానా విధించాలని తెలిపింది. 'బాల్యవివాహాలను నివారించాలనే వ్యూహాలు వివిధ వర్గాలకు అనుగుణంగా ఉండాలి. బహుళ రంగాల మధ్య సమన్వయం ఉన్నప్పుడే చట్టం విజయవంతం అవుతుంది. పోలీసులు, దర్యాప్తు అధికారులకు దీనిపై శిక్షణ సామర్థ్యాన్ని పెంచాలి. కమ్యూనిటీ ఆధారిత విధానాలు ఉండాలి' అని ధర్మాసనం పేర్కొంది. బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని 2006లో రూపొందించారు. ఈ చట్టాన్ని 1929 నాటి బాల్య వివాహ నిరోధక చట్టం స్థానంలో తీసుకొచ్చారు.

## కోల్‌కతా ఆసుపత్రిలో అగ్నిప్రమాదం ఐసీయూలో రోగి మృతి



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఓ ఆసుపత్రిలో మంటలు చెలరేగి.. ఐసీయూలో ఉన్న రోగి మృతి చెందారు. సుమారు 80 మంది పేషెంట్లను అక్కడి నుంచి సురక్షితంగా తరలించారు.సెంట్రల్ కోల్‌కతాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. ఈఎస్ఐ ఆసుపత్రిలోని ఓ వార్డులో చెలరేగిన మంటలు.. క్రమంగా ఆసుపత్రిలోని ఇతర ప్రాంతాలకు వ్యాపించాయి. అప్రమత్తమైన ఆసుపత్రి వర్గాలు వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న 10 ఫైర్ ఇంజన్లు మంటలను అదుపులోకి తెచ్చాయి.ఈ ప్రమాద సమయంలో ఐసీయూ లోని ఓ రోగి మరణించగా.. సుమారు 80 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చినట్లు అగ్నిమాపక శాఖ అధికారి తెలిపారు. రోగి మరణానికి ఖచ్చితమైన కారణం తెలియరాలేదు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదని పేర్కొన్నారు. ఇది చాలా భయంకరమైన ఘటన అని అభివర్ణించారు. దాదాపు 80 మంది రోగులు లోపల చిక్కుకుపోయారని.. 20 నిమిషాల్లోనే వారందరినీ సురక్షితంగా బయటకు తీసుకొచ్చినట్లు చెప్పారు. మంటల కారణంగా వార్డు మొత్తం పొగతో నిండిపోవడంతో.. రోగులు కిటికీల్లోంచి మమ్మల్ని రక్షించండి అంటూ అరుస్తున్నారని వివరించారు. మరోవైపు అగ్నిప్రమాద సమాచారం తెలుసుకున్న ఆ రాష్ట్ర అగ్నిమాపక, అత్యవసర సేవల మంత్రి సుజిత్ బోస్ హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అగ్నిప్రమాదానికి గల కారణాలుతెలియరాలేదు.

# ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలబడాలి: సీఎం చంద్రబాబు





**విశ్వంభర, అమరావతి:** గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని వైసీపీ సర్వనాశనం చేసిందని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు విమర్శించారు. ఆ పార్టీ పాలనలో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. తనను జైల్లో పెడితే పవన్‌కల్యాణ్ వచ్చి పరామర్శించి.. టీడీపీతో కలిసి పోటీ చేస్తున్నట్లు బహిరం గంగా ప్రకటించారని గుర్తుచేశారు.మోడీ నుంచి అందరూ నేర్చు కోవాలని.. పట్టుదల, కృషి వల్లే ఆయన మూడోసారి ప్రధాని అయ్యారని కొనియాడారు. వైసీపీ చేయని తప్పులు లేవని.. అం దుకే ప్రజలు చిత్తుగా ఓడించారని చెప్పారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగాకూటమికి 93శాతం స్ట్రయిక్‌రేట్ ఇచ్చారన్నారు. మంగళగిరిలోని టీడీపీకేంద్ర కార్యాలయంలోనిర్వహించిన పార్టీ ఎమ్మెల్యేలు,ఎంపీలు, ఎమ్మెల్సీల సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు.

## అండగా ఉన్న వర్గాలకు ప్రాధాన్యం కల్పించాం..

"దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన పార్టీ తెదేపా. భవిష్యత్తులో పార్టీని ఎలా ముందుకు తీసుకెళ్లాలనేది సమీక్షించాలి. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్నాం. రాష్ట్రంలో మూడు పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. మిత్రపక్షాలను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలి. ఎన్నికల సీట్ల కేటాయింపులో తెదేపాకు అండగా ఉన్నవర్గాలకు ప్రాధాన్యం కల్పించాం. ఇంతవరకు ప్రాతినిధ్యం దక్కని వారికి అవకాశం కల్పించాం. 'ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలబడాలి' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లాం.

## రాజకీయ పార్టీ.. కుటుంబం లాంటిదే..

గెలిచాం మన పని అయిపోయిందని అనుకుంటే చాలా సమస్యలు వస్తాయి. ఎన్నికల సమయంలో ఉన్న పరిస్థితుల వల్ల పార్టీని నమ్ముకున్న కొంతమందికి సీట్లు ఇవ్వలేకపోయాం. న్యాయం చేస్తామని వారికి హామీ ఇచ్చాం. ప్రజలు మనల్ని విశ్వసించారు.. దాని ప్రకారం ముందుకెళ్లాలి. ఇప్పుడు అందరిపై బాధ్యత ఉంది. కొత్తఎమ్మెల్యేలు 65 మంది ఉన్నారు. 18 మంది కొత్త మంత్రులు ఉన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీల్లో దాదాపు 80 మంది వరకు కొత్తవారే. కుటుంబంలోనే భేదాభిప్రాయాలు ఉంటాయి. ఫ్యామిలీని ఐక్యంగా ఉంచేందుకు ఇంటిపెద్ద ఆలోచిస్తుంటారు. రాజకీయ పార్టీ కూడా అంతే. నాపై ఆ బాధ్యత ఉంది. అధికారంలోకి రాగానే 7 అంశాలపై శ్వేతపత్రాలు విడుదల చేశాం. రాష్ట్రంలో ఏ అరాచకం చూసినా దాని వెనుక గంజాయి బ్యాచ్ ఉంటుంది. కేంద్రంలో అనుకూల ప్రభుత్వం వచ్చింది కనుక నిలదొక్కుకుంటున్నాం. 16,437 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ ఇచ్చాం. వచ్చే ఫిర్యాదుల్లో 70 శాతం భూ ఆక్రమణలపైనే ఉన్నాయి. అందుకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశాం. ప్రజలు మనల్ని అనుమానించే పరిస్థితి రాకూడదు. ప్రతి ఒక్కరికీ క్రమశిక్షణ ముఖ్యం. వరదలు వస్తే ఎలా పనిచేశామో చూశాం. యుద్ధప్రాతిపదికన పనులు చేశాం.. అందరినీ ఆదుకున్నాం.

## ప్రధాని మోదీ నుంచి నేర్చుకోవాలి

చండీగఢ్‌లో హరియాణా సీఎం ప్రమాణస్వీకారం తర్వాత ఎన్డీయే సమావేశం నిర్వహించారు. ప్రధాని మోదీ 5 గంటల పాటు అక్కడ కూర్చున్నారు. మోదీ అంతసేపు ఉండాల్సిన అవసరం లేదు. కానీ వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నారు. మోదీ నుంచి నేర్చుకోవాలి. ఆయన పట్టుదల, కృషి వల్లే మూడోసారి ప్రధాని అయ్యారు. ఆరుసార్లు గుజరాత్‌లో భాజపా గెలిచింది. మూడోసారి హరియాణాలో విజయం సాధించారు. సమష్టిగా పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందారు. ఏం చేసినా ప్రజలను దృష్టిలో ఉంచుకుని చేశారు. దేశంలో ఎవరికీ దక్కని విజయం మోదీకి దక్కిందంటే దాని వెనుక కఠోరమైన శ్రమ, క్రమశిక్షణ ఉన్నాయి. ఎక్కడా తప్పు చేయకుండా పార్టీని ఆయన కాపాడుకుంటూ వస్తున్నారు"అని చంద్రబాబు కొనియాడారు.

# రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చూడాలన్నది జగన్ కుట్ర: హోం మంత్రి అనిత



జగన్ కుట్రలన్నీ సమర్థంగా తిప్పికొడుతున్నామని హోంమంత్రి అనిత తెలిపారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆమె మాట్లాడారు. రోజుకో అబద్ధం చెప్పి పెట్టుబడులు రాకుండా చూడాలన్నది జగన్ కుట్ర అని విమర్శించారు. ఆ అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

## ఎవరు తప్పు చేసినా చంద్రబాబు సహించరు: మండిపల్లి రామ్‌ప్రసాద్

క్రమశిక్షణకు సీఎం చంద్రబాబు అత్యంత ప్రాధాన్యత ఇస్తారని మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ అన్నారు. ఎవరు తప్పు చేసినా ఆయన సహించరన్నారు. ప్రజలకు సుపరిపాలనే లక్ష్యంగా పార్టీ సమావేశం జరుగుతోందని చెప్పారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమిదే విజయం: నిమ్మల

రైతు సంఘాలు, నీటి సంఘాలను వైకాపా నిర్వీర్యం చేసిందని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. రైతు ప్రాతినిధ్యంతోనే ఎన్నికల ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ విదేశాల్లోని తెలుగువారంతా పార్టీ సభ్యత్వంపై ఆసక్తి చూపిస్తున్నారని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. శాశ్వత సభ్యత్వానికి చాలా మంది ముందుకొస్తున్నారని చెప్పారు.

# పల్లె వెలుగు బస్సులో వైఎస్ షర్మిల

## మహిళలకు ఫ్రీ బస్ కోసం డిమాండ్



**విశ్వంభర, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శుక్రవారం ఏపీఎస్ ఆర్టీసీకి చెందిన పల్లె వెలుగు బస్సులో ప్రయాణించారు. బస్సులో ఆమె విజయవాడ బస్ స్టాండ్ నుంచి తెనాలి వరకు ప్రయాణం చేశారు. తెలంగాణ, కర్ణాటకలో మాదిరిగానే ఏపీలో కూడా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. బస్సులో సాటి ప్రయాణికులతో ఆమె ముచ్చటించారు. ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సదుపాయం అవసరమా.. లేదా..? అని మహిళలను ప్రశ్నించారు.పలువురు మహిళల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అందరూ ఉచిత బస్ సౌకర్యం కావాలనే చెప్పారు. ఎన్నికలకు ముందు ఎన్డీఏ నేతలు రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు ఆ హామీని ఎందుకు నెరవేర్చడం లేదని షర్మిల ప్రశ్నించారు. ఇచ్చిన హామీని మర్చిపోయారా..? అని నిలదీశారు. కాగా, ఈ సందర్భంగా మహిళా ప్రయాణికులు కొందరు షర్మిలతో సెల్ఫీలు తీసుకున్నారు. షర్మిల పల్లె వెలుగు బస్సులో ప్రయాణించిన దృశ్యాలను కింది వీడియోలో మీరు కూడా చూడవచ్చు.

# 23న ఏపీ కేబినెట్ సమావేశం



విశ్వంభర, అమరావతి : ఈనెల 23న ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశం జరుగనుంది. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరుగనుంది. కూటమిలోని టీడీపీ, బీజేపీ, జనసేనకు చెందిన మంత్రులు హాజరుకానున్నారు. ఈ మేరకు సీఎస్ కార్యాలయం నుంచి అన్ని ప్రభుత్వశాఖలకు ప్రతిపాదనలు పంపాలని నోట్ పంపారు.గత రెండు రోజుల క్రితం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఏపీలో పారిశ్రామిక అభివృద్ధిపై ఆరు కొత్త పాలసీలు తీసుకొస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈసారి జరుగనున్న కేబినెట్‌లో మరికొన్ని అంశాలను చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ముఖ్యంగా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రధాన హామీల అమలుపై చర్చించనున్నారు.

# రోడ్డు ప్రమాదంలో అటవీ ఉద్యోగి మృతి

విశ్వంభర, అమరావతి : వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసు, అటవీశాఖ ఉద్యోగుల వాహనాలపై దూసుకొచ్చిన లారీ కారణంగా ఓ అటవీశాఖ ఉద్యోగి మరణించాడు. మరో ఇద్దరు కానిస్టేబుళ్లు గాయపడ్డారు. తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం పెద్దకన్నలి వద్ద జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి.కర్రల లోడ్ ట్రాక్టర్‌ను రోడ్డుపక్కన ఆపి పోలీసులు మాట్లాడుతుండగా వెనుక నుంచి వచ్చిన గ్యాస్ సిలిండర్ల లారీ పోలీసు వాహనం, ట్రాక్టర్‌ను ఢీ కొట్టింది. దీంతో పోలీసు వాహనంలో ఉన్న అటవీ శాఖ ఉద్యోగి వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెంద గా ఇద్దరు కానిస్టేబుళ్లకు స్వల్పగాయాలయ్యాయి. గాయపడ్డ వారిని సమీప ఆస్పత్రికి తరలించారు. గ్యాస్ సిలిండర్ లారీ డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఏపీలో మాఫియా సామ్రాజ్యం : వైఎస్ జగన్



**విశ్వంభర, అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో మాఫియా సామ్రాజ్యం నడుస్తోందని వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఆరోపించారు. మద్యం, ఇసుక పాలసీల్లో ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. ప్రశ్నించిన వారిని భయపెడుతున్నారని పేర్కొన్నారు. తాడేపల్లి నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అధికారంలోకి రాకముందు అడ్డగోలు హామీలు ఇచ్చి, ఇప్పుడు రాష్ట్రం క్లిష్టపరిస్థితుల్లో ఉందంటున్నారని వెల్లడించారు. మార్పుల పేరుతో స్కాంలకు తెరలేపారని మండిపడ్డారు.మద్యం (%ాఅనబశీ%) టెండర్లలో కుంభకోణానికి తెరతీశారని విమర్శించారు. వైసీపీ హయాంలో ఒక్క డిస్టిలరీ కూడా లైసెన్స్ ఇవ్వలేదని అన్నారు. వైసీపీ హయాంలో నాసిరకం మద్యం విక్రయించారని ప్రచారం చేసిన టీడీపీ నాయకులు అదే డిస్టిలరీ నుంచి మద్యం తీసుకుంటూ నాణ్యమైన లిక్కర్ అంటూ ఊదరగొడుతుందని ఆరోపించారు.ఉచిత ఇసుక పేరుతో స్టాక్ యార్డులు దోచేశారని మండిపడ్డారు. వైసీపీ హయాంలో ఇసుక పాలసీ పారదర్శకంగా ఉండేదని పేర్కొన్నారు. ఈ టెండర్ నిర్వహించి ప్రభుత్వానికి ప్రతి యేట రూ. 750 కోట్లు ఆదాయం తీసుకురాగా, నేడు ఆదాయం లేకుండా చేశారని వివరించారు. టెండర్లకు కేవలం రెండు రోజులు గడువు ఇచ్చి సొంతవాళ్లకు దోచిపెట్టారని ఆరోపించారు.ఏపీలో దోచుకో, పంచుకో, తినుకో పాలన కొనసాగుతుందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజల ఆశలతో చెలగాటం ఆడారని, అబద్ధాలకు రెక్కలు తొడిగారని విమర్శించారు. రూ. 10 వేలు జీతం అంటూ వాలంటీర్లను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 5 నెలలుగా సూపర్ సిక్స్ జాడే లేదని వెల్లడించారు.

# తిరుమలలో శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటల సమయం



**విశ్వంభర, తిరుమల :** తిరుమలలో కలియుగ ప్రత్యక్షదైవం వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. కొండపై ఉన్న 31 కంపార్టుమెంట్లలో 26 కంపార్టుమెంట్లు భక్తులతో నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు 12 నుంచి 15 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వివరించారు. స్వామివారిని 58,637 మంది భక్తులు దర్శించుకోగా 21,956 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు మొక్కుల ద్వారా చెల్లించుకున కానుకలతో హుండీకి రూ. 3.69 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.

## వైభవంగా పౌర్ణమి గరుడసేవ

తిరుమలలలో గురువారం రాత్రి వైభవంగా పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. రాత్రి సర్వాలంకార భూషితుడైన మలయప్ప స్వామివారు గరుడునిపై ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, టీటీడీ సీవీఎస్వో శ్రీధర్, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు, డిప్యూటీ ఈవో భాస్కర్, భక్తులు పాల్గొన్నారు.

# అధికారంలో ఉన్నప్పుడు తప్పులు చేసిన వైసీపీ నేతలు

## టీడీపీ ఎంపీ కేశినేని చిన్ని



**విశ్వంభర, అమరావతి:** అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ నేతలు తప్పుల మీద తప్పులు చేశారని టీడీపీ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఇప్పుడు పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారని చెప్పారు. తెదేపా ఎంపీలు, ఎమ్మెల్యేల సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన.. మీడియాతో మాట్లాడారు. మళ్లీ అధికారంలోకి వచ్చి అక్రమ కేసులు పెట్టాలని వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డి పగటి కలలుకంటున్నారని వ్యాఖ్యానించారు. ప్రజా జీవితంలో వైకాపా ఇక కనపడదని.. ఈ విషయాన్ని ఆయన గుర్తించాలన్నారు.

# జగన్ కోర్టుకు వచ్చేందుకు అభ్యంతరమేంటి?: న్యాయవాది సలీం




**విశ్వంభర, విశాఖపట్నం:** కోడికత్తి కేసు విచారణకు నిందితుడు జనుపల్లి శ్రీనివాస్ హాజరయ్యాడు. న్యాయవాది సలీం, దళిత సంఘాల నేత బూసి వెంకటరావుతో కలిసి విశాఖలోని ఎన్ఐఏ కోర్టుకు వచ్చాడు. ఈ సందర్భంగా సలీం, బూసి వెంకటరావు మీడియాతో మాట్లాడుతూ వైకాపా అధ్యక్షుడు జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రిగా ఉన్న నారా లోకేశ్ పరువు నష్టం కేసులో కోర్టుకు హాజరయ్యారని.. సాధారణ ఎమ్మెల్యేగా ఉన్న జగన్ ఎందుకు రావడం లేదని సలీం ప్రశ్నించారు. బూసి వెంకటరావు మాట్లాడుతూ జైల్లో ఉన్న వ్యక్తులను కలిసేందుకు వెళ్లినపుడు లేని అభ్యంతరం.. కోర్టులో న్యాయమూర్తి ముందు సాక్షిగా హాజరై వాంగ్మూలం ఇచ్చేందుకు జగన్‌కు అభ్యంతరమేంటని నిలదీశారు.

# వెనకుండి నడిపిందే సజ్జల ఇప్పుడు నీతులు చెబితే ఎలా?



**విశ్వంభర, విజయవాడ:** అవినీతి, అరాచకాలకు కేరాఫ్ అడ్రస్ వైకాపా అని భాజపా నేత భానుప్రకాశ్ రెడ్డి విమర్శించారు. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ కూటమి ప్రభుత్వమని చెప్పారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీలో కొత్త నాటకానికి జగన్ తెరలేపారని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు నియంతలా వ్యవహరించారని.. ఇప్పుడు మీడియా ముందుకొచ్చి అవినీతి పాలన అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు."సజ్జల ఇప్పుడొచ్చి నీతులు చెబుతుంటే జనం నమ్మరు. 420 టీమ్‌ను వెనకుండి నడిపిందేఆయన. వైకాపా కార్యకర్తలను రెచ్చగొట్టి.. టీడీపీ కార్యాలయంపై దాడి చేయించింది సజ్జల కాదా? బోరుగడ్డ అనిల్ వ్యాఖ్యలను ఎందుకు ఖండించలేదు? ఇప్పుడు అతడిని అరెస్టు చేస్తుంటే గగ్గోలు పెడతారా? ప్రజల మధ్య జగన్ విద్వేషాలు రెచ్చగొడితే ఊరుకోం" అని భానుప్రకాశ్ రెడ్డి హెచ్చరించారు.

# విశాఖ కోర్టుకు హాజరైన మంత్రి లోకేశ్



**విశ్వంభర, విశాఖ:** పరువు నష్టం దావా కేసులో మంత్రి నారా లోకేశ్ విశాఖ కోర్టుకు హాజరయ్యారు.గతంలో ఆయన సాక్షి మీడియాపై రూ.75 కోట్లకు పరువు నష్టం దావా వేశారు. తన పరువుకు భంగం కలిగించేందుకు అసత్య కథనాలు ప్రచురించారని అందులో పేర్కొన్నారు. తప్పుడు కథనం రాసిన ఆ సంస్థపై చర్యలు తీవిశాఖ: పరువు నష్టం దావా కేసులో మంత్రి నారా లోకేశ్ విశాఖ కోర్టుకు హాజరయ్యారు. గతంలో ఆయన సాక్షి మీడియాపై రూ.75 కోట్లకు పరువు నష్టం దావా వేశారు. తన పరువుకు భంగం కలిగించేందుకు అసత్య కథనాలు ప్రచురించారని అందులో పేర్కొన్నారు. తప్పుడు కథనం రాసిన ఆ సంస్థపై చర్యలు తీసుకోవాలని లోకేశ్ కొంత కాలంగా పోరాటం చేస్తున్నారు. ఆయన తరఫు న్యాయవాదులు శుక్రవారం కోర్టులో వాదనలు వినిపించనున్నారు.

# మూడో రోజు ముగిసిన ఆట..

- భారత్ 231/3
- 9 వేల పరుగుల క్లబ్‌లో కోహ్లీ..
- నాలుగో భారత క్రికెటర్‌గా రికార్డు
- సెహ్వాగ్‌ను దాటేసిన సౌథీ



**బెంగళూరు:** భారత్ న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న తొలి టెస్టు మూడో రోజు ఆట ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 46 పరుగులకే కుప్పకూలిన టీమ్ఇండియా.. రెండో ఇన్నింగ్స్‌లో దూకుడుగా ఆడుతోంది. ఆట ముగిసే సమయానికి 3 వికెట్లు కోల్పోయి 231 పరుగులు చేసింది. ఫిలిప్స్ బౌలింగ్‌లో టామ్‌కు క్యాచ్ ఇచ్చి విరాట్ కోహ్లీ (70) ఔటయ్యాడు. సర్ఫరాజ్ ఖాన్ (70) క్రీజులో ఉన్నాడు. వీరిద్దరూ కలిసి 136 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఆట ముగిసే సమయానికి భారత్ 125 పరుగుల వెనుకంజలో ఉంది.
ఓపెనర్లు రోహిత్ శర్మ (52), జైశ్వాల్ (35) మంచి ఆరంభాన్నిచ్చారు. క్రీజులో నిలదొక్కుకుంటున్న ఈ జోడీని అజాజ్ పటేల్ విడగొట్టాడు. జట్టు స్కోరు 72 పరుగుల వద్ద జైశ్వాల్ స్టంపౌటయ్యాడు. అక్కడికి స్వల్ప వ్యవధిలోనే రోహిత్ శర్మ కూడా బౌల్డయ్యాడు. ఈ వికెట్‌ను కూడా అజాజే దక్కించుకున్నాడు. మరో రెండు రోజులు సమయం ఉన్న తరుణంలో భారీ స్కోరు చేస్తేనే టీమ్ ఇండియా ఆటలో నిలుస్తుంది. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 402 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

### కోహ్లీ రికార్డు...

భారత్ న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో విరాట్ కోహ్లీ మరో ఘనత సాధించాడు. టెస్టు క్రికెట్‌లో 9 వేల పరుగుల మైలురాయిని చేరుకున్నాడు. దీంతో భారత్ తరపున ఈ ఘనత సాధించిన నాలుగో ఆటగాడిగా నిలిచాడు. సచిన్ (15,921), రాహుల్ ద్రవిడ్(13, 265), సునీల్ గావస్కర్ (10, 122) ఈ జాబితాలో తొలి మూడు స్థానాల్లో ఉన్నారు. మొత్తంగా ఈ ఘనత సాధించిన 18వ ప్లేయర్‌గా విరాట్ నిలిచాడు.
9 వేల పరుగుల క్లబ్‌లో కోహ్లీ..
ప్రపంచ క్రికెట్‌లో రన్ మెషీన్‌గా, రికార్డుల రారాజుగా పేరొందిన విరాట్ కోహ్లీ మరో మైలురాయిని అధిగమించాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో 9వేల పరుగుల క్లబ్‌లో చేరాడు. చిన్నస్వామి స్టేడియంలో క్లాస్ ఇన్నింగ్స్ ఆడిన విరాట్ న్యూజిలాండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. బౌండరీలతో చెలరేగి 31వ టెస్టు ఫిఫ్టీ బాదేసిన విరాట్ 9 వేల రన్స్ పూర్తి చేసుకున్నాడు. విలియం ఓర్కీ బౌలింగ్‌లో మిడాన్ దిశగా సింగిల్ తీసిన కోహ్లీ 53 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఈ ఘనతకు చేరువయ్యాడు. దాంతో, ఈ ఫీట్ సాధించిన నాలుగో భారత క్రికెటర్‌గా క్రికెటర్‌గా రికార్డు పుస్తకాల్లో చేరాడు. కోహ్లీ కంటే ముందు దిగ్గజాలు సచిన్ టెండూల్కర్(15,921), రాహుల్ ద్రవిడ్(13,265), సునీల్ గవాస్కర్(10,212)లు ఈ మైలురాయిని అధిగమించారు.
సెహ్వాగ్‌ను దాటేసిన సౌథీ
బెంగళూరు వేదికగా న్యూజిలాండ్‌తో జరుగుతోన్న తొలి టెస్టులో కివీస్ ఆటగాడు టిమ్ సౌథీ కీలక మైలురాయిని చేరుకున్నాడు. టెస్టు క్రికెట్‌లో 93 సిక్సులు కొట్టి ఎక్కువ సిక్సులు బాదిన ఆటగాళ్ల జాబితాలో భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్‌ని అధిగమించాడు. సెహ్వాగ్ తన కెరీర్‌లో 104 టెస్టులు ఆడి 8,586 పరుగులు చేశాడు. అందులో 91 సిక్సులు ఉన్నాయి. ఇప్పటి వరకు 89 సిక్సులతో ఉన్న సౌథీ, తాజాగా భారత్‌తో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో నాలుగు సిక్సులు బాదాడు. దీంతో సెహ్వాగ్‌ను అధిగమించి ఐదో స్థానానికి చేరుకున్నాడు. ఇక మోస్ట్ సిక్సెస్ జాబితాలో ఇంగ్లండ్ ఆటగాడు బెన్ స్టోక్స్ మొదటి స్థానంలో ఉన్నాడు. తన కెరీర్‌లో 106 టెస్టు మ్యాచ్‌లు ఆడిన అతడు 131 సిక్సులు బాదాడు. ఆ తర్వాతి స్థానాల్లో న్యూజిలాండ్ ఆటగాడు బ్రెండన్ మెకల్లమ్ (101), ఆడమ్ గిల్‌క్రిస్ట్ (100), క్రిస్ గేల్ (98) సిక్సులతో ఉన్నారు.

## రోహిత్.. కెప్టెన్సీ విషయంలో ధోనీని అనుసరించు: సంజయ్



**బెంగళూరు :** బెంగళూరు వేదికగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్‌లో భారత్ పేలవ ప్రదర్శన చేసి 46 పరుగులకే ఆలౌటైన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో భారత మాజీ ఆటగాడు సంజయ్ మంజ్రేకర్ ఎక్స్ వేదికగా రోహిత్ శర్మ కెప్టెన్సీపై విమర్శనాత్మక పోస్ట్ చేశాడు. ఎంఎస్ ధోనీ కెప్టెన్సీని చూసి నేర్చుకోవాలని సూచించాడు.
"రోహిత్ ముఖంలో నిరాశ తేలికగా కనిపించింది. జట్టుకి నష్టం జరుగుతుంది అని తెలిసిన వెంటనే ధోనీ.. బౌలింగ్‌లో మార్పులు చేస్తాడు. అదే అతడి ప్రత్యేకత. రోహిత్‌శర్మ తన కెప్టెన్సీలో ఆ లక్షణాన్ని అలవర్చుకోవాలి" అని సంజయ్ సూచించాడు.

## భారత్‌కు ఆ రెండు పర్యటనల్లోనే కఠిన సవాలు

- సౌరభ్ గంగూలీ



**ముర్షిదాబాద్ :** న్యూజిలాండ్‌తో స్వదేశంలో జరుగుతున్న మూడు టెస్టుల సిరీస్ కంటే భారత్‌కు మున్ముందు కఠిన సవాలు ఎదురుకానుందని మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ వెల్లడించాడు. బహరమ్‌పుర్ స్టేడియంలో ముర్షిదాబాద్ క్రికెట్ అకాడమీని ప్రారంభించిన కార్యక్రమంలో గంగూలీ పాల్గొన్నాడు. ప్రస్తుత భారత జట్టు కుర్రాళ్లు, సీనియర్లతో అద్భుతంగా ఉందని కొనియాడాడు. అయితే, రాబోయే సిరీస్‌లు అత్యంత కీలకమని వ్యాఖ్యానించాడు. కివీస్‌తో టెస్టు సిరీస్ తర్వాత భారత్ కొద్దిరోజుల్లోనే దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా పర్యటనలకు వెళ్లనుంది. "కొత్త, పాత ప్లేయర్లతో జట్టు ముందుకుసాగుతోంది. మంచి టీమ్ అంటే ఇలానే ఉండాలి. కుర్రాళ్లకు సీనియర్లు సూచనలు, సలహాలు ఇవ్వాలి. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాతో భారత్ సిరీస్‌లను ఆడనుంది. ఇవి చాలా క్లిష్టంగా ఉంటాయి. విదేశీ గడ్డపై రాణిస్తే ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం ఇంకా పెరుగుతుంది" అని గంగూలీ తెలిపాడు.

**గంగూలీకి కొత్త బాధ్యతలు...**

ఐపీఎల్‌లో ఢిల్లీ జట్టుకు మెంటార్‌గా వ్యవహరించిన గంగూలీకి కొత్త బాధ్యతలు వచ్చాయి. జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్ డైరెక్టర్‌గా నియమితులయ్యాడు. ఐపీఎల్ ఢిల్లీ జట్టు సహా జేఎస్‌డబ్ల్యూకు చెందిన అన్ని క్రికెటింగ్ కార్యకలాపాలను అతడు చూసుకోవాల్సివుంటుంది. ఐపీఎల్, మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు జేఎస్‌డబ్ల్యూ సహ యజమాని. జీఎంఆర్‌తో కలిసి ఈ ఫ్రాంఛైజీలను నడిపిస్తోంది. ఇప్పుడు దీనికి డైరెక్టర్‌గా గంగూలీ వచ్చాడు.




## పంజాబ్ బౌలింగ్ కోచ్‌గా రికీ పాంటింగ్



**ఢిల్లీ :** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఒక్క ట్రోఫీ కూడా గెలవని జట్లలో పంజాబ్ కింగ్స్ఒకటి. జట్టు నిండా స్టార్లు ఉన్నా సరే 17 సీజన్లుగా పంజాబ్ టైటిల్‌ను ముద్దాడలేకపోయింది. అందుకని 18వ సీజన్ కోసం ఆ ఫ్రాంచైజీ గట్టిగానే సన్నద్ధమవుతోంది. ముందుగా కోచింగ్ సిబ్బందిపై గురి పెట్టిన యాజమాన్యం ఈమధ్యే ఆస్ట్రేలియా లెజెండ్ రికీ పాంటింగ్ ను హెడ్‌కోచ్‌గా తీసుకుంది. ఇప్పుడు బౌలింగ్ కోచ్ వేటను వేగవంతం చేసింది. ఆసీస్‌కు చెందిన మాజీ పేసర్ జేమ్స్ హోప్ బౌలింగ్ హెడ్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని సమాచారం.
అంతేకాదు బ్యాటింగ్ కోచ్ అయిన బ్రాడ్ హడిన్, స్పిన్ బౌలింగ్ కోచ్ సునీల్ జోషీలను కూడా మరో సీజన్ కొనసాగించేందుకు పంజాబ్ యాజమాన్యం ఆసక్తి చూపిస్తోంది. పద్దెనిమిదో సీజన్ కోసం ఆరుగురిని అట్టిపెట్టుకొనే అవకాశం ఉంది. దాంతో ఆ ఆరుగురి ఎంపికపై పంజాబ్ ఫ్రాంచైజీ కసరత్తు మొదలెట్టింది. ఈ విషయమైన హెడ్‌కోచ్ రికీ పాంటింగ్ నిర్ణయం తీసుకుంటాడని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.
పేసర్ అర్షదీప్ సింగ్ తో పాటు అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా శశాంక్ సింగ్‌లను పంజాబ్ రిటైన్ చేసుకోనుందని టాక్. మిగతా నలుగురిలో ఎవరు ఉంటారు? అనేది మాత్రం తెలియాల్సి ఉంది. ఇక 17వ సీజన్‌లో తీవ్రంగా నిరాశపరిచిన పంజాబ్‌కు ప్రధాన కోచ్‌గా ట్రెవర్ బేలిస్, హెడ్ ఆఫ్ క్రికెట్ డెవలప్‌మెంట్‌గా సంజయ్ బంగర్‌లు సేవలందించిన విషయం తెలిసిందే.

## అదంతా తాత్కాలికమే.. బాబర్ అజామ్ మళ్లీ వచ్చేస్తాడు

### పాక్ మాజీ క్రికెటర్ బసిత్ అలీ



**ఇస్లామాబాద్ :** పాక్ మాజీ కెప్టెన్ బాబర్ అజామ్ ఆటతీరు ఇటీవల దారుణంగా తయారైంది. చాన్నాళ్లుగా బాబర్‌ను తప్పించాలనే డిమాండ్లూ అక్కడి అభిమానుల నుంచి వచ్చాయి. అయినా అతడికి అవకాశాలు ఇస్తూనే ఉన్న మేనేజ్‌మెంట్.. ఇంగ్లాండ్‌తో తొలి టెస్టు అనంతరం అతడిని పక్కన పెట్టేసింది. బాబర్‌తో పాటు సీనియర్ పేసర్ షహీన్ షా అఫ్రిదిని కూడా తప్పించింది. తాజాగా రెండో టెస్టులో ఇంగ్లాండ్‌ను పాకిస్థాన్ చిత్తు చేసి సంచలన విజయం నమోదు చేసింది. స్టార్లు ఇద్దరు లేకపోయినా గెలవడంతో వీరిద్దరికి జట్టులో చోటు కష్టమేనన్న వ్యాఖ్యలు వినిపించాయి. అతడి స్థానంలో వచ్చిన కమ్రామ్ ఘులామ్ సెంచరీతో రాణించడం ఇప్పుడు ఈ చర్చకు మరింత ఊపు తెచ్చింది. అయితే, బాబర్‌కు ఎప్పుడూ టీమ్‌లో స్థానం ఉంటుందని.. అతడిని పక్కన పెట్టడం తాత్కాలికమేనని మాజీ క్రికెటర్ బసిత్ అలీ వ్యాఖ్యానించాడు.
"బాబర్ అజామ్‌ను తప్పించడంపై నానారకాలుగా వ్యాఖ్యలు వస్తున్నాయి. కానీ, అతడికి ఎప్పటికీ జట్టులో స్థానం ఉంటుంది. తప్పకుండా రెండు లేదా మూడు టెస్టుల తర్వాత జట్టులోకి వస్తాడు. ఫామ్ కోల్పోవడం క్రికెటర్లకు సహజమే. బాబర్ విషయంలో జట్టులో నుంచి తప్పించడం తాత్కాలికమే. మళ్లీ ఫుల్‌ఫామ్‌తో వస్తాడు" అని బసిత్ తెలిపాడు. ఇంతకుముందు రమీజ్ రజా కూడా పాక్ స్పాన్సర్‌షిప్‌లపై తీవ్ర ప్రభావం పడుతుందని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.
తదుపరి కెప్టెన్ ఎవరు?
పరిమిత ఓవర్ల క్రికెట్ కెప్టెన్సీకి బాబర్ అజామ్ వీడ్కోలు పలికేశాడు. దీంతో అతడి స్థానంలో ఎవరిని నియమిస్తారనేది చర్చనీయాంశంగా మారింది. దీనిపై బసిత్ అలీ స్పందిస్తూ.. "జట్టును ముందుండి నడిపించే నాయకుడిని ఎంపిక చేయడంపై పీసీబీ దృష్టిపెట్టాలి. రాబోయే కాలంలో కీలక టోర్నీలు ఉన్నాయి. పాక్ ఆతిథ్యం ఇవ్వబోయే ఛాంపియన్స్ ట్రోఫీ కూడా ఉంది. ఈ పాత్రకు మహ్మద్ రిజ్వాన్ లేదా సల్మాన్ అఘాలో ఒకరు సరిగ్గా సరిపోతారనిపిస్తోంది. ఒకరిని పరిమిత ఓవర్ల ఫార్మాట్ల సారథిగా నియమిస్తే బెటర్" అని అలీ వెల్లడించాడు.

# షకీబ్‌కు షాకిచ్చిన బంగ్లా బోర్డు..



**ఢాకా :** ప్రపంచంలోని గొప్ప ఆల్‌రౌండర్లలో ఒకడైన షకీబుల్ హసన్‌కు సొంత బోర్డు షాకిచ్చింది. స్వదేశంలో ఆఖరి టెస్టు ఆడి సగర్వంగా వీడ్కోలు పలకాలనుకున్న అతడికి జట్టులో చోటు దక్కలేదు. దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు కోసం షకీబ్ స్థానంలో యువ స్పిన్నర్‌ను బంగ్లాదేశ్ సెలెక్టర్లు ఎంపిక చేశారు. సఫారీలతో మిర్పూర్ టెస్టు కోసం లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ హసన్ మురాద్ను తీసుకుంటున్నట్టు బంగ్లా క్రికెట్ బోర్డు ప్రకటించింది. దాంతో, ఫేర్‌వెల్ టెస్టుపై ఆశలు పెట్టుకున్న దిగ్గజ ఆల్‌రౌండర్ కల చెదిరేలా ఉంది.భారత పర్యటనలోనే వీడ్కోలు నిర్ణయం వెల్లడించిన షకీబ్ స్వదేశంలో ఆఖరి టెస్టు ఆడాలని ఉందని మనసులోని మాట చెప్పాడు. అయితే.. తనకు భద్రత కల్పించాల్సిన బాధ్యత బంగ్లా తాత్కాలిక ప్రభుత్వానిదే అని డిమాండ్ చేసిన షకీబ్.. రెండు నెలల క్రితం బంగ్లాలో అల్లర్లు చెలరేగిన సమయంలో మౌనంగా ఉన్నందుకు దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాడు కూడా.అయినా సరే సెలెక్టర్లు అతడి పేరును తొలి టెస్టుకు పరిగణనలోకి తీసుకోలేదు. అందువల్ల ప్రస్తుతం దుబాయ్‌లో ఉన్న షకీబ్ స్వదేశం వెళ్లలేదు. 'నేను తర్వాత ఎక్కడికి వెళ్తానో తెలియదు. అయితే.. కచ్చితంగా మా దేశానికి మాత్రం పోను' అని షకీబ్ తెలిపాడు.
'తొలి టెస్టుకు షకీబ్ అందుబాటులో ఉండడం లేదు. అయితే.. అతడు టెస్టు కెరీర్‌లో చివరి అంకంలో ఉన్నాడు. అనుభవజ్ఞుడైన షకీబ్ బ్యాటుతో, బంతితో చెలరేగగలడు. అతడి స్థానాన్ని భర్తీ చేయగల ఆటగాడు అయితే ఇప్పటికి లేడు. అయితే.. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో హసన్ మురాద్ నిలకడగా రాణిస్తున్నాడు. ముఖ్యంగా స్వదేశంలో అతడు బౌలింగ్ బాగా చేస్తున్నాడు. దక్షిణాఫ్రికాపై ఈ యువకెరటం రాణిస్తాడని ఆశిస్తున్నాం' అని బంగ్లా క్రికెట్ బోర్డు జాతీయ సెలెక్షన్ కమిటీ చైర్మన్ ఘాజీ అష్రఫ్ హొసేన్ వెల్లడించాడు.
తొలి టెస్టుకు బంగ్లాదేశ్ స్క్వాడ్ : నజ్ముల్ హుసేన్ శాంటో(కెప్టెన్), షద్మాన్ ఇస్లాం, మహ్మదుల్ హసన్ జాయ్, జకీర్ హసన్, మొమినుల్ హక్, ముష్ఫికర్ రహీం, లిటన్ దాస్(వికెట్ కీపర్), జకీర్ అలీ, మెహిదీ హసన్ మిరాజ్, తైజుల్ ఇస్లాం, నయీం హసన్, తస్కిన్ అహ్మద్, హసన్ మహ్మూద్, నిషద్ రానా, హసన్ మురాద్.






విశ్వంభర V3 NEWS



## రెండు భాగాలుగా

# అనుష్క కొత్త సినిమా

హీరోయిన్ అనుష్క ప్రస్తుతం ఒకే సారి రెండు చిత్రాలలో నటిస్తున్నారు. ఈ రెండూ షూటింగ్ జరుపుకుంటున్నాయి. దీంతో సెట్స్‌పై ఆమె తీరిక లేకుండా గడుపుతున్నారు. ఈ చిత్రాల్లో కథనార్ - ది వైల్డ్ సోర్సెరర్ ఒకటి. ఇది అనుష్కకు మొదటి మలయాళ సినిమా. రోజిన్ థామస్ ఈ కథనార్ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. గోకులం గోపాలన్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. జయ సూర్య హీరోగా నటిస్తున్నారు. హారర్ ఫాంటసీ థ్రిల్లర్‌గా ఇది ముస్తాబవుతోంది. తాజాగా ఈ సినిమా గురించి ఇంట్రెస్టింగ్ అప్డేట్ వచ్చింది. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ఆ మధ్య ప్రచారం సాగింది. అలాగే ఈ మూవీ షూటింగ్ కూడా పూర్తైనట్లు వార్తలు వచ్చాయి.తాజాగా ఈ విషయంపై క్లారిటీ ఇచ్చింది చిత్ర బృందం. 212 రోజుల పాటు 6 షెడ్యూల్స్‌లో చిత్రీకరణ పూర్తి చేసుకున్నట్లు దర్శకుడు రోజిన్ థామస్ చెప్పారు. 9వ శతాబ్దపు క్రైస్తవ మత గురువు కడమత్తత్తు కథనార్ కథను ఆధారం ఈ సినిమాను తెరకెక్కించారు. చిత్రంలో అనుష్క మునుపెన్నడూ చూడని భిన్నమైన అవతారంలో కనిపించనుందట.ప్రస్తుతం కథనార్ నిర్మాణానంతర పనులు శరవేగంగా సాగుతున్నాయి. సినిమాను 14 భాషల్లో విడుదల చేయనున్నారట. త్వరలోనే మూవీ విడుదల తేదీపై స్పష్టత రానుంది. ఈ సినిమాకు రాహుల్ సుబ్రహ్మణ్యం సంగీతం అందించారు. నీల్ డి కున్హా ఛాయాగ్రహణం బాధ్యతలు చూసుకున్నారు. కేరళలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇకపోతే అనుష్క శెట్టి తెలుగులోనూ ఓ సినిమా చేస్తున్నారు. దర్శకుడు క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో ఘాటీ అనే సినిమా చేస్తున్నారు. బలమైన కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతోందని, ఇందులో సవాల్‌తో కూడిన పాత్రలో అనుష్క కనిపించనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి.కాగా, అనుష్క చివరగా మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమాలో కనిపించారు. గత ఏడాది విడుదలైన ఈ చిత్రాన్ని పి. మహేష్ బాబు దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన దక్కింది.

# పీరియాడికల్ డ్రామాలో అఖిల్



అఖిల్ అక్కినేని 'ఏజెంట్' సినిమా పరాజయం తర్వాత ఆయన నుంచి మరో సినిమా అప్‌డేట్ రాలేదు. సురేందర్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీసు దగ్గర డిజాస్టర్‌గా మిగిలింది. ఇప్పటికీ ఓటీటీలో కూడా విడుదల కాలేదు. ఈ మూవీ వచ్చి ఏడాది దాటినా తన నెక్స్ట్ ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చెయ్యలేదు అఖిల్. దీంతో అసలు అఖిల్ కు ఎలాంటి సినిమా పడాలి? అఖిల్‌ని ఎలా ప్రేక్షకులలో నిలబెట్టాలి? అనే ఆలోచనలో పడ్డారట కింగ్ నాగార్జున. అయితే ఈ సారి ఆయనే స్వయంగా రంగంలోకి దిగి అఖిల్ ప్రాజెక్ట్స్ ని పరిశీలిస్తున్నారట. ఈ నేపథ్యంలోనే ఒక స్మాల్ డైరెక్టర్ పీరియాడికల్ డ్రామా ప్రాజెక్ట్ కి అఖిల్ ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. ఇంతకీ ఆ ప్రాజెక్ట్ ఏంటంటే.. వాస్తవానికి 'ఏజెంట్' తర్వాత అఖిల్ చేయబోయే సినిమా యూవీ క్రియేషన్స్ బ్యానర్‌లో ఉంటుందనేలా ఏడాది కాలంగా ప్రచారం జరుగుతూనే ఉంది కానీ.. ఈ ప్రాజెక్ట్ ముందుకు వెళుతున్నట్లుగా అయితే ఎటువంటి అప్డేట్ ఇంత వరకు రాలేదు. ఆ ప్రాజెక్ట్ సంగతి ఏమోగానీ.. ఇప్పుడు ఓ యువ దర్శకుడు చెప్పిన స్టోరీ నచ్చటంతో అఖిల్ సినిమాకి ఓకే చెప్పాడట.కిరణ్ అబ్బవరంతో 'వినరో భాగ్యము విష్ణు కథ' వంటి హిట్టు సినిమా తీసిన మురళీ కిషోర్ చెప్పిన కథ నచ్చడంతో.. అఖిల్ నెక్స్ట్ ప్రాజెక్ట్‌గా ఈ సినిమా ఉండబోతుందని, ఈ సినిమా తిరుపతి బ్యాక్ డ్రాప్ లో పీరియాడికల్ డ్రామాగా తెరకెక్కనుందని సమాచారం. అన్నపూర్ణ స్టూడియోస్‌కు అనుబంధంగా మనం ఎంటర్‌ప్రైజెస్ అనే బ్యానర్‌లో ఈ సినిమాను నాగార్జున, చైతన్య నిర్మించాలని చూస్తున్నారట. ఇక అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఒకటే బాకీ అని సమాచారం. మరోవైపు అఖిల్ ఎన్నడూ లేని విధంగా గుబురు గడ్డం, కోర మీసాలు, పొడవాటి జుట్టుతో సూపర్ స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. అయ్యగారి లేటెస్ట్ లుక్ చూసి అందరూ అవాక్కవుతున్నారు. అక్కినేని ఫ్యాన్స్ మాత్రం తమ హీరో నయా లుక్ చూసి ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఈ మేకోవర్ అంతా కచ్చితంగా తన తదుపరి చిత్రం కోసమే అని అభిప్రాయపడుతున్నారు అభిమానులు. అయితే అఖిల్.. అనిల్ కుమార్ అనే కొత్త దర్శకుడితో సినిమా చేయనున్నట్లు కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. 'సాహో', 'రాధేశ్యామ్' వంటి సినిమాలకు దర్శకత్వ శాఖలో పని చేశారు. ఇప్పుడు యూవీ క్రియేషన్స్ బ్యానర్‌లో అఖిల్ 6' మూవీతో దర్శకుడిగా పరిచయం కాబోతున్నట్లు సమాచారం. భారీ బడ్జెట్‌తో తెరకెక్కే పీరియాడిక్ యాక్షన్ మూవీ అని, దీనికి 'ధీర' అనే టైటిల్ కూడా అనుకుంటున్నారని ప్రచారం జరిగింది. ఏప్రిల్‌లో బర్త్‌డే స్పెషల్‌గా ఈ ప్రాజెక్ట్‌ను అధికారిక ప్రకటన చేస్తారనుకున్నారు. కానీ అది జరగలేదు. అయితే ఇప్పుడు అఖిల్ ఈ మూవీ కోసమే సరికొత్తగా మేకోవర్ అవుతున్నారని టాక్ వినిపిస్తోంది.

# జనవరిలో కార్తీ మరో మూవీ




హీరో కార్తీ నటిస్తున్న కొత్త చిత్రం 'వా వాత్తియార్' ను వచ్చే యేడాది జనవరిలో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల 'మెయ్యళగన్' విడుదలై విజయం సాధించింది. ఈ సినిమా తర్వాత నలన్ కుమారస్వామి దర్శకత్వంలో కార్తీ కొత్త చిత్రం తెరకెక్కుతుంది. సీనియర్ నటుడు రాజ్ కిరణ్ తాతగా, సత్యరాజ్ విలన్ పాత్రల్లో కనిపించనున్నారు. హీరోయిన్‌గా కృతిశెట్టి నటించగా, ఆనంద్ రాజ్ మరో ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను జరుపుకుంటుంది. ఈ సందర్భంగా మేకర్స్ ఈ సినిమా రిలీజ్‌కు సంబంధించిన వివరాలను తెలియజేశారు. స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆయన ఈ చిత్రం విడుదలపై స్పందిస్తూ.. జనవరి నెలలో 'వా వాత్తియార్'ను విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఈ సినిమాను రూపొందించాము. ముఖ్యంగా కార్తీ నుండి ప్రేక్షకులు ఎలాంటి సినిమాను అయితే ఊహిస్తారో.. అలాంటి సినిమానే ఇది. నలన్ కుమారస్వామి డైరెక్షన్ అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. భారీ తారాగణం ఇందులో నటిస్తున్నారు. కచ్చితంగా ఈ సినిమా ప్రేక్షకులను మెప్పిస్తుందని తెలిపారు. సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్‌ను కూడా త్వరలోనే స్టార్ట్ చేస్తామని ఆయన చెప్పుకొచ్చారు. కార్తీ విషయానికి వస్తే.. ఇటీవల అరవింద్ స్వామితో కలిసి ఆయన చేసిన 'మెయ్యళగన్' చిత్రం ప్రేక్షకుల నుండి మంచి స్పందనను రాబట్టుకుంది. '96' ఫేమ్ సి ప్రేమ్ కుమార్ దర్శకత్వంలో, 2డి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సూర్య, జ్యోతిక ఈ చిత్రాన్ని నిర్మించారు. సెప్టెంబర్ 28న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా ప్రేక్షకులు, విమర్శకుల ప్రసంశలు అందుకుని డీసెంట్ సక్సెస్‌ను సొంతం చేసుకుంది. తెలుగులో ఈ సినిమా 'సత్యం సుందరం' పేరుతో విడుదలై.. మంచి స్పందనను రాబట్టుకుంది.

# పవన్ కల్యాణ్ 'ఓజీ'లో ప్రకాశ్ రాజ్..?





ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఒకవైపు ప్రజలకు అందుబాటులో ఉంటునే సినిమాలకు సమయం కేటాయిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే అతడు నటిస్తున్న హరిహర వీరమల్లు తో పాటు ఓజీ సినిమాలు షూటింగ్ మళ్లీ మొదలుపెట్టాయి. అయితే పవన్ నటిస్తున్న ఓజీ చిత్రం నుంచి ఒక సాలిడ్ అప్‌డేట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. సాహో' ఫేం సుజీత్ దర్శకత్వంలో పవన్ నటిస్తోన్న తాజా చిత్రం 'ఓజీ' (ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్). జపాన్ బ్యాక్‌డ్రాప్‌లో గ్యాంగ్‌స్టర్ కథాంశంతో ఈ సినిమా సిద్ధమవుతుండగా.. తాజాగా షూటింగ్ ప్రారంభించింది ఈ చిత్రం ఇప్పటికే మూవీ నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు గ్లింప్స్ విడుదల చేయగా అభిమానులను అలరించాయి. అయితే తాజాగా ఈ మూవీలో నటుడు ప్రకాశ్ రాజ్ విలన్ పాత్రలో నటించబోతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ చిత్రం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో షూటింగ్ జరుపుకుంటోంది. ఈ షెడ్యూల్‌లో పవన్ జాయిన్ అయినట్లు సమాచారం. అయితే ఈ సినిమాలో విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ కూడా నటిస్తున్నారని టాక్. ప్రకాశ్ రాజ్ - పవన్ మధ్య కీలకమైన సన్నివేశాలను చిత్రీకరించేందుకు దర్శకుడు కూడా ప్లాన్ చేస్తున్నట్లు సోషల్ మీడియాలో టాక్ వినిపిస్తుంది. అలాగే వీరిద్దరిపై ఓ ఫైట్ సీన్ సైతం షూట్ చేస్తారని తెలుస్తోంది. ఒకవేళ ఇదే నిజమైతే మెగా అభిమానులకి పండగ అని చెప్పుకోవాలి. తిరుమల లడ్డూ విషయంలో రీసెంట్‌గా వీరిద్దరి మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమైన విషయం తెలిసిందే. దీంతో షూటింగ్ సెట్స్‌లో వీళ్లు ఎలా ఉండబోతున్నారు అనేది హాట్ టాపిక్‌గా మారింది. కాగా ఈ విషయంపై చిత్రబృందం అధికారిక ప్రకటన ఇవ్వవలసి ఉంది.

# కీర్తి సురేశ్ లగ్జరీ లైఫ్



'మహానటి' సినిమాతో ఈ తరం హీరోయిన్లలో తన ప్రత్యేకతను చాటుకున్న కీర్తి సురేశ్ 32వ వసంతంలోకి అడుగుపెట్టారు. జయాపజయాలు పక్కకుపెట్టి ఎప్పుడూ పాజిటివ్‌గా ఉంటూ సక్సెస్ సాధిస్తామనే నమ్మకంతో కెరీర్‌లో ముందుకెళ్తుంటారు. 'పైలట్స్' అనే మళయాల సినిమాతో చైల్డ్ ఆర్టిస్ట్‌గా సినీ రంగ ప్రవేశం చేశారు కీర్తి. నటులు సురేశ్ కుమార్, మేనకల కుమార్తె కావడంతో ఈ అవకాశం ఆమెకు సులువుగానే వచ్చింది. ఈ మూవీ తర్వాత మరో రెండు సినిమాల్లోనూ నటించారు కూడా. ఆ తర్వాత చదువు పూర్తి చేసుకుని పూర్తి సినిమా రంగంలోనే సెటిల్ అవ్వాలని ఫిక్స్ అయ్యారు కీర్తి. మూడు సినిమాలల్లో హీరోయిన్‌గా ఎంపికై, అనంతరం ఆ చిత్రాల షూటింగ్‌లు ఆగిపోవడంతో లాంచింగ్ కష్టమైంది. ఎట్టకేలకు మోహన్ లాల్ హీరోగా తెరకెక్కిన 'గీతాంజలి'తో హీరోయిన్‌గా పరిచయం అయ్యారు. అందులో గీత, అంజలి అనే డ్యూయెల్ రోల్స్ చేసి శభాష్ అనిపించుకున్నారు. 'గీతాంజలి' సక్సెస్ తర్వాత 'రింగ్ మాస్టర్' మోస్తారు పేరు మాత్రమే తెచ్చిపెట్టింది. తమిళ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన తర్వాత మళ్లీ కష్టాలే. తొలి తమిళ సినిమా 'ఇదు ఎన్న యామమ్' ఫ్లాప్. టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తూ చేసిన తొలి సినిమా 'రెండు జళ్ల సీత' వాయిదా పడుతూనే ఉంది. అలా మూడు పరిశ్రమల్లోనూ మంచి విజయం అందుకోలేకపోవడంతో కీర్తి సురేశ్ ఐరన్ లెగ్ అంటూ ఇండస్ట్రీలో పుకార్లు మొదలయ్యాయి. ప్రయత్నాలు ఆపని కీర్తి రామ్ హీరోగా తెరకెక్కిన 'నేను శైలజ'తో మంచి సక్సెస్ అందుకున్నారు కీర్తి సురేశ్. అంతే టాలీవుడ్‌తో పాటు కోలీవుడ్ నుంచి కూడా ఆమెను వెతుక్కుంటూ అవకాశాలు పరిగెత్తుకొచ్చాయి. అలా కమర్షియల్ సినిమాలు చేస్తున్న సమయంలో డైరక్టర్ నాగ్ అశ్విన్ దర్శకత్వంలో మహానటి చేసి నేషనల్ అవార్డును అందుకుంది. అనంతరం నటించిన 'సామి స్క్వేర్', 'పందెం కోడి 2', లేడి ఓరియెంటెడ్ ఫిల్మ్స్ అయిన 'పెంగ్విన్', 'మిస్ ఇండియా', 'గుడ్ లక్ సఖి' సినిమాలు అంతగా సక్సెస్ సాధించలేదు. ఆ తర్వాత 'దసరా', 'మామన్నన్'తో మళ్లీ ట్రాక్‌లోకి వచ్చారు. రీసెంట్‌గా 'సైరన్', 'రఘు తాత' సినిమాల్లో కనిపించిన కీర్తి, 'రివాల్వర్ రీటా', 'కన్నివేడి', 'ఉప్పు కప్పురంబు' సినిమాల షూటింగుల్లో బిజీగా ఉన్నారు. ఇవే కాకుండా బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇస్తూ 'బేబీ జాన్' అనే హిందీ సినిమాలో నటిస్తున్నారు. కీర్తి కెరీర్‌లో టాప్ సినిమాలు రొటీన్‌కు భిన్నంగా కెరీర్‌లో ఎప్పుడూ కొత్త పాత్రల కోసం పరితపించే కీర్తి సురేశ్‌ను ఈ సినిమాలు మాత్రం ప్రేక్షకుల్లో ప్రత్యేక స్థానాన్ని తెచ్చిపెట్టాయి. ఇధు ఎన్నా మాయం (2015), రింగ్ మాస్టర్ (2014), నేను శైలజ (2016), రజినీమురుగన్ (2016), రెమో (2016), భైరవా (2017), నేను లోకల్ (2017), సర్కార్ (2018), తానా సెరిందా కూట్టమ్ (2018), మహానటి (2018), మిస్ ఇండియా (2021), సర్కారు వారి పాట (2022) చిత్రాలు ఆమెకు మంచి పేరు తెచ్చిపెట్టాయి. నెట్ వర్త్ ఎంతంటే? అభినయం, అందంలోనే కాదు కీర్తి సురేశ్‌కు నెట్ వర్త్ కూడా బానే ఉంది. ఒక్కో సినిమాకు రూ.4 కోట్లు, ఒక యాడ్ కోసం రూ.30 లక్షలు, సోషల్ మీడియాలో ఒక పోస్టు కోసం రూ.25 లక్షలు ఛార్జ్ చేస్తుంటారట. ప్రస్తుతం ఆమె ఆస్తుల విలువ రూ.41 కోట్లకు పైమాటే అని ఇంగ్లీష్ కథనాల్లో రాసి ఉంది. ఎక్కువగా ఆమె యాక్టింగ్, ఎండోర్స్‌మెంట్‌లు, బ్రాండ్ డీల్స్ ద్వారా సంపాదిస్తారట. విలాసవంతమైన ఇల్లు చెన్నైలో కీర్తి సురేశ్‌కు ఒక ఇల్లు ఉందట. ఇక్కడ ఆమె తన తల్లి దండ్రులతో కలిసి ఉంటారు. హైదరాబాద్‌లోని జూబ్లీ హిల్స్‌లో కూడా ఒక లగ్జరీ అపార్ట్ మెంట్ ఉందట. లగ్జరీ, విదేశీ కార్ల సంగతి చెప్పక్కరలేదు.

## జై హనుమాన్‌లో

# హనుమంతుడిగా పాన్ ఇండియా స్టార్



దర్శకుడు ప్రశాంత్ వర్మ పేరు 'హనుమాన్' సినిమా విజయంతో ఒక్కసారిగా మారుమోగింది. అతను తదుపరి సినిమా కూడా 'హనుమాన్' సినిమాకి సీక్వెల్‌గా 'జై హనుమాన్' తీస్తున్నట్టు ప్రకటించారు. అందులో అగ్రనటులు నటిస్తున్నారని వార్తలు బాగా వ్యాప్తి చెందిన విషయం కూడా అందరికీ తెలిసిన విషయమే. ఇప్పటికే బాలీవుడ్ అగ్రనటుల్లో ఒకరైన రణ్‌వీర్ సింగ్ ఈ సినిమాలో నటిస్తున్నట్లు టాక్ వినిపించింది. మరోవైపు చిరంజీవి, రామ్‌చరణ్, రానా దగ్గుబాటిలలో ఎవరైనా ఒకరు హనుమంతుడి క్యారెక్టర్ చేయనున్నట్లు ఊహాగానాలు ఊపందుకున్నాయి. అయితే అవన్నీ కేవలం పుకార్లే అని తేలింది. తాజాగా హనుమంతుడి రోల్ కోసం ఒక పాన్ ఇండియన్ స్టార్‌ని డైరెక్టర్ ప్రశాంత్ వర్మ ఖరారు చేసినట్లు సమాచారం. ఇంతకీ ఆ హీరో ఎవరంటే..తేజ సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన చిత్రం 'హనుమాన్'. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకుంది. కోట్ల రూపాయల కలెక్షన్లు రాబట్టింది. పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చిపెట్టింది. కాంతారా సినిమాతో జాతీయ గుర్తింపు పొందిన హీరో రిషబ్ శెట్టి. దైవ భక్తి మెండుగా ఉండే ఈ హీరోకి ప్రశాంత్ 'జై హనుమాన్' స్టోరీ నేరేట్ చేసినట్లు సమాచారం. కథ నచ్చిన రిషబ్ హనుమాన్ రోల్ చేయడానికి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. దీంతో ఈ క్రేజీ కాంబోపై అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇది కేవలం ఇండస్ట్రీ లీక్.. అఫిషియల్‌గా ఇంకా అనౌన్స్ మెంట్ చేయాల్సిన అవసరం ఉంది. కాగా హనుమాన్ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేసిన ప్రైమ్ షో కాకుండా మైత్రి మూవీ మేకర్స్ ఈ సినిమాని నిర్మించనుండటం విశేషం. కన్నడ సినిమా ప్రైడ్ గా తెరకెక్కిన 'కాంతారా' జాతీయ అవార్డులను కొల్లగొట్టింది. ఇండియన్ వైడ్ గా క్రేజి హిట్ అందుకున్న ఈ సినిమా ఇప్పుడు 'కాంతారా చాప్టర్ 1' (Kantara chapter 1) గా ప్రీక్వెల్ సిద్ధం సిద్ధమవుతుంది. భారీ గ్రాఫిక్స్ హంగులతో ఈ చిత్రం ముస్తాబు కానుందని దర్శకుడు ఓ సందర్భంలో చెప్పారు. ఈ సినిమా కోసం ఓ ప్రముఖ హాలీవుడ్ వీఎఫ్ఎక్స్ కంపెనీతో చిత్ర బృందం చేతులు కలిపిందని సమాచారం. 'ది క్రానికల్స్ ఆఫ్ నార్నియా', 'ది లయన్ కింగ్', 'బాట్‌మ్యాన్' లాంటి విజయవంతమైన హాలీవుడ్ సినిమాలకు విజువల్ ఎఫెక్స్ అందించిన ఆ సంస్థ ఇప్పుడు ఈ ప్రీక్వెల్ కోసం పని చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే దీనికి సంబంధించిన పనులు యూఎస్, యూకేల్లో జరుగుతున్నట్లు శాండల్‌వుడ్ మీడియా చెబుతోంది. ఈ సినిమా ప్రస్తుతం కుందాపుర తీర ప్రాంతంలో నిర్మించిన భారీ సెట్‌లో శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటున్నట్లు తెలిసింది. ఈ పాత్ర కోసం రిషబ్ ఇప్పటికే కళరిపయట్టు, గుర్రపు స్వారీలో కఠిన శిక్షణ తీసుకున్నారు. వచ్చే ఏడాది దక్షిణాది భాషలతోపాటు హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

# శాంసంగ్ గెలాక్సీ ఏ16 5జీ పేరిట మార్కెట్లోకి కొత్త ఫోన్



**విశ్వంభర (బిజినెస్) :** ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ శాంసంగ్ మరో కొత్త ఫోన్‌ను మార్కెట్లోకి లాంచ్ చేసింది. 'ఏ' సిరీస్‌లో ఫోన్లకు వచ్చిన ఆదరణ నేపథ్యంలో మరో ఫోన్‌ను ఆవిష్కరించింది. శాంసంగ్ గెలాక్సీ ఏ16 5జీ పేరిట దీన్ని పరిచయం చేసింది. ఆరేళ్ల పాటు సెక్యూరిటీ, సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లతో తీసుకురావడం విశేషం. శాంసంగ్ కొత్త ఫోన్ రెండు వేరియంట్లలో లభిస్తుంది. 8జీబీ + 128జీబీ వేరియంట్ ధర ₹.18,999గా కంపెనీ నిర్ణయించింది. 8జీబీ +256జీబీ వేరియంట్ ధర ₹.20,999గా పేర్కొంది. బ్లూ బ్లాక్, గోల్డ్, లైట్ గ్రీన్.. రంగుల్లో ఈ మొబైల్ లభిస్తుంది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, శాంసంగ్ వెబ్‌సైట్లతో పాటు ఇతర రిటైల్ దుకాణాల ద్వారా కొనుగోలు చేయొచ్చని కంపెనీ తెలిపింది. యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్ సాయంతో కొనుగోలు చేస్తే వెయ్యి రూపాయలు డిస్కౌంట్ అందిస్తోంది.

గెలాక్సీ కొత్త మొబైల్ 6.7 అంగుళాల ఫుల్ హెచ్‌డీ+ అమోలెడ్ డిస్‌ప్లే, 90Hz రిఫ్రెష్ రేటు కలిగిఉంటుంది. మీడియాటెక్ డైమెన్సిటీ 6300 ప్రాసెసర్‌తో పనిచేస్తుంది. మైక్రో ఎస్‌డీ కార్డ్ తో 1టీబీ వరకు స్టోరేజీ పెంచుకొనే సదుపాయం, ఇందులో 50ఎంపీ ప్రధాన కెమెరా, 5ఎంపీ అల్ట్రా వైడ్ యాంగిల్ సెన్సర్, 2ఎంపీ మ్యాక్రో లెన్స్ ఉన్నాయి. ఇక ముందువైపు సెల్ఫీ కోసం 13ఎంపీ కెమెరా అమర్చారు. IP54 రేటింగ్‌తో లాంచ్ చేసిన మొబైల్‌లో శాంసంగ్ నాక్స్ వాల్ట్ సెక్యూరిటీ ఫీచర్లు కూడా అందిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ఇందులోని ఎన్‌ఎఫ్‌సీ ద్వారా ట్యాప్ అండ్ పే సదుపాయం పొందొచ్చని కంపెనీ తెలిపింది. 5,000mAh బ్యాటరీతో వచ్చిన మొబైల్ 25W ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. సింగిల్ ఛార్జితో రెండున్నర రోజుల వరకు బ్యాటరీ లైఫ్ వస్తుందని కంపెనీ చెబుతోంది.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com